# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 సంచిక : 2 విజయవాడ 20-5-2011 పేజీలు : 16 వెల: రు 5.00


లోపలి పేజీల్లో...


- బిన్‌లాడెన్ హత్య–అంతర్జాతీయ న్యాయసూత్రాల కాలరాచివేత
- ప్రపంచ వ్యాపితంగా మేడే ప్రదర్శనలు
- ఎండోసల్ఫాన్ నిషేధానికి భారత దళారీ పాలకుల నిరాకరణ
- దారిమళ్ళుతున్న షెడ్యూల్డ్ తెగల–కులాల నిధులు
- ప్రైవేటీకరణకు రాచబాటవేస్తున్న విద్యాహక్కు చట్టం నియమావళి
- సామాజిక రచనల కలమూ–ప్రజా ఉద్యమ కలకలమూ విశ్వమోహనరెడ్డి
- శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్ (బొమ్మనహళ్) యాజమాన్య దురాగతాలు


## రైతాంగ వ్యతిరేక ధాన్య సేకరణ విధానంపై పోరాడండి!

**రబీ** సీజనులో వరి దిగుబడులు బాగున్నందుకు రైతాంగం పొందిన ఆనందం ధాన్యం మార్కెట్టుకు చేరేసరికి యింకిపోయింది. వరికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.1030లకు కొనేందుకు మిల్లర్లు, వ్యాపారులూ నిరాకరిస్తున్నారు. రైతాంగంపై దయతలచి కొంటున్నట్లు ధరను వీలయినంత దిగ్గోస్తున్నారు. తేమ శాతం హెచ్చనీ, గోనె సంచుల కొరతనీ సవాలక్ష సాకులు చెబుతున్నారు. చివరకు రైతాంగానికి దక్కుతున్నది రూ.750–800 మధ్య మాత్రమే. ఎందుకీ దుస్థితి ఏర్పడింది? దిగుబడులు తగ్గినప్పుడూ, పెరిగినప్పుడూ కూడా రైతాంగమే ఎందుకు నష్టపోతున్నారు? కారణాలేమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకబోతే "రాజకుమారులు–ఎండని చేప కథ"లో లాగా గొలుసుకట్టు ప్రశ్నలు ఎదురొచ్చాయి. మిల్లర్లు ధాన్యం ఎందుకు కొనటం లేదంటే, ఎఫ్‌సిఐ తన కోటా ధాన్యాన్ని తరలించనందున మా గోదాముల్లో ఖాళీలేదు, కొత్త ధాన్యం నిల్వకు చోటులేదని సమాధానం. ఎఫ్‌సిఐ గోదాములెందుకు నిండిపోయాయంటే, బిపిఎల్, ఏపిఎల్ కార్డులకు కేటాయించిన బియ్యాన్ని రాష్ట్రం తీసుకోవటంలేదని సమాధానం. రాష్ట్రమెందుకు తీసుకోవటంలేదంటే మా ప్రజాపంపిణి వ్యవస్థ తీరు బాగానేవుంది, రైల్వేలు తగినన్ని గూడ్సు పెట్టెలు కేటాయించనందున, ఎఫ్‌సిఐ ఇతర రాష్ట్రాలకు బియ్యం తరలించనందున దాని గోదాములు నిండిపోయాయని సమాధానం. కేంద్రమా నీవేమిచేస్తున్నావంటే మరో 5,60,000 టన్నుల ధాన్యం నిల్వచేసే గోదాములు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని సమాధానం. అది సరే ప్రస్తుతం రైతాంగానికి చూపే ఊరట ఏమిటంటే గత ఏడాదికన్నా 32 లక్షల టన్నులు పండించిన రైతాంగం వల్ల సమస్య ఏర్పడింది; ఇక ఇతర రాష్ట్రాలకూ, విదేశాలకూ వరి ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయమని కేంద్రాన్ని కోరతానని రాష్ట్రం సమాధానం. ఎగుమతులు అనుమతిస్తే బియ్యం ధరలు పెరుగుతాయి గనుక బాగా ఆలోచించి నిర్ణయం చేస్తామని కేంద్రమంత్రి సమాధానం. త్రిప్పి త్రిప్పి రైతాంగం ఎక్కువ దిగుబడి సాధించటాన్ని నిందించారు. ఒకరిపై ఒకరు నెపం పెట్టుకుంటూ పుణ్యకాలం గడిపేస్తున్నారు. పంటను తెగనమ్ముకోవటమే తప్ప రైతాంగానికి ఎలాంటి ఊరట చేకూర్చే చర్యలూ ఉండవని చెప్పకుండానే చెబుతున్నారు.

సరిగ్గా సంవత్సరం క్రితం కూడా ఇదే సమస్య, ఇవే నెపాలు. సమ్మె చేస్తామని మిల్లర్ల హెచ్చరికలూ, గోదాములు నిర్మిస్తామని హామీలు, కనీస మద్దతు ధర చెల్లించని వారిపై కఠిన చర్యలని హుంకరింపులూ, బియ్యం ధరలు పెరుగుతాయన్న బెదిరింపులూ, దిక్కులేక రైతాంగం పంటను తెగనమ్ముకోవటం సాగింది. ఈ ఏడు ఎక్కువ పంట పండించారన్న నింద రైతాంగానికి అందిన అదనపు కితాబు!

గత ఏడాదిలాగే ప్రతిపక్షాలకు కావల్సినంత మేత దొరికింది. పోటీలుపడి మొసలి కన్నీరు కారుస్తున్నాయి. వ్యవసాయం దండగమారి పని, నన్నడిగి పంట వేశారా, ఇప్పుడు గిట్టుబాటు ధర ఇమ్మంటున్నారని ఈసడించుకున్న చంద్రబాబునాయుడే రోడ్డెక్కి మీ సత్తా చాటండని రైతాంగానికి పిలుపునిస్తున్నాడు. మీకు న్యాయం జరిగేవరకూ మీ తరపున పోరాడతానని హామీ యిస్తున్నాడు. రైతాంగంనుండి గుంజుకున్న భూముల పందారంతోనూ, జలయజ్ఞం పేరిట రైతాంగానికి చుక్కనీరందిచక పోయినా నిధుల కైంకర్యంతోను పొందిన అక్రమార్జనల కొండపై కూర్చున్న జగన్‌మోహనరెడ్డి రైతు దీక్ష పేరిట కాంగ్రెసు ఎంఎల్ఏలను తన చుట్టూ త్రిప్పుకునేందుకు పూనుకున్నాడు. వాగాడంబర ఉపన్యాసాలతో ధనాఢ్య వర్గాలకు లాభాలు చేకూర్చే విధానాలే పరిష్కారంగా చూపుతున్న ఈ పాలకవర్గ నేతల మోసాన్ని అర్థంచేసుకునేందుకు ప్రస్తుత సమస్య మూలాల్లోకి వెళ్ళి పరిశీలించాలి.

పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటిస్తున్నదంటే అర్థం వ్యాపారులు ఆ ధరకు కొననప్పుడు, ప్రభుత్వం తన కొనుగోలు సంస్థలను రంగంలోకి దింపి ధాన్యాన్ని కొనుగోలుచేసి, రైతాంగానికి ప్రకటిత కనీస మద్దతు ధర అందేట్లు చేస్తానని హామీ యివ్వటం. అప్పుడు వ్యాపారులు కనీస మద్దతు ధరకంటే ఎక్కువ ధర చెల్లించక తప్పదు. ఎందుకంటే రైతాంగం కనీస మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకుంటారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మార్కెట్టులో బియ్యం ధరలను అదుపుచేసేందుకు ప్రభుత్వం వినియోగించాలి. ఇదికాక పేదలకు చౌకధరలకు సరఫరా చేసేందుకు గూడా ప్రభుత్వం ధాన్యసేకరణ చేస్తుంది. ఈ విధానాన్ని భారత ప్రభుత్వం అనుసరిస్తూ వచ్చింది.

నూతన ఆర్థిక విధానాల ప్రారంభంతో ఈ విధానం మారింది. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, డీజిలు, ఎఫ్‌సిఐ ధాన్య సేకరణ, ప్రజాపంపిణీ వ్యవస్థలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను కలుపుకుంటే, దేశంలో ధాన్యం పండించటంకంటే విదేశాలనుండి దిగుమతి చేసుకుంటేనే తక్కువ ఖర్చు అవుతుందనీ, కనుక ఆహార పంటల సాగును మానివేయాలనీ, వాటి స్థానంలో వాణిజ్య పంటలువేసి వాటి ఎగుమతితో వచ్చిన ఆర్జనతో, ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవచ్చుననీ ప్రపంచబ్యాంకు సూచించింది. దీనినే ఆజ్ఞగా తీసుకున్న భారత పాలకులు ఆహార సబ్సిడీలను తగ్గించటం మొదలుపెట్టారు.

దీనిలో భాగంగానే ఎఫ్‌సిఐ ధాన్య సేకరణ లక్ష్యాలను తగ్గించివేశారు. ఎఫ్‌సిఐ కొనుగోలు కేంద్రాలను మూసివేసి మిల్లర్లనుండే ధాన్యాన్ని కొనుగోలుచేయటం ప్రారంభించారు. ఇదికాక రాష్ట్ర మార్కెటింగు సంస్థలనుండి కొనుగోలు చేస్తున్నారు. వరి ధాన్యం దిగుబడిలో 75శాతాన్ని లెవీగా మిల్లర్లనుండి సేకరించి మిగిలిన 25 శాతాన్ని బహిరంగ మార్కెట్టులో అమ్ముకునేందుకు అనుమతించాలి. అదనపు ఉత్పత్తివున్న రాష్ట్రాలనుండి సేకరించిన ధాన్యాన్ని లోటువున్న రాష్ట్రాలకు తరలిస్తుంది. అయితే ధాన్యసేకరణ లక్ష్యాలను తగ్గించినందువల్ల ఎఫ్‌సిఐ మిల్లర్లనుండి లెవీ ధాన్యసేకరణను తగ్గించివేసింది. ఖాళీ అయిన గోదాములను ప్రైవేటురంగానికి అద్దెకిచ్చింది. దాదాపుగా 4 లక్షల టన్నుల నిల్వచేయగల గోదాములను ఇలా అద్దెకిచ్చింది. కేంద్ర భండారన్ పథకంక్రింద నిర్మించిన గోదాముల్లో దాదాపు 4 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యంగల గోదాములు ఖాళీగానే వున్నాయి. దీనితోపాటుగా చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీని ఒక పద్ధతిప్రకారం తగ్గించివేశారు. దీనితో దీనికోసం రాష్ట్రానికి కేటాయించిన ధాన్యం ఎఫ్‌సిఐ గోదాముల్లోనే వుండిపోతున్నాయి. దీనితో గోదాములు నిండిపోయాయన్న సాకు చెప్పి ఎఫ్‌సిఐ ధాన్యసేకరణను తగ్గించివేసింది. దీనితో కనీస మద్దతు ధర కాస్తా ఆచరణలో గరిష్ట ధరగా మారిపోయింది. రైతాంగానికి న్యాయమైన ధర అందని మ్రానిపండు అయింది. దీనికితోడు మార్కెట్టు శక్తులకు స్వేచ్ఛనిస్తే అవి పోటీపడి ధరలను నియంత్రిస్తాయన్న ప్రపంచబ్యాంకు సూత్రీకరణను ఆమోదించిన ప్రభుత్వం ధరల నియంత్రణకు మార్కెట్టులో జోక్యం చేసుకోవటం మానివేసింది. దీనితో గుత్త వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచివేసి నిలువుదోపిడీ చేస్తున్నారు.

ఈ అసలు కారణాన్ని కప్పిపెట్టి రైతాంగం దృష్టిని ప్రక్క సమస్యలపైకి మళ్లిస్తున్నారు. గత రెండేళ్లుగా రబీసీజను వరి ధాన్యంలో ఇదే పరిస్థితి నెలకొంది. హామీలూ, ప్రకటనలే తప్ప ఎలాంటి దిద్దుబాటు చర్యలూ లేవు. ఎందుకంటే ఇది ఉద్దేశ్యపూరితంగా ప్రభుత్వం అమలుచేస్తున్న విధానం గనుక.

(తరువాయి 2వ పేజీలో)

ప్రకటన

## మరోసారి మోసపోయిన ప్రజలు

**ఐదు** రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడ్డాయి. అస్సాంలో కాంగ్రెసు పార్టీ అధికారాన్ని నిలబెట్టుకోగా, కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ అతికొద్ది మెజారిటీతో అధికారాన్ని కైవశంచేసుకున్నది. తమిళనాడు, పుదుచ్చేరిలలో డిఎంకేతో పొత్తు కట్టిన కాంగ్రెస్ పరాజయం పాలుకాగా, కాంగ్రెసు కొంగుపట్టుకుని తృణమూల్ పశ్చిమ బెంగాల్‌లో 34 ఏళ్ళ వామ పక్షపాలనకు ముగింపు పలకగలిగింది. ఈ ఎన్నికల ఫలితాలతో పార్లమెంటులో పార్టీల సంఖ్యాబలంలో మార్పులు లేకపోయినా, మన్మోహన్– సోనియా ద్వయానికి ఆర్థిక సంస్కరణల కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ఎన్నికల ఫలితాలు అనుమతించినట్లుగా కాంగ్రెసు పార్టీ వ్యాఖ్యానించి కేంద్ర ప్రభుత్వ విధానాల తీరెలా వుండబోతుందో సూచించింది.

తమిళనాడులోని రెండు ప్రాంతీయ పార్టీలూ, కేరళలోని రెండు ఫ్రంటులూ ఒకదాని తర్వాత మరొకటి ప్రతి ఐదేళ్లకూ అధికారంలోకి రావటం ఆనవాయితీగా వస్తున్నది, కేరళలో ఏ ఫ్రంటు అధికారంలోకి వచ్చినా స్వల్ప మెజారిటీతోనే వుండటమూ, అదే తమిళనాడులో అత్యధిక మెజారిటీతో రావటమూ కూడా ఆనవాయితీగానే వస్తున్నది. కనుక ఈ ఫలితాలు అనూహ్యమైనవేమీకాదు. ఎన్నికల పొత్తు ఏ పార్టీల మధ్య కుదిరినప్పటికీ, తమిళనాడులో అధికారంలోకి వచ్చిన పార్టీతో కేంద్రంలో అధికారంలో వున్న పార్టీల కూటమి జత కట్టడం కూడా ఆనవాయితీనే.

"కేంద్ర ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలకు భిన్నంగా లేని విధానాలను అనుసరిస్తున్న తమిళనాడు పాలకవర్గ పార్టీలు భూస్వామ్య, దళారీ వర్గాలకు సేవ చేస్తున్నవి. డిఎంకే, ఏఐడిఎంకేలు రెండూ ప్రజలను దోపిడీ చేస్తూ వేల కోట్ల రూ॥ల కుంభ కోణాల్లో మునిగి తెలుతున్నాయి. ఇవి అధికార పగ్గాలు తిరిగి చేజిక్కించుకుని ప్రజలను యథేచ్ఛగా దోపిడీ గావించేందుకు పోటీకి దిగి ప్రజలను ప్రలోభ పెట్టేందుకు అన్నిపద్ధతులూ అనుసరిస్తున్నాయి. గతంలో జయలలిత ఒక్క కలంపోటుతో హక్కుల కోసం సమ్మెచేసిన ఉద్యోగులను డిస్మిస్ చేసింది. ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యకు ఒడిగట్టిన ఏఐడియంకేను ప్రజలు చిత్తుగా ఓడించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన డిఎంకే అన్ని అధికార పదవులను చేజిక్కించుకొని కుటుంబపాలన సాగించింది. ఈ రెండు కూటములకూ ప్రజలు గోరీ కట్టాలి." అని సిపిఐ(ఎం–ఎల్) తమిళనాడు రాష్ట్ర కమిటీ విశ్లేషించింది.

కేంద్రంలో ఏకూటమి అధికారంలో వున్నా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలనే అమలు జరుపుతున్నాయి. తమిళనాడులో ఏపార్టీ అధికారంలోవున్నా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుకు కేంద్రంతో అన్ని విధాలా సహకరించాయి. ప్రపంచీకరణ విధానాలతో జీవితాలు కల్లోలభరితమైన ప్రజలు తమ ఆగ్రహాన్ని బలీయ ప్రజా ఉద్యమంగా మలిచే ప్రత్యామ్నాయం లేక ఒకరి స్థానంలో మరొకరికి అధికారాన్ని కట్టబెడుతున్నారు. తమిళనాడు "ఆనవాయితీ" రాజకీయమిదే. తామెదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎంచుకోగల ప్రత్యామ్నాయంలేని ప్రజలను ప్రతిసారి పాలకవర్గ పార్టీలు మోసానికి గురిచేస్తున్నాయి.

పశ్చిమబెంగాల్‌లో కూడా జరిగిందదే. అయితే 34 ఏళ్ల వామపక్షమని పిలుచుకునే వారి పాలన ఓటమికి గురవటంతో ఇది చర్చనీయాంశంగా మారింది. ప్రపంచీకరణ విధానాలను అమలు జరపడంలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ఫ్రంటుకూ, తృణమూల్ కాంగ్రెసు–కాంగ్రెసుకూటమికీ మధ్యసాగిన పోటీలో వామపక్ష ఫ్రంటు ఓటమికి గురైంది. "పరివర్తన" తెస్తానన్న నినాదం (ఒబామా ఎన్నికల నినాదం గుర్తుకొస్తున్నదా)తో బెంగాలు ప్రజలు మరోసారి మోసపోయారు.

సిపిఐ (ఎం–ఎల్) ఎన్నికల ప్రణాళిక ఇలా చెప్పింది. "రాష్ట్ర ప్రజానీకానికి రాబోయే పరిస్థితి ఎలా వుంటుందన్న విషయంలో ఒక అంశాన్ని స్పష్టంగా చెప్పగలం. వారి జీవనాధారాలు, జీవనాలు, ప్రజాస్వామిక హక్కులపై సాగుతున్న దాడిలో ఎలాంటి వెసులుబాటు ప్రజలకుండబోదు. సరైన అర్థంలో "పరివర్తన" (మార్పు) అన్నది వారి జీవితాలలో రాదు".

"సిపిఎం నాయకత్వంలో వామపక్ష ఫ్రంటు, మమతా నాయకత్వంలోని టి.ఎం.సి.–కాంగ్రెసు కూటమిలో ఎవరు అధికారంలోకి వచ్చినా సామ్రాజ్యవాదుల త్రిశూలమైన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచవాణిజ్య సంస్థలు రుద్దుతున్న ప్రపంచీకరణ విధానాల అమలు ఆగబోదు. అవిసాగిస్తున్న జీవన విధ్వంసం ఆగబోదు"

సామ్రాజ్యవాద పెట్టుబడిని దేశంలోకి ఆహ్వానించే కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పారిశ్రామిక విధానాన్ని రూపొందించింది. కేంద్ర సెజ్ చట్టానికి అనుగుణంగానే సింగూరు, నందిగ్రామ్‌లలో రైతాంగం భూమిని లాగుకుని బడా బూర్జువాలకు కట్టబెట్టింది. ప్రతిఘటించిన ప్రజలపై జైత్‌పూర్, సోంపేట, కాకరాపల్లిలలో లాగానే పాశవిక నిర్బంధానికి పూనుకుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకత మాటల వరకేననీ వాటిని అమలు చేయటంలో పాలకవర్గపార్టీలకు తానేమీ తీసిపోననీ నిరూపించుకుంది. దీనితోపాటు గద్దెనెక్కగానే పాలకవర్గ పార్టీలకు వచ్చే అవినీతి, ఆశ్రిత పక్షపాతాలకు తానూ అతీతం కాదని చూపెట్టుకుంది. కార్మికవర్గ పార్టీనని చెప్పుకుంటూనే కార్మికులు సమ్మె చేయటాన్ని సహించనని చెప్పింది. నిరంకుశాధికారాన్ని చెలాయించి ప్రజాగ్రహానికి గురైంది.

నూతన ఆర్థిక విధానాలను ప్రారంభించిన నరసింహారావు ప్రభుత్వంలోనూ (1991) తర్వాత వాటిని అమలు జరిపి "భారత్ ప్రకాశిస్తున్నద"ని ప్రచారం చేసుకున్న వాజ్‌పాయి ప్రభుత్వంలోనూ, ప్రస్తుతం సోనియా నాయకత్వంలోని యుపిఏ ప్రభుత్వంలోనూ కేంద్రంలో మంత్రిగా వున్న టిఎంసి అధినేత్రి మమతాబెనర్జీ వామపక్షఫ్రంటు విధానాలపై ధ్వజమెత్తి గద్దెనెక్కేందుకు పూనుకుంది. అయితే రైల్వే మంత్రిగా ప్రైవేటు–పబ్లిక్ భాగస్వామ్యం పేరిట రైల్వేల ప్రైవేటీకరణకు తీసుకున్న చర్యలూ, నూతన ఆర్థిక విధానాలను అమలు జరపటంలో కీలకపాత్ర పోషించిన మాజీ ఉన్నతాధికారులనూ,

(తరువాయి 3వ పేజీలో)

# కామ్రేడ్ ఈడా వెంకటేశ్వరరావుకు జోహార్లు



**సిపిఐ (ఎం-ఎల్)** సీనియర్ సభ్యులు కా॥ ఈడా వెంకటేశ్వరరావు 7-5-2011న అనారోగ్యంతో తన 81వ ఏట కృష్ణాజిల్లా ప్రొద్దుటూరులో మరణించారు. వెంకటేశ్వరరావు కష్టజీవుల కుటుంబంలో పుట్టి పాలేరుగా తన జీవితాన్ని ప్రారంభించారు. అక్షర జ్ఞానం తెలియని కా॥ వెంకటేశ్వరరావు తన తోటి సావాసగాళ్ళతో కలిసి పాలేర్ల సంఘ కార్యకలాపాలలో పాల్గొంటూ కమ్యూనిస్టు కార్యకలాపాలవైపు ఆకర్షితులైనారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట కాలంలో ఉత్తేజితులైన తొలితరం కమ్యూనిస్టులకు అనుచరులుగా వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ కార్యకలాపాల్లో పాల్గొంటూ వచ్చారు. మొదట నుండి చివర వరకు ఎటువంటి తటపటాయింపులు లేకుండా వెంకటేశ్వరరావు కష్టజీవుల పక్షాన కమ్యూనిస్టు బాటనే నడిచారు. వీరి 9 మంది సంతానమూ కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరులుగా కొనసాగుతుండటం విశేషం. కా॥ఈడా వెంకటేశ్వరరావుకు సి.పి.ఐ.(ఎం-ఎల్) కృష్ణాజిల్లా కమిటీ జోహార్లర్పిస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నది.

# మానవహక్కుల ఉద్యమనేత బుర్ర రాములుకు జోహార్లు

**మానవహక్కుల** నేత, రైతుకూలీ, ఆదివాసీ ఉద్యమ స్నేహితుడు బుర్ర రాములుకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జోహార్లర్పిస్తున్నది. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ 14-5-11న మరణించారని తెలిసి రాష్ట్రవ్యాపితంగా ప్రజాస్వామిక, రైతాంగ ఉద్యమ కార్యకర్తలు, ప్రజలు ఒక్కసారి బాధకు లోనైనారు.

గత 30 సం॥లకు పైగా వరంగల్ జిల్లాలోను, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోను మేధావిగా అనేక ప్రజా సమస్యలపైన, విద్యార్థుల సమస్యలపైన ఎన్నో బహిరంగసభలకు వక్తగా హాజరైనారు. హక్కుల ఉద్యమంలో తనవంతు బాధ్యత నిర్వహిస్తూ హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతూ నిరంతరం ప్రజల పక్షాన నిలిచారు.

ఇటీవల కోరాపుట్ జిల్లాలో చాషీమూలియా ఆదివాసీ సంఘం నాయకుడు కేంద్రుక అర్జున్ హత్యను ఖండించి, అక్కడ సాగుతున్న ఆదివాసీ ప్రజా ఉద్యమానికి తనవంతు సంఘీభావాన్ని అందించారు. పీడిత ప్రజలకు అండగా నిలబడుతున్న ప్రజల మనిషిని కోల్పోవడం ప్రజాతంత్ర ఉద్యమాలకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. హక్కుల ఉద్యమ నాయకుడు బుర్ర రాములుకు జోహార్లు తెలియజేస్తున్నాం.

**14-5-11**
**హైదరాబాద్**

| | |
|---|---|
| **యస్. ఝాన్సి** | **కె. కోటయ్య** |
| రాష్ట్ర అధ్యక్షులు | రాష్ట్ర కార్యదర్శి |
| **రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)** | **రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)** |

## రైతాంగ ... (మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలోనే గత ఏడాది నుండీ వరి ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయాలన్న డిమాండు ముందుకు వచ్చింది. రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రైతుసంఘాలనుండి రాజకీయ పార్టీలూ, రాష్ట్ర ప్రభుత్వమూ కూడా ఈ డిమాండుకు మద్దతు పలుకుతున్నారు. ఇతర రాష్ట్రాలకూ, విదేశాలకూ ఎగుమతులను అనుమతిస్తే, ఇక్కడ గోదాములు ఖాళీఅయి రైతాంగంనుండి ధాన్యం కొనుగోళ్లు పెరుగుతాయనీ, ఎగుమతులవల్ల వ్యాపారులకు మంచి ధరవచ్చి రైగాంగానికి గిట్టుబాటు ధర అందు తుందనీ భ్రమించి రైతుసంఘాలు ఈ డిమాండును చేస్తున్నాయి. తాము సృష్టించిన సమస్యను పరిష్కరించే ఉద్దేశంలేని పాలకవర్గ పార్టీలూ, రాష్ట్రప్రభుత్వమూ కూడా ఈ డిమాండునే చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో అమ్ముడయ్యే వరి భారతదేశంలో పండే వరిలో ఆరవవంతు మాత్రమే. ఈ ఏడాది అదనంగా పండిందంటున్న 32 లక్షల టన్నుల ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతిచేస్తే అంతర్జాతీయ మార్కెట్లో వరి ధరలు ఒక్కసారిగా పడిపోతాయి. కారుచౌకకు అమ్ముకోవటంతప్ప మరోదారి వుండదు. గోదాములు ఖాళీచేయాలన్న సాకుతో వాజపాయి ప్రభుత్వం ధాన్యం ఎగుమతులు చేసింది. చివరకు అమెరికా, యూరపు దేశాలకు పశువుల మేతగా కారుచౌకకు అమ్ముకుంది. నిల్వలు అలాగే వుంచుకుంటే అయ్యే ఖర్చుకంటే కారుచౌకకు అమ్మగా వచ్చిన నష్టం తక్కువేగనుక సంతోషించమంది. దానికి బదులుగా రేషను షాపులద్వారా పంపిణీచేసే ధాన్యం ధరను తగ్గించి, కోటా పెంచితే విదేశాలలో అమ్మిన దానికన్నా తక్కువ "నష్టానికే" పేదల ఆకలి తీరేది. ఈ ఆలోచన పాలకులకు రాలేదనుకోము. ప్రజల ఆకలి తీర్చే లక్ష్యమే వారికి లేదు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులను అనుమతించినా జరిగేది యిదే. నూటికి 80మంది రోజుకు 20 రూ॥ల ఆదాయంతో అర్థాకలితో బ్రతుకు లీడుస్తున్న దేశంలో, ఎగుమతులు అనుమతించి నందున ఇతర రాష్ట్రాల్లో అమ్మకాలు ఒక్కసారిగా పెరగబోవు. బిల్లుల సైక్లింగు, పన్నుల ఎగవేతవంటి పద్ధతులతో అక్రమార్జనలు పెరుగుతాయి. రాష్ట్రం లోనూ, ఇతర రాష్ట్రాలలోనూ ధరలు పెరుగుతాయి. వాటినదుపు చేసేందుకు ప్రభుత్వం పూనుకోదు.

ప్రభుత్వ విధానమూ, బడా వ్యాపారుల లాభాకాంక్ష కలిసి ఇటు రైతాంగాన్నీ, అటు ప్రజలనూ నిలువుదోపిడీ చేస్తున్నాయి. రైతాంగాన్ని ఆహార పంటల సాగునుండి వాణిజ్య పంటల సాగుకు మళ్లించి, కార్పోరేటు/కాంట్రాక్టు సాగును తెచ్చి స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు ముడిసరుకు అందించే బంధిత ఉత్పత్తిదారులుగా దిగజార్చే లక్ష్యంతో ప్రభుత్వ విధానాలు సాగుతున్నాయి. ఈ విధానం మూలంగా ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితిని వినియోగించుకుని లాభాలు దండుకునే పనిలో గుత్తవ్యాపారవర్గాలు మునిగితేలుతున్నాయి. వ్యవసాయం దండగ మారిదని నేనెప్పుడన్నానో చెప్పండని ఈనాడు రైతు అవతారమెత్తిన చంద్రబాబు సవాలు చేయటం ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువన్న అహంకారంనుండి వచ్చినదే అయినా ఆహార పంటల సాగును దండగమారిగా చెయ్యాలన్న పాలకవర్గాల కుట్రనే ఆనాడు ఆయన బయట పెట్టుకున్నాడు. ఈ వంచనను కప్పిపుచ్చుకునేందుకే ఆహార భద్రత గురించి, దానిని హక్కుగా చేసే చట్టం గురించి పాలకవర్గ పార్టీలు ఎడతెగని చర్చలు సాగిస్తున్నాయి. ఆలూ లేదు చూలూలేదు కొడుకుపేరు సోమలింగ మన్న చందంగా సోనియానుండి సుప్రీంకోర్టు వరకూ ఆహార భద్రతాహక్కు కల్పిస్తే కావలసిన అధిక ఆహార ధాన్యాలకోసం చేపట్టవలసిన చర్యలగురించి తర్జన భర్జనలు పడుతున్నాయి. అసలు కారణంనుండి ప్రజల దృష్టిమళ్లించి, వారిలో ఆశలు కల్పించి పబ్బం గడుపుకునే ఎత్తుతప్ప ప్రజల ఆకలి తీర్చేకనీస చర్యలు తీసుకోరు.

రైతాంగానికి న్యాయమైన రేటు అందించటంలో భాగంగా కనీసం స్వామినాథన్ కమిటీ సూచించిన విధంగా పంటలకు గిట్టుబాటుధరను నిర్ణయించాలి. ఎఫ్సిఐ కొనుగోలు కేంద్రాలను పునరుద్ధరించి రైతాంగం నుండి నేరుగా కొనుగోలు చేయాలి. ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా ఆహార ధాన్యాల సరఫరా సాగించాలి. పేద వర్గాలకు రేషను పెంచి, రేటు తగ్గించి సరఫరా చెయ్యాలి. ఈ తక్షణ చర్యలతోపాటు ఆహార ధాన్యాలతో భవిష్య వాణిజ్యాన్నీ, విదేశాలకు ఎగుమతులను పూర్తిగా నిషేధించాలి. 70శాతం ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రభుత్వ పెట్టుబడుల మదుపును (సాగునీటి సౌకర్యాల కల్పన, విత్తన తయారీ, ఎరువుల ఉత్పత్తి, రవాణా, గిడ్డంగి సౌకర్యాలు పెంపు మొదలగు) పెంచాలి. వ్యవసాయ మార్కెట్టు యార్డుల ప్రైవేటీకరణను ఆపాలి, అనే డిమాండ్లతో రైతాంగం సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలి. పాలకవర్గ పార్టీల నాయకుల తప్పుడు నినాదాలు, ఆకర్షణీయ పరిష్కారాల భ్రమలలో చిక్కుకోకుండా మూల కారణాన్ని తొలగించే దిశగా తమ పోరాట మొనను ఎక్కుపెట్టాలి. అలాంటి సంఘటిత పోరాటాలు మాత్రమే పేద, మధ్యతరగతి రైతాంగానికి ఉపశమనాన్నివ్వగలవు. ◈

# నోయిడా ప్రాంత రైతులపై , గ్రామస్తులపై పోలీసు కాల్పులను ఖండించండి!

**పార్టీ,** జెండా, ప్రభుత్వం ఎవరిదైనా, పాలకవర్గాల ప్రజావ్యతిరేక స్వభావం-దోపిడీ విధానాలు ఒక్కటేనని ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడా రైతాంగంపై మాయావతి ప్రభుత్వం జరిపిన పోలీసు కాల్పులు మరోమారు నిరూపించాయి. అణగారిన ప్రజల జపం చేసే యు.పి. ముఖ్యమంత్రి మాయావతి-దళితుల, రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ దోపిడీవర్గాల ప్రయోజనాలనే కాపాడుతున్నది. దళితులను భూముల నుండి గెంటి వేయటం, రైతాంగ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవటం, గిట్టుబాటు ధరకోసం రైతాంగం జరుపుతున్న ఆందోళనపై లాఠీఛార్జీ వంటి చర్యలతో మాయావతి ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నదీ ప్రజలకు అర్థమౌతూనే వుంది.

ముఖ్యమంత్రి మాయావతి సొంత జిల్లా గౌతమబుద్ధ నగర్‌లోని బట్రాపర్వాల్ గ్రామములో కొత్త బస్సుమార్గం కోసం భూమిని సేకరించిన ప్రభుత్వం, ఎంతో విలువైన తమ భూములకు నామ మాత్రపు పరిహారాన్ని ఇవ్వటాన్ని రైతాంగం వ్యతిరేకించారు. న్యాయమైన పరిహారం యివ్వనిదే భూములు ఇవ్వలేమని రైతులు తేల్చి చెప్పారు. అందుకు ఆందోళన మార్గం చేపట్టారు. 2008లో గ్రేటర్ నోయిడా, ఆలీఘడ్, ఆగ్రా ప్రాంతాల్లో చేపట్టిన భూ సేకరణకు వ్యతిరేకంగా రైతాంగం చేస్తున్న ఆందోళనలపై మాయావతి ప్రభుత్వ పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఘోరీబరేరా గ్రామానికి చెందిన 66 మంది రైతుల జాడలేకుండా పోయి ఇప్పటికీ ఆచూకీ దొరకలేదు. నోయిడా రైతాంగం న్యాయమైన నష్టపరిహారం కోసం నాలుగు నెలల నుండి ఆందోళన చేస్తున్నా, వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా, రూట్ సర్వే కోసం ఆర్.టి.సి. వారిని పంపటంతో రైతాంగం ఆగ్రహం చెంది, వారిని అక్కడినుండి వెళ్లనీయలేదు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తేనే వదిలిపెడతామని చెప్పారు. రైతాంగపు డిమాండ్‌ను పరిష్కరించేబదులు, కలెక్టర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున పోలీసులను పంపి మాయావతి ప్రభుత్వం రైతాంగంపై కాల్పులు జరిపించింది ఈ కాల్పులలో ఇద్దరు రైతులతో సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

రైతాంగంపై ఇలాంటి దాడులు చేయటం మాయావతి ప్రభుత్వానికి కొత్తేమీకాదు. ఇంతకు ముందు తాజ్ఎక్స్‌ప్రెస్‌వే, టౌన్‌షిప్‌ల నిర్మాణం కోసం భూముల సేకరణ సందర్భంగా రైతాంగంపై జరిపిన దాడులు, దౌర్జన్యాలు ఆ రాష్ట్ర ప్రజలు మర్చిపోలేరు. నిర్బంధం-కాల్పులతో నోయిడా రైతాంగాన్ని అణచి వేయ చూస్తున్నా, ఆ పోరాట ప్రభావం ఆగ్రా రైతులను ప్రభావితం చేసి, వారి నుండి సేకరించిన భూములకు మెరుగైన నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళన చేస్తున్నారు. వీరిపైన పోలీసులు కాల్పులు జరిపారు. ఈ విధంగా రైతాంగ ఆందోళన ఉత్తర ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్నది.

1894 సం॥ భూసేకరణ చట్టాన్ని వలస పాలకులు తీసుకొచ్చారు. ఈ చట్టం ద్వారా ఎక్కడైనా, ఎవరి భూమినైనా ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే హక్కుని పొందింది. ఆ చట్టాన్నే భారతపాలకులు నేటికీ అమలు జరుపుతున్నారు. ఈ చట్టం ద్వారానే సెజ్‌లు, నౌకా కేంద్రాలు, అణు థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కోసం దేశ వ్యాపితంగా పాలకులు, రైతాంగం నుండి బలవంతంగా భూములు లాక్కొంటున్నారు. ఇప్పటికే రైతాంగం నుండి 25 లక్షలకుపైగా ఎకరాల భూములు లాక్కొన్నారు. ఇందులో ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ముందు భాగాన ఉంది. దీనిని వ్యతిరేకించిన ప్రజలపై పోలీసులతో విరుచుకు పడుతున్నది. తమ భూములను థర్మల్ విద్యుత్ కేంద్రాలకు యివ్వటానికి వ్యతిరేకించిన సోంపేట, కాకరాపల్లి రైతాంగంపై పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే పరిస్థితి ఒరిస్సాతో సహా అనేక రాష్ట్రాల్లో కొనసాగుతున్నది.

**నోయిడా రైతాంగంపై పోలీసులు జరిపిన కాల్పులను రైతుకూలీసంఘం తీవ్రంగా ఖండిస్తున్నది. వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నది. ప్రస్తుత భూసేకరణ చట్టాన్ని రద్దు చేసి, రైతాంగం నుండి స్వాధీనం చేసుకొన్న భూములు వారికి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది.**

**9-5-11**
**విజయవాడ**

| | |
|---|---|
| **యస్. ఝాన్సి** | **కె. కోటయ్య** |
| రాష్ట్ర అధ్యక్షులు | రాష్ట్ర కార్యదర్శి |

**రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)**

# రైతాంగంనుండి అక్రమ చక్రవడ్డీ వసూళ్లు

**అనేక** సంవత్సరాలనుండి "జనశక్తి" తన వ్యాసాలలో రైతాంగంనుండి చక్రవడ్డీ వసూలు చెయ్యటం చట్టవిరుద్ధమని చెబుతున్నది. బ్రిటీషు కాలంలో చేసిన చట్టాల ప్రకారం తక్కావి రుణాలకు 4శాతం మించి వసూలు చేయరాదని వాదిస్తూ వస్తున్నది. అయినప్పటికీ ఎవరికివారు తాము నాలుగు శాతమే వసూలుచేస్తున్నామంటూ రైతాంగంపై 12శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, కోఆపరేటివ్‌లు కూడా అధికశాతం వడ్డీతోపాటు చక్రవడ్డీని కూడా వసూలు చేస్తున్నాయి. ఇటీవల రిజర్వుబ్యాంకు పరిశీలనలో ఈ విషయం వెల్లడైంది.

"కొన్ని ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వ్యవసాయ రుణాలపై చక్రవడ్డీని వసూలు చేస్తున్నట్లు రిజర్వుబ్యాంకు పరిశీలనలో వెల్లడైంది. ఇది నిబంధనలకు విరుద్ధమనీ, అలా వసూలుచేసిన మొత్తాలను ఆయా రైతుల ఖాతాలకు తక్షణం జమచేయాలని బ్యాంకులకు సూచించింది. పంట చేతికొచ్చే వరకూ ఉన్న కాలాన్ని నిర్ణీత వ్యవధిగా పరిగణించి, అంతవరకూ బారువడ్డీని బ్యాంకులు వసూలు చేయాల్సివుండగా, దీనికి భిన్నంగా మూడు నెలలకూ, ఆరునెలలకూ వడ్డీని అసలుకు కలిపి మళ్లీ వడ్డీ కడుతున్నది. ఏఏ రాష్ట్రాల్లో, ఎంత మేరకు ఈ లొసుగులున్నాయో రిజర్వుబ్యాంకు బయటపెట్టకుండా తాజాగా మార్గదర్శకాలు పంపింది". (ఈనాడు 18-4-2011)

రాష్ట్రంలో ఐదు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు 1368 శాఖలుండగా, రూ 1130 కోట్ల డిపాజిట్లు వున్నాయి. ఇవి రూ॥8523 కోట్ల రుణాలు అందజేయగా, దీనిలో 5506 కోట్లు (64.5%) వ్యవసాయ రుణాలు. అంటే ప్రతి మూడు నెలలకూ పదికోట్లవరకూ వీటిపై అదనపు వడ్డీని వసూలు చేసి వుండాలి.

వ్యవసాయరంగ అవసరాలలో 20శాతం మాత్రమే సంస్థాగత రుణసౌకర్యం తీరుస్తున్నది. వ్యసాయ అవసరాలను పూర్తిగా తీర్చాలనీ, 4 శాతం బారువడ్డీనే వసూలు చేయాలనీ, చెల్లింపులు మొదట అసలునుండి మినహాయించాలని రైతాంగం డిమాండు చేయాలి. ◈

# బిన్‌లాడెన్ హత్య

# అంతర్జాతీయ న్యాయసూత్రాల కాలరాచివేత

**అమెరికా** సామ్రాజ్యవాదం టెర్రరిస్టుగా ముద్రవేసిన ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చినట్లు అమెరికా అధ్యక్షుడు ఒబామా ప్రకటించాడు. పాకిస్తాన్ రాజధానికి సమీపంలోని, సైనిక కార్యాలయానికి కూతవేటు దూరంలోవున్న అట్టోబాబాద్‌లో బిన్ లాడెన్‌వున్న ఇంటిపై అమెరికా నౌకాదళ ప్రత్యేక కమాండోలు దాడిచేసి లాడెన్‌ను హత్యచేశారు. అతని భార్యలూ, పిల్లలను పట్టుకుని తీసుకువెళ్లినట్లు ప్రకటించారు. ఇదికాక నీ దేశంలో అతనెలా తలదాచుకున్నాడో చెప్పమంటూ పాకిస్తాన్ ప్రభుత్వాన్ని అమెరికా బెదిరిస్తున్నది. ఒక భయంకర టెర్రరిస్టును అంతంచేసి, ప్రపంచాన్ని రక్షించినందుకు ప్రజలను ఆనందపరవశులను కమ్మని బోధిస్తున్నది. ఈ హత్యాకాండను ప్రత్యేక ప్రసారంలో వీక్షించగల వినోదంగా చిత్రిస్తున్నది. ఇరాక్‌పై క్షిపణి దాడులను దీపావళి తారాజువ్వల్లా టివిలో చూపించి, అవి సృష్టించిన విధ్వంసాన్ని సమర్ధించుకున్న క్షీణ సంస్కృతి కొనసాగింపే యిది. అయినా బిన్‌లాడెన్ భూతం అమెరికా సామ్రాజ్యవాదానికి నిద్రలేకుండా చేస్తున్నది. రాత్రికి రాత్రే లాడెన్ శవాన్ని సముద్రంలో పారవేసింది. లాడెన్ పిరికివాడనీ, అమెరికాకు భయపడి మానసికరోగి అయ్యాడనీ, బూతు సినిమాలు చూస్తున్నాడనీ వ్యక్తిత్వ హరణకు పూనుకుంది. ఈ దుష్ప్రచారపు హోరులో పాకిస్తాను సార్వభౌమత్వాన్ని కాలరాచిన సామ్రాజ్యవాద అగ్రరాజ్య దురహంకారాన్ని కప్పిపుచ్చుకోజూస్తున్నది.

ఏడాది క్రితమే అట్టోబాబాద్‌లో బిన్‌లాడెన్ వున్నాడన్న అనుమానం వచ్చినప్పుడు, ఆ యింటిని చుట్టుముట్టి, దానిలో నివసిస్తున్న వారెవరో నిర్ధారించమనీ, ఉన్నది బిన్‌లాడెన్ అయితే అతన్ని అరెస్టు చేయమనీ పాకిస్తాన్ ప్రభుత్వాన్ని కోరాలి. ఆ తర్వాత అమెరికాలో అతనిపై నేరారోపణలున్నాయి గనుక విచారణ కొరకు అతన్ని తమ కప్పజెప్పమని పాకిస్తాన్ ప్రభుత్వాన్ని కోరాలి. అంతర్జాతీయ న్యాయచట్టం ప్రకారం అనుసరించాల్సిన పద్ధతులివి. వీటిని గాలికి వదలి, పాకిస్తాన్ భూభాగంలోకి తన సైనిక దళాన్ని పంపి, దాడికి దిగి, హత్యాకాండకు పూనుకోవటం పాకిస్తాన్ సార్వభౌమత్వాన్ని కాలరాయటమే. సైనిక దురాక్రమణకు సమానమైన చర్య యిది. ప్రపంచ ప్రజలందరూ ఈ దురాక్రమణ చర్యను ఖండించాలి.

అమెరికా సామ్రాజ్యవాదానికిది కొత్తకాదు. అల్‌ఖైదానూ, దాని నాయకుడు బిన్‌లాడెన్‌నూ అంతంచేసే సాకుతో ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణను పాకిస్తాన్‌కు విస్తరించింది. దానికి ఆఫ్-పాక్ యుద్ధమని పేరు పెట్టారు. పైలెట్లు లేని విమానాలతో బాంబులు వేశారు. వందలాది పాకిస్తాన్ గ్రామాలను నేలమట్టం చేశారు. వేలమంది పాకిస్తాన్ పౌరుల ప్రాణాలను బలిగొన్నారు. ఈ దుశ్చర్యలన్నింటికీ వారిది ఒకటే సమాధానం-ఆ గ్రామాలు టెర్రరిస్టులకు ఆశ్రయమిస్తున్నాయి; వారిని తుడిచిపెట్టేందుకు ఈ దాడులు తప్పనిసరి; ఈ క్రమంలో కొందరు పౌరులు మరణిస్తే అది అనివార్య ఉపనష్టం(కొల్లేటరల్ డామేజ్). ఈ దాడులు సాగించే నాటికే బిన్‌లాడెన్ అట్టోబాబాద్‌లో వున్నాడని అమెరికాకు తెలుసు. ఎలక్ట్రానిక్ గూఢచర్యంతో లాడెన్ తన అనుచరులకు పంపుతున్న ఆదేశాలను తెలుసుకుని, జరగబోయే దాడులను ముందుగానే ఆపే ప్రయత్నం సాగించామని అమెరికా చెప్పడంలోనే ఈ నిర్ధారణ వుంది. అయినా పర్వత గుహల్లో దాక్కున్న బిన్‌లాడెన్‌నూ అతని అనుచరులను ముట్టుపెట్టడమన్న అబద్ధ ప్రచారంతో పాకిస్తాన్ గ్రామాలపై క్షిపణి దాడులు సాగించింది.

అంతర్జాతీయ న్యాయచట్టమన్నది ఇతర దేశాల చేతులు కట్టివేయటానికే తప్ప తమకు వర్తించదన్న దురహంకారంతో సామ్రాజ్యవాద దేశాలు వ్యవహరిస్తున్నాయి. మానవీయ జోక్యం పేరిట, ప్రజలపై బాంబులు వేయకుండా విమానాలు గగనతలంలో ఎగురకుండా చూడాలన్న ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని లిబియా దేశంపైనా, లిబియా అధ్యక్షుడు గడ్డాఫీ పైనా బాంబుల దాడిగా మార్చిన సామ్రాజ్యవాదులు, 30ఏళ్ల పాలనలో గడ్డాఫీ చంపాడని చెపుతున్న ప్రజల సంఖ్యకంటే పదిరెట్లు ఎక్కువగా లిబియా పౌరులను అమెరికా, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు తమ వైమానిక దాడులలో సంహరించారు. అందుకనే బిన్‌లాడెన్ హత్యనూ, పాకిస్తాన్ సార్వభౌమత్వ కాలరాచివేతనూ సామ్రాజ్యవాదులందరూ వీరోచిత చర్యగా సమర్ధించారు. బిన్‌లాడెన్‌ను హత్యచేసే హక్కు అమెరికాకుందంటూ రష్యా తెగబడి సమర్ధించింది.

తానుగీసిన గీటు దాటని పాకిస్తాన్ పాలకుల పట్లకూడా అమెరికా సామ్రాజ్యవాదులు కనీస మర్యాదలను కూడా పాటించరని తేలింది. తనదేశ పౌరులపై, గ్రామాలపై సాగిస్తున్న దాడులను ఖండించి, ఆపేందుకు చర్యలు తీసుకోలేని పాకిస్తాన్ పాలకులు, తన సార్వభౌమత్వాన్ని కాలరాస్తున్నా కిమ్మనలేని దుస్థితిలో వున్నారు. తైనాతీలకు ఇంతకంటేదక్కే గౌరవముంటుంది?

దీనినుండి గుణ పాఠం నేర్చుకోలేని భారత దళారీ పాలకులు తోటి దేశపు దుస్థితికి సానుభూతి తెలిపే బదులుగా అమెరికా సామ్రాజ్యవాదులకు వంత పాడారు. అమెరికాలాగా పాకిస్తాన్‌పై తాము దాడి చేసి ముంబాయి దాడులు సాగించిన వారినీ, దావుద్ ఇబ్రహీం వంటి వారినీ వశపరుచుకోగలమనీ వదరుతున్నారు, తమ ప్రాంతీయ విస్తరణవాద కాంక్షలను బయట పెట్టుకున్నారు. పాకిస్తాన్ పాలకులకు ఎదురైన దుస్థితినే అమెరికా సామ్రాజ్యవాదులు తమకు కల్పించగలరని ఈ దళారీ పాలకులు గుర్తించరు. అమెరికా అడుగులకు మడుగులొత్తటం మానరు.

పాకిస్తాన్ బిన్‌లాడెన్‌కు ఆశ్రయమిచ్చిందా? బిన్‌లాడెన్ పాత్ర ఏమిటి? అతన్ని పెంచి పెద్ద చేసింది అమెరికా కాదా? లౌకిక ప్రజాస్వామిక ప్రభుత్వాలను కూల్చడానికి, ముస్లిం ఛాందసవాద శక్తులు పైచేయి పొందటానికీ (అల్జీరియా, మొరాకో), బిన్‌లాడెన్‌ను సాకుగా చూపి తనకు లొంగని ప్రభుత్వాలపై దాడిచేయటానికి (లిబియా) అమెరికా అతన్ని వాడుకోలేదా? అసలు ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడి జరుగుతుందని తెలిసీ అమెరికా ఊరుకోలేదా లేక తానే జరిపించిందా? ఈ ప్రశ్నలన్నీ చర్చనీయాంశాలే. వీటిలో వాస్తవాలూ వున్నాయి. అయినా అవి మరో సందర్భంలో కూలంకషంగా చర్చించవచ్చు. అయితే ఒక్క విషయం మాత్రం స్పష్టమే. దోపిడీ, ఆధిపత్యాల కొరకు సామ్రాజ్యవాదం టెర్రరిజాన్ని ఆశ్రయించింది. కాగా మార్క్సిజం - లెనినిజం టెర్రరిజాన్ని తిరస్కరించింది, ప్రజల సంఘటిత పోరాటశక్తిపై ఆధారపడుతుంది.

బిన్‌లాడెన్ హత్య ముందుకు తెచ్చిన సమస్య మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమత్వం, స్వాతంత్ర్యాలపై సామ్రాజ్యవాదం సాగిస్తున్న దాడి-రాయితీలతోనో, బ్రతిమాలుకోనో, వారి ఆజ్ఞలను అమలు జరిపో సామ్రాజ్యవాదుల లాభార్జనా, ఆధిపత్యకాంక్షలను సంతృప్తిపరచటం అసాధ్యమని ఇటీవల పరిణామాలు మరోసారి స్పష్టం చేశాయి.

దేశాలు, జాతులు, ప్రజలు-స్వాతంత్ర్యం, విముక్తి, విప్లవాల కోసం పోరాడటం ద్వారా మాత్రమే సామ్రాజ్యవాద దోపిడీ, ఆధిపత్యాలను నిలువరించగలం. యుద్ధంలేని, దోపిడీలేని, హింసలేని సమాజాన్ని నిర్మించగలం. ఈ చారిత్రక వాస్తవాన్ని గుర్తించి తమ కర్తవ్య నిర్వహణకు విప్లవకారులు, ప్రజాస్వామికవాదులూ, శాంతికాముకులు పూనుకోవాలి. ◈

# పెరుగుతున్న జీవన వ్యయాన్నీ, పేద-ధనిక అంతరాలనీ నిరసిస్తూ ప్రపంచ వ్యాపితంగా ‘మేడే’ ప్రదర్శనలు

**సామ్రాజ్యవాద** ప్రపంచీకరణ తమ జీవితాలలో కలిగించిన సంక్షోభంపై తీవ్ర ఆగ్రహాన్ని ప్రకటిస్తూ ప్రపంచ వ్యాపితంగా కార్మికలోకం-సరైన వేతనాలు, మంచి ఉద్యోగాలు, సామాజిక భద్రత మరియు సరైన జీవన సౌకర్యాలను డిమాండ్‌చేస్తూ ‘మేడే’ సందర్భంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

**అమెరికా**లోని చికాగోలో ఇల్లినాయిస్ లేబర్ హిస్టరీ సొసైటీ, చికాగో వర్కర్స్ ఫెడరేషన్ మరియు ఎ.ఎఫ్.ఎల్-సి.ఐ.ఓ.ల సంయక్త ఆధ్వర్యంలో 1886నాటి మేడే మృతవీరుల స్మారక స్థూపాన్ని పునరంకితంచేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్మారకస్థూపం చికాగోలోని ఫారెస్ట్ పార్క్ సందులో వుంది. దీనిని అధికారికంగా ‘ఫారెస్ట్ హోమ్’ పేరిట గుర్తించారు. ఈ ప్రాంతంలో మేడే సందర్భంగా పెద్దఎత్తున కార్మికులు హాజరై మేడే మృతవీరులను స్మరించుకున్నారు. మేడే మృతవీరుల స్మారక చిహ్నమొక్కటి మాత్రమే చికాగోలో జాతీయస్థాయి చారిత్రక స్మారక కేంద్రంగా గుర్తించబడింది. ఇల్లినాయిస్‌కు చెందిన ‘హిస్టరీ లేబర్ సొసైటీ’ ఈ స్మారక స్థూపాన్ని ప్రపంచంలోని కార్మికవర్గ స్వేచ్ఛా చిహ్నంగా వర్ణించింది.

విస్కాన్సిన్‌వద్ద వేలాదిమంది కార్మికులు బిగించిన పిడికెళ్ళెత్తి రెండు మైళ్ళదూరం పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు. వలస కార్మికుల హక్కుల అణచివేతను, ఉద్యోగాలనుండి తొలగింపును వ్యతిరేకిస్తూ వీరు నినదించారు.

మాన్‌హటన్ యూనియన్ స్క్వేర్‌వద్ద దేశ బహిష్కరణలను ఆపాలని నినాదాలుచేస్తూ వేయిమందికి పైగా వలస కార్మికులు మేడే ప్రదర్శనను నిర్వహించారు.

అమెరికా తోటల్లో పనిచేసే వ్యవసాయ కార్మికులకు ప్రాతినిధ్యం వహించే డొమెస్టిక్ వర్కర్స్ యునైటెడ్ యూనియన్ ఇన్‌స్కాన్‌సిన్, ఓహియో రాష్ట్రాలలో భారీ మేడే ప్రదర్శనలను నిర్వహించింది.

మానవ హక్కుల సంఘాలు మరియు వలస కార్మికుల ఆధ్వర్యంలో లాస్‌ఎంజిలస్, అట్లాంటాలలో మేడే ప్రదర్శనలు జరిగాయి.

**టర్కీ**లో 2 లక్షలమంది ప్రదర్శనకారులు ఇస్తాంబుల్ లోని సెంట్రల్ ప్లాజా నుండి అతిపెద్ద ప్రదర్శన నిర్వహించారు. 1977 తర్వాత ఇదే టర్కీలో నిర్వహించబడిన అతిపెద్ద కార్మిక ప్రదర్శన.

**జర్మనీ** దేశవ్యాపితంగా నాలుగు లక్షల ఇరవై మూడువేలమంది కార్మికులు, ప్రజలు వీధుల్లోకి వచ్చి మేడే ప్రదర్శనలు నిర్వహిస్తూ జాతీయ కనీస వేతనాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తిరస్కరించటాన్ని నిరసించారు. బెర్లిన్‌లో నిర్వహించిన మేడే ప్రదర్శనలో 10వేల మంది కార్మికులు పాల్గొన్నారు.

**ఆస్ట్రియా**లో లక్షమందికి పైగా ప్రజలు, కార్మికులు వియన్నాలో మేడే ప్రదర్శనలు నిర్వహించి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసించారు.

**క్యూబా**లో వందల, వేలమంది ప్రజానీకం, కార్మికులు దేశ రాజధాని హవానాలోనూ, దేశంలోని వివిధ పట్టణాలలోనూ మేడే ప్రదర్శనలను నిర్వహించారు. ఇటీవలి కాలంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధాన మార్పులను స్వాగతించారు.

**దక్షిణకొరియా**లో 50వేలమంది ప్రజలు సియోల్ వీధుల్లో మేడే ప్రదర్శనలు నిర్వహించి మరింత మెరుగైన భద్రతలకోసం, తమని పేదరికానికి గురిచేస్తున్న ద్రవ్యోల్బణం తగ్గింపుకోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఫ్రాన్స్** దేశ రాజధాని పారిస్‌లో నిర్వహించిన మేడే ప్రదర్శనల్లో వేలాదిమంది కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

**ఫిలిప్పీన్స్**లో 3 వేలమంది కార్మికులు అధిక వేతనాలను డిమాండ్‌చేస్తూ మనీలా స్క్వేర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షులు ఆక్వినో దిష్టిబొమ్మను ఈ సందర్భంగా దగ్ధంచేశారు.

**తైవాన్**లో 2వేలమంది ప్రజలు తైపేలో మేడే ప్రదర్శన నిర్వహించారు. ఆదాయాల అంతరాన్ని వారు ప్రశ్నించారు. మరింత మెరుగైన పనిపరిస్థితులను వారు డిమాండ్ చేశారు.

**హాంగ్‌కాంగ్**లో 3వేల మంది ప్రజలు మేడే ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

**స్పెయిన్**లో వేలాదిమంది కార్మికులు, ప్రజలు వాలెన్సియా నగరంలో సమావేశమై నూతన ఉద్యోగాలు కల్పించని ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు.

**గ్రీస్**లో రైల్వే మరియు పోస్టల్ కార్మికులు ప్రభుత్వ పొదుపు చర్యలను వ్యతిరేకిస్తూ సమ్మె చేపట్టారు. ‘వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్’ కార్మికులు మేడే ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రీకు ప్రభుత్వ పొదుపు చర్యలను నిరసించారు. ఆథ్యాన్స్‌లోని ఫ్రెంచ్ రాయబార కార్యాలయ గేట్లపై బక్కెట్లతో ఎర్రరంగు కుమ్మరించటం ద్వారా లిబియాలో ఫ్రెంచ్ ప్రభుత్వం అనుసరిస్తున్న సైనిక దురాక్రమణ విధానాలను తీవ్రంగా నిరసించారు.

**చైనాలో, మాస్కో**లో వివిధ కమ్యూనిస్టు విభాగాలకు చెందిన వేలాదిమంది ఎర్రజెండాలను చేబూని ప్రదర్శనలు నిర్వహించారు. ◈

## మరోసారి ... (మొదటి పేజీ తరువాయి)

(మొదటి పేజీ తరువాయి)

ఫిక్కి వంటి సంస్థ అభ్యర్ధులుగా నిలబెట్టడం ద్వారా తన విమర్శలు సిపియం పైనే తప్ప నూతన ఆర్థిక విధానాలపై కాదన్న సందేశాన్ని బడాబూర్జువా వర్గానికిచ్చింది. దీనికనువుగానే “పరివర్తన్”తో పాటుగా “ఉన్నాయన్” (ఆర్థికాభివృద్ధి) తో ‘సోనార్‌బంగ్లా” (బంగారు బెంగాల్) ను నిర్మిస్తానన్న నినాదమిచ్చింది. సిపియం నాయకత్వాన వున్న వామపక్షఫ్రంటు ప్రభుత్వ పాలనే అన్ని అరిష్టాలకూ కారణంగా చూపెట్టిన టియంసి తాను భాగస్వామిగా వుండి అమలు జరిపిన ఆర్థిక సంస్కరణల విధానాలు అసలు కారణమన్నదని వాస్తవాన్నీ దాచిపెట్టింది. సిపిఎం పాలనపై ప్రజలలో పేరుకున్న అసంతృప్తిని సొమ్ము చేసుకుని అధికార గద్దెనెక్కింది. పశ్చిమ బెంగాలు ప్రజలను మరోసారి మోసానికి గురిచేసింది.

వామపక్ష ప్రభుత్వ ఓటమిని కాలం చెల్లిన కమ్యూనిస్టు సిద్ధాంతాల ఓటమిగా చిత్రించేందుకు పాలక వర్గాలూ, వాటి బాకాలైన పత్రికలు పూనుకున్నాయి. దేశంలో ఎక్కడా జరగని ఘోరాలేవో పశ్చిమ బెంగాల్‌లో జరిగినట్లు చిత్రించాయి. అభివృద్ధి పేరిటా, సెజ్‌ల పేరిటా భూముల నుండి రైతాంగ తరిమివేత దేశవ్యాపితంగా సాగుతున్నా, అదేదో మార్క్సిజంలోని నిరంకుశత్వ ఫలితంగా అవి చిత్రించాయి. ఈ ప్రచారాన్ని ఎదుర్కొనే సైద్ధాంతిక, రాజకీయ దృక్పథం వామపక్ష ఫ్రంటుకు లేదు. అది ప్రపంచీకరణను నిరాకరించలేని వాస్తవంగా గుర్తించి దాని అమలుకు పూనుకుంది. నందిగ్రామ్, సింగూరుల్లో తప్పు చేశామని మొసలి కన్నీరు కారుస్తూ, పాలకవర్గ పార్టీల దారిలోనే మైనారిటీలకూ, కార్మికులకూ, ఉద్యోగులకూ మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ వాగ్దానాలు చేసింది. తమ పార్టీలోని అవినీతి పరులనూ, అవకాశవాదులనూ ఏరివేస్తామంటూ వాగాడంబరం చూపింది. అయినా పాలక వర్గాలూ, వాటి బాకాలూ మార్క్సిస్టు సిద్ధాంతమే బెంగాలు వెనుకబాటుతనానికి కారణంగా చిత్రించాయి. ఈ దాడి లక్ష్యం బెంగాలులోని వామపక్ష ప్రభుత్వంకాదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణపైనా, బడాబూర్జువా-భూస్వామ్య వర్గాల పాలనపైనా పోరాటాన్ని సాగించేందుకు శ్రామిక ప్రజలకు మార్గదర్శనం చేయగల మార్క్సిజంపై దాడి చేయటం ద్వారా, మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందనీ, పెట్టుబడిదారీ విధానం ముందు ఓడిపోయిందనీ ప్రచారం చేయటం ద్వారా భారత పీడిత ప్రజలకు ఒక విముక్తి సిద్ధాంతం లేకుండా చేయటమే లక్ష్యంగా ఈ దాడిని సాగిస్తున్నాయి. ఆ విధంగా భారత పీడిత ప్రజలను నిర్వీర్యులను చేసి తమ దోపిడీ విధానాలను ప్రతిఘటించే సిద్ధాంత ఆయుధం లేకుండా చేసి తమ పాలనను నల్లేరుపై బండిలా సాగించుకోవాలని చూస్తున్నాయి. వారి ఆశలు అడియాసలు కాక తప్పదు.

ఎన్నికల తదనంతర స్థితి మరింత క్లిష్టమైంది. కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల రెండవదశ అమలును మరింత వేగవంతం చేయబోతున్నది. దీనితో ప్రజాజీవనం, వారి జీవనాధారాలూ, వారి ప్రజాస్వామిక హక్కులపై దాడులు మరింత తీవ్రమౌతాయి. దీనికి వ్యతిరేకంగా ప్రజల నుండి వ్యక్తమయ్యే అశాంతి, నిరసన, ప్రతిఘటనలను ఫాసిస్టు తరహా నిర్బంధంతోనూ, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలతో చీలికలతోనూ, భ్రమలు కల్పించే ప్రజాకర్షక పథకాలతోనూ అణచి వేసేందుకు మరింతగా పూనుకుంటుంది.

ఈ స్థితిలో కమ్యూనిస్టు విప్లవకారులు, నిజమైన వామపక్ష శక్తులూ, ప్రజాస్వామిక వాదులూ, దేశభక్తి యుతులూ ప్రజల పక్షాన నిలవాలనీ, సామ్రాజ్య వాదానికీ, బడాబూర్జువా, భూస్వామ్య వర్గాలకూ వ్యతిరేకంగా సంఘటిత పోరాటాలలోకి ప్రజలను సమీకరించేందుకు పూనుకోవాలనీ, సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటీ పిలుపు నిస్తున్నది.

**17-5-2011**

కేంద్రకమిటీ
సిపిఐ(ఎం-ఎల్) ◈

# దారిమళ్లుతున్న షెడ్యూల్డ్ తెగల-కులాల నిధులు

అరవైనాలుగు సంవత్సరాల 'స్వతంత్ర' భారతావనిలో గిరిజనుల, దళితుల సమస్యలు పరిష్కారం కాకపోగా, పెరుగుతూ వస్తున్నాయి. పాలక ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలేవీ వారి జీవితాల్లో మార్పును తీసుకొని రాలేక పోయాయి. కమ్యూనిస్టు విప్లవకారుల నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చెప్పినట్లు దేశంలో, రాష్ట్రంలో అత్యంత నికృష్ట దోపిడీకి గురౌతున్నది గిరిజనులే అన్నది నేటికీ కొనసాగుతున్నది.

నాగరిక ప్రపంచానికి దూరంగా కొండకోనల్లో నివశిస్తున్నవారు – భూస్వాముల, వడ్డీవ్యాపారుల, మైక్రోఫైనాన్స్ సంస్థల, కాంట్రాక్టర్ల, ఫారెస్టు అధికారుల దోపిడీ దౌర్జన్యాలకు గురౌతున్నారు. సరైన ఆహారం లభించక, ఉపాధి అవకాశాలు లేక దుర్భరమైన జీవితాలు గడుపుతూ, దుర్గంధపూరిత వాతావరణంలో, రోగాలతో, వైద్య సౌకర్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. దళిత పేదలు దుర్భర జీవితాలు గడుపుతున్నారు.

రాష్ట్రంలో గిరిజనుల, దళితుల జనాభా 22.08 శాతంగా ఉంది. యాభై ఆరు వేల దళిత వాడలు, 20 వేల గిరిజన ఆవాసాలు వున్నాయి. గిరిజన- దళిత వర్గాల అభివృద్ధికోసం ప్రత్యేక పథకాలు రూపొందించి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నట్లు పాలకులు చేస్తున్న ప్రచారం బూటకంగా మారింది. నామమాత్రపు బడ్జెట్ కేటాయింపులతో సరిపెట్టటమే కాకుండా, వాటిని కూడా, వారి కోసం ఖర్చు పెట్టటంలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమౌతూ వస్తున్నాయి. షెడ్యూల్ తెగల–కులాల కోసం కేటాయించే ఉప ప్రణాళికా నిధులు వారి అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలనే ఆందోళన కొనసాగుతున్నప్పటికీ, పాలక ప్రభుత్వాలు పట్టించుకోవటంలేదు. ఫలితంగా వారి కనీస అవసరాలు కూడా పరిష్కారం కావటం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో 20 లక్షల గిరిజన–దళిత కుటుంబాలకు ఇండ్ల స్థలాలను ప్రభుత్వం సమకూర్చలేక పోయింది. 60 శాతం ఇండ్లకు మంచినీటి సౌకర్యం, 80 శాతం కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లులేక అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజి సౌకర్యం లేక దుర్గంధ పూరిత వాతావరణంలో జీవించవలసి వస్తున్నది. 12 వేల గిరిజన కుటుంబాలకు, 40 శాతం దళిత కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. 15వేల గ్రామాలకు స్మశాన వాటికలు లేక, చనిపోయిన వారిని పూడ్చిపెట్టట సమస్యగా మారుతున్నది.

షెడ్యూల్ తెగల–కులాల ఉపప్రణాళిక ప్రకారం రాష్ట్ర ప్రణాళికా బడ్జెట్‌లో వీరి జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించి ఖర్చు చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం 1980లో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఇది కూడా అలంకార ప్రాయంగానే మారింది. రాష్ట్ర జనాభా నిష్పత్తి ప్రకారం దళితులకు 13.2 శాతం, గిరిజనులకు 6.6 శాతం నిధులు కేటాయించి వారి అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది. ఇది కూడా అరకొర కేటాయింపులే అయినా వాటిని కూడా ఖర్చు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైయింది. స్వచ్ఛంద సంస్థల సర్వేలో 7 శాతం నిధులు కూడా ఖర్చు పెట్టలేదని బయట పడింది. గత 20 సంవత్సరాల కాలంలో షెడ్యూల్డ్ తెగలకు కేటాయించిన నిధుల్లో 21,604.41 కోట్లు కోత విధించగా, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన 5 వేల కోట్లు ఖర్చు చేయలేదు. ఈ విధంగా ఉప ప్రణాళికలో కేటాయించిన నిధుల్లో 26,604.41 కోట్లు ఇతర రంగాలకు మళ్లించబడ్డాయి. ఈ మొత్తంలో హైద్రాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు, హుస్సేన్‌సాగర్ ఆధునీకరణ, జలయజ్ఞం కోసం 4వేల కోట్లు మళ్లించటం జరిగింది. 2005,2010-11 ఆర్థిక సంవత్సరం వరకు షెడ్యూల్డ్ తెగల-కులాలకు ఉప ప్రణాళికలో 25,647 కోట్లు కేటాయించవలసి ఉండగా 12,476 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. మిగతా 13,171 కోట్లు ఇతర రంగాలకు మళ్లించారు.

| సంవత్సరం | ప్రణాళిక బడ్జెట్ | కేటాయింపులు | కేటాయించింది | ఖర్చు చేసింది | దారిమళ్లించింది |
|---|---|---|---|---|---|
| 2004-05 | 13,291 | 2,153 | 1,181 | 1,341 | 811 |
| 2004-06 | 15,650 | 2,635 | 1,445 | 1,431 | 1,193 |
| 2006-07 | 19,717 | 3,194 | 1,537 | 2,255 | 0,935 |
| 2007-08 | 32,968 | 5,340 | 4,249 | 3,660 | 1,680 |
| 2008-09 | 43,491 | 6,997 | 7,470 | 1,110 | 5,887 |
| 2009-10 | 33,496 | 5,426 | 5,426 | 2,764 | 2,661 |
| మొత్తం | 1,58,313 | 25,648 | 21,309 | 12,476 | 13,171 |

పట్టిక-1 : ఆధారం ప్రజాశక్తి

## విద్యార్థుల సంక్షేమం పట్టించుకోని పాలకులు

గిరిజనుల, దళితుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు జరుపుతూ, వారి అభివృద్ధికి తోడ్పడు తున్నాయని, వారి పిల్లలు చదువుకోవటానికి, ఉద్యోగాలు పొందటానికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాయని, ఉచిత చదువుతోపాటు, హాస్టల్ సౌకర్యం కల్పించామని పాలక ప్రభుత్వాలు డబ్బా వాయించుకొంటున్నా ఆచరణ అందుకు భిన్నంగా ఉంది. 64 సం॥రాల అధికార మార్పిడి కాలంలో గిరిజనుల జీవితాల్లో మౌలికమైన మార్పులు జరగలేదు. పాలకుల విధానాల ఫలితంగా అనేక గిరిజన జాతులు అంతరించే ప్రమాదంలో పడ్డాయి. గిరిజన పిల్లలకు విద్య నామమాత్రంగానే అందుతున్నది. వీరి పిల్లలు అత్యధికులు ఇప్పటికీ విద్యకు దూరంగానే ఉంటున్నారు. గిరిజన విద్యార్థులకు బడ్జెట్ కేటాయింపులు నామమాత్రంగా ఉండటంతో వారు విద్యనభ్యసించటం సమస్యగా మారుతున్నది. వీరి వసతి గృహాలను, హాస్టల్ పరిస్థితులను గమనిస్తే వీరు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు కళ్ళముందు ప్రత్యక్షమౌతాయి. గిరిజన విద్యార్థులకు గత సంవత్సరం బడ్జెట్‌లో 387.52 కోట్ల రూపాయలు కేటాయించారు. ఖర్చు పెట్టింది 274.57 కోట్లు మాత్రమే. బడ్జెట్ కేటాయింపులే సరిపోవని విద్యార్థులు ఆందోళన చేస్తుంటే అదికూడా ఖర్చు చేయక పోవటం గిరిజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నది.

గిరిజన సంక్షేమశాఖ పరిధిలో రాష్ట్రంలో 442 వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో బాలురకు 331, బాలికలకు111 కేటాయించారు. ఈ వసతి గృహాల్లో 72,420 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కొక్క వసతి గృహంలో రెండు వందల మంది వరకు ఉండటం వలన విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. అవసరమైన మేర మరుగుదొడ్లు, స్నానాల గదులు లేకపోవటం, ఉన్నవి కూడా శుభ్రపర్చే సౌకర్యాలు చేపట్టకపోవటం వలన అవి దుర్గంధపూరితంగా వినియోగానికి అనుగుణంగా లేకపోవటం వలన కాలకృత్యాలు తీర్చుకోవటం విద్యార్థులకు సమస్యగా మారుతున్నది. బాలికల అవస్థలైతే మాటల్లో చెప్పటం సాధ్యం కాదు. వీరికి కనీసపాటి వసతులు కూడా లేక, అల్లరి మూకల వేధింపులకు గురికావాల్సి వస్తున్నది. హాస్టల్స్‌లో ఉంటున్న గిరిజన విద్యార్థుల ఎడల అధికారులకే కాకుండా, వార్డెన్లకు చిన్న చూపు ఉంది. దీనికి తోడు మెస్‌ఛార్జీల కేటాయింపులు నామమాత్రంగా ఉండటంతో పాటు, వార్డెన్ల అవినీతి వలన నాసిరకం ఆహారమే విద్యార్థులకు అందటం వలన డయేరియాలాంటి వ్యాధులకు గురౌతున్నారు. హాస్టల్ చుట్టూ పందులు, కుక్కలు స్వయం విహారంతోపాటు, పెద్దఎత్తున దోమలు చుట్టుముట్టటంతో మలేరియా, టైఫాయిడ్, మెదడువాపు వ్యాధులకు గురౌతున్నారు. గిరిజన బాలికల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, భయపెట్టి అనేకమంది వార్డెన్లు, వారిపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అత్యాచారాలకు గురైన, గర్భవతులైన గిరిజన బాలికల ఉదంతాలు బయటపడుతూనే ఉన్నాయి.

## అరకొర పాఠశాలలు

విద్యను కొనసాగించటంలో గిరిజనులు చాలా వెనుకబడి ఉన్నారు. వారు నివశిస్తున్న ప్రాంతాల్లో పాఠశాలలు నామమాత్రంగా ఉండటం, చదువుకోవటానికి పట్టణ ప్రాంతాలకు వెళ్లవలసి ఉండటం వలన ఆర్థిక సమస్య ఎదురై తమ పిల్లలను గిరిజనులు చదివించుకోలేక పోతున్నారు. ప్రాథమిక విద్యతోనే ఎక్కువ మంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. 2001-10 సం॥ మధ్యకాలంలో రాష్ట్ర వ్యాపితంగా 3,12,308 మంది గిరిజన బాల, బాలికలు ఒకటవ తరగతిలో చేరినా 2009-10 నాటికి చదువును కొనసాగించే విద్యార్థుల సంఖ్య 72,606కి తగ్గిపోయిందంటే, వారు ఎంతగా చదువుకి దూరమౌతున్నారో అర్థమౌతుంది. గిరిజనులకు విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు, మెరుగైన విద్యను

**2010-11లో బడ్జెట్ కేటాయింపులు, మంజూరు, ఖర్చుల వివరాలు (కోట్లలో)**

| విద్యాసంస్థలు | కేటాయింపులు | మంజూరు | ఖర్చు | విద్యాసంస్థలు | విద్యార్థులు |
|---|---|---|---|---|---|
| హాస్టళ్ళు ఆశ్రమపాఠశాలలు | 387.52 | 296.93 | 274.57 | 442 | 77,420 |
| | | | | 599 | 84,875 |
| గురుకుల పాఠశాలలు | 34.00 | 56.85 | 51.16 | 272 | 74,952 |
| ఉన్నత పాఠశాలలు | 15.40 | 14.47 | 10.12 | 118 | 5,889 |
| మొత్తం | 436.92 | 368.25 | 335.88 | 1,431 | 1,42,832 |

పట్టిక-2 : ఆధారం సూర్యపత్రిక

అందించేందుకు పాఠశాలలు, కాలేజీలే కాకుండా గురుకుల పాఠశాలలుకూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్పుకొంటున్నది. మంచి విద్యకోసం 272 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి 84,876 మందికి విద్యతోపాటు, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెబుతున్నది. వీటితోపాటు ఐ.టి.డి.ఏ.ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో చురుకైన విద్యార్థులకు ఉత్తమ పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నది. ఇలాంటి పాఠశాలల్లో ఎంపిక పద్ధతి వలన అత్యధిక గిరిజనులకు వీటిల్లో చదువుకొనే అవకాశం లేకుండా పోతున్నది. ఇలాంటి చర్యలతో ప్రభుత్వం గిరిజన విద్యార్థుల్లో విభజనను కల్పిస్తున్నది. ఇవేకాకుండా 599 ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి 84,675 మందికి విద్యను, వసతిని ఒకే చోట కల్పిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలియచేస్తున్నారు. ఈ పాఠశాలల్లో 48 ప్రాథమిక పాఠశాలలు, 223 ప్రాథమికోన్నత పాఠశాలలు, 330 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని చెబుతున్నారు. గిరిజన విద్యార్థులు చదువుకోవటానికి ఇవి సరిపోవు. ఇంకా అనేక పాఠశాలలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆశ్రమ పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలలు 48 ఉండటం వలన వీటిల్లో చేరే విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగానే ఉంది. ఈ పాఠశాలల్లోనూ సౌకర్యాలు సంక్షేమ హాస్టల్స్‌కి భిన్నంగా లేవనీ, వసతుల లేమితో బాధపడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. ఇందుకు బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండటమే కారణం. అంతేకాకుండా కేటాయించిన బడ్జెట్లను పూర్తిగా విడుదల చేయకపోవటం, విడుదల చేసిన నిధులను పూర్తిగా ఖర్చుపెట్టటం కూడా జరగటంలేదు. అందుకు 2010-11 బడ్జెట్టే నిదర్శనం. (పట్టిక-2)

బడ్జెట్ కేటాయింపులు, మంజూరు, ఖర్చులు పరిశీలిస్తే, ఈ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సదుపాయాలకు, భోజనవసతికి ఏమాత్రం సరిపోదని, అందుకే విద్యార్థులు వసతుల లేమితో యిబ్బందులు పడుతున్నారని అర్థమౌతుంది. ఈ పాఠశాల సంఖ్యను, కాలేజీలను అవసరమైన మేరకు అదనంగా ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులందరికీ విద్యను అభ్యసించే అవకాశం కల్పించి, అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరిగితేనే గిరిజన విద్యార్థులు సక్రమంగా చదువుకోగలుగుతారు.

## దారి మళ్లిన దళితుల నిధులు

వెనుకబడిన కులాల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టామని అందుకు నిధులు కేటాయిస్తున్నామని, వారు ఎంతో అభివృద్ధి చెందుతున్నారని ప్రభుత్వం ప్రచారం సాగుతూనే వుంది. వాస్తవంలో వీరు నిర్లక్ష్యానికి గురికాబడుతున్నారు. వారి అభివృద్ధికి కేటాయిస్తున్నదీ, ఖర్చు చేస్తున్నదీ కూడా నామమాత్రంగానే ఉన్నది. వారికి కేటాయించిన నిధులు కూడా దారిమళ్లించబడుతున్నాయి. దళితుల జనాభా ప్రకారం బడ్జెట్‌లో కేటాయింపులు జరగటం లేదు. స్పెషల్ వీల్ కాంపొనెంట్ ప్రకారం ఎస్సీలకు నిధులు కేటాయించాలని కోరుతున్నా, దాన్ని ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. 2004-05 నుండి 2010-11 వరకు సబ్ ప్లాన్ నిధుల ప్రకారం బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, మళ్లించబడిన నిధులు పరిశీలిస్తే (పట్టిక-1) వెనుకబడిన కులాల అభివృద్ధి ఎడల పాలకుల నిర్లక్ష్యం తేటతెల్లమౌతుంది.

ఈ పట్టిక ప్రకారం ఆరు ఏళ్ల బడ్జెట్ల మొత్తం 1,58,313 కోట్లు కాగా, ఎస్సీలకు కేటాయించింది 25,648, విడుదల చేసింది 21,309, ఖర్చుచేసింది 12,476, దారిమళ్లించబడింది 13,171 కోట్లు. అంటే ఖర్చు చేసిన దానికన్నా దారిమళ్లించిందే ఎక్కువగా ఉంది. ఈ విధంగా వెనుకబడిన కులాల అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపుల్లోనూ, ఖర్చు చేయటంలోనూ పాలక ప్రభుత్వాలు ఉద్దేశపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.

వెనుక బడిన కులాల వారు ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడి ఉండటం వలన చదువులోను వారి పిల్లలు ముందుకు పోలేక పోతున్నారు. ప్రాథమిక విద్యతోనే అత్యధికులు చదువుకి దూరమౌతున్నారు. గతపది సంవత్సరాల కాలంలో 4,76,514 మంది పిల్లలు ఒకటవ తరగతిలో చేరగా, పదో తరగతికి వచ్చే సరికి 1,76,514 మంది మాత్రమే విద్యను కొనసాగించ గలిగారు, దాదాపు మూడువంతుల పిల్లలు చదవు మానుకోవాల్సి వచ్చింది.

## భూ పంపిణీయే పరిష్కారం

గిరిజనులు, వెనుకబడిన కులాలు, ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడి ఉండటానికి, దుర్భరమైన జీవితాలు గడపటానికి భూ పంపిణీ జరగక పోవటమే కారణం. నేటికి 80% దాకా వ్యవసాయ భూములు భూస్వాముల, సంపన్నవర్గాల చేతుల్లో ఉన్నాయి. వీరి చేతుల్లో బంధించబడిన భూములు పేదల పరమైతే, ఆ భూముల సేద్యం ద్వారా వచ్చే ఆదాయం వారి జీవితాల్లో మార్పును తీసుకొస్తుంది, సాంస్కృతికంగా మార్పును తీసుకొస్తుంది. వారి పిల్లలను చదివించుకో గలిగే స్థితి ఏర్పడుతుంది. భూస్వామ్య ప్రతినిధి వర్గాలైన పాలకులు–భూ కామందులవద్దనున్న భూములను పేదలకు పంచలేరని 64 సంవత్సరాల 'స్వతంత్ర' పాలన అనుభవాన్నిచ్చింది. అందుకే అన్ని కులాలలోని పేదలు సమైక్యంగా భూమికోసం ఉద్యమించి భూములు పంచుకోవటం ద్వారానే భూమిపై పేదలకు హక్కు ఏర్పడుతుంది. ఆ దిశగా గిరిజనులు, వెనుకబడిన కులాల, ఇతర కులాల పేదలు ఐక్యంగా పోరాటాన్ని ఎక్కుపెట్టాలి.

## కా॥ ఈడా వెంకటేశ్వరరావు సంతాపసభ

**ప్రొద్దుటూరు, 11-5-11:** సీనియర్ కామ్రేడ్, సిపిఐ (ఎం-ఎల్) సభ్యులు కా॥ వెంకటేశ్వరరావు మరణవార్త విన్న వెంటనే కా॥ భీమవరపు గురవారెడ్డి, కా॥ ఈడా కృష్ణమూర్తి, కా॥ దాకారపు నాగేశ్వరరావు, కా॥ వీరబాబు తదితర నాయకులు, కార్యకర్తలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి జోహార్లు తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాప సానుభూతిని తెలియపర్చారు. అనంతరం ప్రొద్దుటూరు సిపిఐ (ఎం-ఎల్) గ్రామ శాఖ ఎర్రజెండాలతో ఊరేగింపుగా భౌతికకాయాన్ని స్మశానానికి తరలించి అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

11-5-2011న కా॥ ఈడా వెంకటేశ్వరరావు సంస్మరణ సభ ప్రొద్దుటూరు గ్రామంలో ఈడా అక్కతాతయ్య (అమర జీవుల స్థూప నిర్మాణ కమిటి) అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య, కా॥ భీమవరపు గురవారెడ్డి (తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు), కా॥ మసిముక్కు మాధవరావు, (సిపిఎం), కా॥ దివికుమార్ (జనసాహితి), కా॥ వీరబాబు (సిపిఐ (ఎం-ఎల్) తదితరులు ప్రసంగించి కా॥ వెంకటేశ్వరరావు కృషిని గుర్తుచేసుకొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# ప్రైవేటీకరణకు రాచబాటవేస్తున్న విద్యాహక్కు చట్టం నియమావళి

**"బాలలకు** ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009"ని భారత పార్లమెంటు 29 ఆగష్టు 2009న ఆమోదించింది. విద్యను ప్రాథమిక హక్కుగా చేస్తూ రాజ్యాంగ సవరణ చేసిన 8 సంవత్సరాల తరువాత దాని అమలు కొరకు భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని చేసింది. బాలలకు విద్యాహక్కును కల్పించటానికి ఉద్దేశించిన ఈ చట్టం విద్యావ్యాపారేతర కార్పొరేట్ పెట్టుబడి విద్యారంగంలో ప్రవేశించటానికి, విద్యను మరింత ఖరీదైనదిగా మార్చడానికి అనువుగా ఉన్నది. ప్రపంచబ్యాంకు సూచనల మేరకు నయాఉదారవాద ఆర్థిక విధానాలలో భాగంగా 'సమ్మిళిత అభివృద్ధి', 'ప్రభుత్వ ప్రజల భాగస్వామ్యం' పేరిట అనుసరిస్తున్న సరళీకరణ విధానాలను విద్యారంగంలో ప్రవేశ పెట్టడానికి ఈ చట్టం అవకాశాలు కల్పిస్తున్నది. భారత దేశంలో ఈ చట్టం 2010 ఏప్రియల్ 1 నుండి అమలులోనికి వచ్చింది. దీని అమలుకు నమూనా నియమావళిని కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నమూనా నియమావళి ఆధారంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వాటి నియమాలను రూపొందించుకొనవలసి వున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2011 మార్చి 31న విద్యాహక్కు చట్టం అమలుకు నియమాలను విడుదల చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో విద్యాహక్కుచట్టం 2010 ఏప్రిల్ ఒకటి నుంచి అమలు కావలసినప్పటికీ, నియమావళిని విడుదల చేయటంలో దాదాపు ఒక సంవత్సరం జాప్యం చేసిన కారణంగా 2011-12 విద్యా సంవత్సరం నుంచి అమలుకానున్నది. 6 నుండి 14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందిస్తామని ఈ నియమావళిలో పేర్కొన్నారు. వివిధ ప్రపంచదేశాలలో 18 సం॥ వరకు పాఠశాల విద్యను అందిస్తుంటే మన దేశంలో 14 సంవత్సరాలకే దీనిని పరిమితం చేయడం జరిగింది. 3-6 సం॥ వయసుగల వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించటానికి ప్రభుత్వం సిద్ధంగాలేదు. విద్యను హక్కుగా అందిచటానికి అవసరమైన పాఠశాల వ్యవస్థను ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం చేపట్టటంలేదు. ప్రభుత్వం తన పాత్రను పాఠశాలలను అందుబాటులో ఉంచటం వరకే పరిమితం చేసుకొన్నది. ఒక నివాస ప్రాంతంలో 5వ తరగతి వరకు అయితే 1 కి.మీ. పరిధిలో, 8వ తరగతి వరకు అయితే 3 కి.మీ. పరిధిలో పాఠశాలఉన్నట్లయితే ఇక ప్రభుత్వం పాఠశాలను స్థాపించనవసరం లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నియమాలలో 3 కి.మీ. పరిధిలో 8వ తరగతి వరకు పాఠశాలలను ఏర్పాటు చేయడానికి హామీనివ్వలేదు. ప్రాథమిక విద్యను అందుబాటులో ఉంచటంలో భాగంగా తల్లిదండ్రులు తమ పిల్లలను మెరుగైన పాఠశాలలో చేర్చుకునే అవకాశం కల్పించుటకు ప్రైవేటు, ప్రభుత్వ సహాయం పొందని గుర్తింపుగల పాఠశాలలలో విద్యార్థులను చేర్చుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ ప్రజల భాగస్వామ్యం పేరుతో, పేద విద్యార్థులకు కూడా సంపన్నుల బిడ్డలతో పాటు చదువుకుందిస్తామంటూ ప్రైవేటు పాఠశాలలలో చేరిన విద్యార్థులకు బోధనా రుసుమును ప్రభుత్వమే చెల్లిస్తానని ప్రకటించింది. అంతేకాదు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలన్నింటిలోను, ప్రభుత్వ సహాయం పొందని పాఠశాలలన్నింటితో సహా, విద్యార్థుల సంఖ్యలో కనీసం 25 శాతానికి తగ్గకుండా వివిధ బలహీన వర్గాల, వికలాంగుల, అనాథల, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల విద్యార్థులను చేర్చుకోవాలని నియమావళిలో పేర్కొన్నది. అప్రాధాన్యత వర్గాలు, అనాథలు, వికలాంగులకు 5%, ఎస్‌సిలకు 10%, ఎస్‌టిలకు 4%, బలహీన వర్గాలు అంటే వెనుకబడిన తరగతులు, మైనార్టీలు, ఇతరులకు (60,000 కంటె తక్కువ వార్షికాదాయం కలవారు) 6%, మొత్తం 25% చేర్చుకోవాలి. వారికి బోధనా తరగతులను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సగటున ఒక్కొక్కరికి ఎంత ఖర్చవుతుందో లెక్కించి అంత చెల్లిస్తారు. ప్రజల ప్రభుత్వం భాగస్వామ్యం పేరుతో ప్రైవేటు, కార్పొరేటు వర్గాలకు పాఠశాల విద్యను కట్టబెట్టడానికి తద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరచి, క్రమంగా వీటిని మూసివేయటానికి ప్రయత్నిస్తారు.

ఒక ఆవాస ప్రాంతంలో ఒకే ఉమ్మడి పాఠశాల ఉండాలని డా॥ కొఠారికమీషన్ సిఫారసు చేయగా పాలకులు దానిని పట్టించుకొనకపోగా అనేకరకాల స్థాయిల, వివిధ యాజమాన్యాలను ప్రోత్సహిస్తున్నారు. సంపన్నులకు, ఉన్నత మధ్యతరగతికి, మధ్యతరగతికి, విభిన్న స్థాయిల పాఠశాలలున్నాయి. ప్రభుత్వరంగంలో కూడా నవోదయ, కేంద్రీయ, ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ, పంచాయితీరాజ్, మునిసిపల్ పాఠశాలలున్నాయి. వీటిలో వేర్వేరు సిలబస్, వేర్వేరు మాధ్యమాలున్నాయి. మౌలిక సదుపాయాలలో కూడా అంతరాలున్నాయి. వీటన్నింటినీ తొలగించి ఉమ్మడి పాఠశాలల వ్యవస్థను స్థాపించి అందరికీ ఒకేరకమైన నాణ్యమైన విద్యను అందించుటకు బదులుగా, ఆయా పాఠశాలలను అదేవిధముగా కొనసాగిస్తూ వాటిలో చేరిన పేదవర్గాల వారికి ప్రభుత్వమే రుసుము చెల్లించడం-ప్రైవేటు రంగాన్ని అభివృద్ధి చేయటానికేననేది సుస్పష్టం!

విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లోనికి ప్రభుత్వ బోధనా రుసుముతో పేద, వెనుకబడిన తరగతులను చేర్పుకోవడం ద్వారా ప్రభుత్వ పంచాయితీరాజ్ పాఠశాలల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలో చేరటం ద్వారా అవి మూతబడే అవకాశం ఉంది. ప్రపంచబ్యాంకు నిర్దేశించిన విధంగా 2020 నాటికి పాఠశాల విద్యను ప్రైవేటీకరించే దిశగా ఈ నియమావళి రూపొందింది. ప్రభుత్వ-ప్రజల భాగస్వామ్యం పేరుతో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పరచి పాఠశాలలకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయటం, విద్యార్థులను పాఠశాలలకు పంపే బాధ్యతను నిర్వర్తించడం, పాఠశాలలకు అవసరమైన బోధనా సిబ్బందిని ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలున్న వారిని నియమించటం, వారికి జీతభత్యాలను నిర్ణయించటం, సిబ్బంది జీతభత్యాలు, ఇతర ఖర్చులకవసరమైన నిధిని అంచనా వేసి, ఆ నిధులు ప్రభుత్వం వద్దనుండి గ్రాంటు తెప్పించుకోవటం మొదలైన విధులను ఈ కమిటీలు నిర్వర్తిస్తాయి. అంటే పాఠశాల నిర్వహణ బాధ్యత మొత్తం పాఠశాల కమిటీలకు అప్పగించటం ద్వారా క్రమంగా రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొంటుంది. 25% విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపే కార్యక్రమాన్ని కూడా గ్రామ పంచాయితీలు నిర్వర్తిస్తాయి. వారు సిఫారసు చేసిన విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తారు. మిగిలిన వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేరతారు. ప్రైవేటు పాఠశాలలో చేరే విద్యార్థులను వారు ద్వితీయ శ్రేణి విద్యార్థులుగా చూసే అవకాశముంది. వారిని, మిగిలిన విద్యార్థులతో పాటు సమానంగా చూడాలని, ఎటువంటి వివక్షా చూపరాదని నియమావళిలో పేర్కొన్నప్పటికీ అమలు కావటం కష్టం. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు అందే కార్పొరేట్ వైద్యం ఎంత వివక్షా పూరితంగా ఉందో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. అటువంటి పరిస్థితే పేద విద్యార్థులకు కూడా ఏర్పడుతుంది.

25% విద్యార్థులను చేర్చుకున్న పాఠశాలలకు సెప్టెంబరులో మొదటి విడత, జనవరిలో రెండవ విడత, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని నియమావళిలో పేర్కొన్నారు. జులై నెలలో విద్యార్థుల జాబితాను ప్రభుత్వానికి అందచేస్తే యాజమాన్యాలకు రీయింబర్స్‌మెంట్ చేయటం జరుగుతుంది. ఈ రీఇంబర్స్‌మెంట్ సక్రమంగా చేయకపోతే విద్యార్థులకు అనేక ఇబ్బందులు, యాజమాన్యాల వేధింపులు ఎదురవుతాయి. ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సక్రమంగా చెల్లించటంలేదు. కళాశాల విద్యార్థులు ఆందోళన చేస్తే విడతలు విడతలుగా విడుదల చేస్తోంది. యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయి. రీఇంబర్స్‌మెంట్ చేయకపోతే ఆందోళన చేసే స్థాయి కూడా పాఠశాల విద్యార్థులకు ఉండదు. క్రమంగా ఈ పథకం ప్రభుత్వ, పాలకుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సివుంటుంది. క్రమంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మృగ్యమై ప్రైవేటురంగం ఆధిపత్యం సంపాదించే అవకాశం ఉంది. ఇప్పటికే మన రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

భారతదేశంలో ఏటా 2,40,000 కోట్ల రూపాయల విద్యావ్యాపారం చేసుకోవటానికి అవకాశం కల్పించాలని ప్రపంచబ్యాంకు నిర్దేశించిన పిమ్మట ఈ విద్యాహక్కు చట్టం వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టం అమలుకు రూపొందించిన నియమావళి ప్రైవేటీకరణను వేగవంతం చేసేదిగా ఉంది.

★

# శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్ (బొమ్మనహాళ్) యాజమాన్య దోపిడీ, దురాగతాలకు వ్యతిరేకంగా రైతాంగ, ప్రజాఆందోళన

**1992లో** అనంతపురంజిల్లా బొమ్మనహాళ్ మండలం హరేసముద్ర పరిధిలో శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్ యాజమాన్యం ఆ ప్రాంత రైతులను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి అతి తక్కువ ధర చెల్లించి అక్రమంగా పెద్దఎత్తున భూములను సొంతం చేసుకొని పరిశ్రమ నిర్మాణం పూర్తిచేసింది.

పరిశ్రమ ఏర్పాటుకు ముందు యాజమాన్యం ప్రకటించిన హామీలు కానీ, ఒప్పందం ప్రకారం నిబంధనలు కానీ ఈనాటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ ప్రాంతంలో త్రాగునీరు, రోడ్లు, మురుగునీటి పారుదల, విద్య, వైద్యానికి హామీఇచ్చిన విధంగా చర్యలు చేపట్టలేదు. కాలుష్య నివారణకు చెట్ల పంపకాన్ని చేపడ్తామన్న దానిని గాలి కొదిలేశారు. పరిశ్రమకు 3 కి॥మీ పరిధిలోని భూములకు వాటిల్లే నష్టాన్ని పరిగణలోకి తీసుకొని చెల్లిస్తామన్న నష్ట పరిహారాన్ని చెల్లించలేదు. స్థానికులకు ఉద్యోగాల కల్పన నీటిమూటయ్యింది. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత లేదు. పరిశ్రమ ఉద్యోగులలో స్థానికుల సంఖ్య పెరగకుండా చూసేందుకు పనికట్టుకుని ఇతర రాష్ట్రాల వారిని పనిలో పెట్టుకున్నారు. ఫ్యాక్టరీ కార్మికులు యూనియన్ పెట్టుకునేందుకు అనుమతించలేదు. పరిశ్రమలలో జరిగిన ప్రమాదాలలో మరణించిన లేదా గాయపడిన వారికి కనీస పరిహారం కూడా అందించటంలేదు.

ఈ పరిశ్రమ కారణంగా బొమ్మనహాళ్, కురవల్లి, హరే సముద్రం, సిద్దరాంపురం, బొల్లనగడ్డం పంచాయితీల పరిధిలోని దాదాపు 1500 ఎకరాల భూములు తీవ్ర కాలుష్యానికి గురయ్యాయి. ఈ ప్రాంతంలో జల, వాయు కాలుష్యం ఫలితంగా పంటలు దెబ్బతిని రైతులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఫ్యాక్టరీనుండి వెలువడే వ్యర్థరసాయనాలతో కూడిన నీటిని పంట కాలువలకు మళ్ళించటంతో భూములు నిస్సారంగా మారిపోయి సాగుకు యోగ్యం కాకుండా పోయాయి. కాలువలలో కలుస్తున్న కాలుష్యపు నీటిని తాగి గొర్రెలు, పశువులు చనిపోతున్నాయి. ఫ్యాక్టరీనుండి భారీగా వెలువడే దుమ్ము, ధూళితోపాటు ఖనిజపు రవ్వలు, సిలికాన్ రవ్వలు పొలాలలోని పంటలను కప్పివేయడంతో పంటలు ఎదుగుదలలేక, దిగుబడులు పూర్తిగా తగ్గిపోయి రైతులు కుంగిపోతున్నారు. ఫ్యాక్టరీనుండి వెలువడే కాలుష్యం ఫలితంగా పరిసర గ్రామాల ప్రజలకు క్షయ, కీళ్ళ జబ్బులు, ఎముకలు పెళుసుబారటంలతోపాటు అకాల మరణాలకు గురవుతున్నారు.

వేదవతి హగరిలో ఫ్యాక్టరీ నీటి అవసరాలకోసం భారీ బోర్లువేసి నీటిని తోడివేస్తున్నందున భూగర్భ జలాలు అడుగంటి తాగునీరు, సాగునీరు కరువై ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు.

గత 18 సం॥లపైగా అడ్డూ అదుపూలేకుండా సాగించిన విచక్షణ రహిత దోపిడీ ఫలితంగా శాతవాహనా ఇస్పాత్ లిమిటెడ్ యాజమాన్యం వందలకోట్ల రూపాయల లాభాల్ని పోగేసుకుంది. అంతేగాక, పాలక ప్రభుత్వ మంత్రులు, అధికారులతో సన్నిహిత సంబంధాలలో వుంటూ సబ్సిడీల రూపంలో, తప్పుడు లెక్కలతో ఇన్సూరెన్స్ రూపంలోనూ కోట్ల రూపాయలను దిగమింగింది. ప్రజలను మాత్రం తీవ్ర దురవస్థల పాల్జేసింది.

శాతవాహనా ఇస్పాత్ లిమిటెడ్ యాజమాన్య దోపిడీ, దురాగతాలకు వ్యతిరేకంగా బాధిత ప్రజానీకం సంబంధిత అధికార్లకు ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా దున్నపోతుపై వానకురిసిన చందంగా మిన్నకున్నారు మినహా ప్రజలగోడు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఈనేపథ్యంలో ఇటీవల పరిశ్రమ యాజమాన్యం 350 కోట్ల రూ॥వ్యయంతో స్టీల్ ప్లాంట్‌ను ఆధునీకరించేందుకు, విస్తరించేందుకు పూనుకొంది. పరిశ్రమ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలపట్ల ప్రజలనుండి ఇప్పటికే వెల్లువెత్తుతున్న అభ్యంతరాలు, నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయసేకరణ జరుపుతామని ప్రకటించింది.

2010 నవంబర్ 3వ తేదీన బొమ్మనహాళ్ మండలం హరేసముద్ర గ్రామ పరిధిలోని తమ పరిశ్రమ ఆవరణలో ప్రజాభిప్రాయసేకరణకు ఏర్పాట్లు చేశారు. అయితే పథకం ప్రకారం దీనిని ఒక తంతుగా ముగించదల్చుకున్న యాజమాన్యం- రైతుకూలీసంఘం, ఇతర ప్రజాసంఘాల నాయకులు, బాధిత ప్రజలు సమావేశ స్థలానికి చేరుకునేలోపే కేవలం 20 నిముషాల వ్యవధిలోనే ప్రజాభిప్రాయ సేకరణ ముగిసినట్లుగా అధికారులచే ప్రకటింపజేసి, ప్రజాసంఘాలవారినెవరినీ అభ్యంతరాలు వ్యక్తం చేయటానికి గానీ, విజ్ఞాపన పత్రాలు అందించటానికి గానీ లోపలికి అనుమతించకుండా గేట్లను మూసివేసి, పోలీసులను పెద్దఎత్తున మోహరించి అడ్డుకున్నారు.

యాజమాన్యంయొక్క ఈ దుష్ట చర్యలను వ్యతిరేకించినందుకుగానూ, బయట ప్రపంచానికి వెల్లడిచేసినందుకుగానూ కక్షబూని కొందరు రైతులపై తప్పుడు కేసులు బనాయించారు. బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించి భయోత్పాతానికి గురిచేశారు. తాము రైతులకు, పరిసర ప్రాంత ప్రజలకు చేస్తున్న చేటుపై నోరెత్తకుండా చేయాలని ప్రయత్నించారు.

అదేవిధంగా 2011 మార్చి 23న హైదరాబాద్‌లో 'కాలుష్య నియంత్రణ మండలి' నిర్వహించిన విచారణ సందర్భంగానూ కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం సమావేశ మందిరం బయటనే రైతులపై బెదిరింపులకు పూనుకుంది. ఒక్క ఎకరా భూమికి కూడా నష్టపరిహారం చెల్లించేదిలేదని అహంకారాన్ని ప్రదర్శించింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ ఉన్నతాధికారుల సమక్షంలోనే బుకాయింపులకు, అదరగండానికి పూనుకొని ప్రజలపట్ల, రైతులపట్ల, వారి జీవితాలపట్ల చులకన భావంతో, లెక్కలేనితనంతో వ్యవహరించింది.

'శాతవాహన' ఫ్యాక్టరీ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలపట్ల ప్రజలలో వ్యక్తమౌతున్న వ్యతిరేకతకు తోడు, పొరుగునవున్న ఆపిల్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా డి. హీరేహాళ్ మండలంలోని రైతుల ఆందోళన ఫలితంగా ఇటీవల వారికి నష్టపరిహారం చెల్లించి వుండటం, తదితర కారణాలతో ఎట్టకేలకు రాష్ట్రప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి 2011 మార్చి 23న జరిపిన విచారణ అనంతరం 'శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్, నిబంధనలను ఉల్లంఘించిందని' భారీ కాలుష్యానికి పాల్పడిందనీ ప్రకటించక తప్పలేదు. ఈ నిర్ణయం మేరకు కాలుష్యానికి గురైన భూములను, రైతులు పొందిన నష్టాలను అంచనా వేసేందుకు జిల్లా కలెక్టర్, అధికారుల బృందాన్ని నియమించారు. ఇంకా ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు వ్యతిరేకంగా పావులు కదుపుతూనే వుంది.

దాదాపు గత రెండు దశాబ్దాలకాలంగా ప్రజల, రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న 'శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్' కంపెనీని ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని బాధిత ప్రజలకు న్యాయం చేయాలని, ప్రజలపట్ల, రైతులపట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై కేసులు పెట్టి శిక్షించాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాయదుర్గం ఏరియాలో విస్తృత ప్రచారం సాగిస్తూ, ప్రజలను మరింత సమరశీల ఆందోళనకు సన్నద్ధం కమ్మని పిలుపు నిస్తున్నది.

★


వెలువడింది!

సంకలనం-2010

(24 సంచికలు)

వెల. రూ 150/-

కాపీలకు: మైత్రీ బుక్ హౌస్

జలీల్ వీధి, అరండల్‌పేట,

విజయవాడ

# 'సామాజిక రచనల కలమూ-ప్రజాఉద్యమ కలకలమూ విశ్వమోహనరెడ్డి'

## కా॥ విశ్వమోహన్ జీవితంలోని రచనా పార్శ్వాన్ని ఆవిష్కరించిన సభలో సాహిత్యకారుల విశ్లేషణ


సభలో ప్రసంగిస్తున్న నాగభూషణాచార్యులు; వేదికపై ఇతర వక్తలు

సభకు హాజరైన ప్రజానీకం



ప్రజాకళాకారుల ప్రదర్శన

**కామ్రేడ్** విశ్వమోహనరెడ్డి కమ్యూనిస్టుగా, కాకలుతీరిన రైతాంగ, ప్రజాఉద్యమ నేతగా మాత్రమే లోకానికి సుపరిచితులు. కానీ కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి చేయి తిరిగిన ఒక సామాజిక ప్రజారచయిత అనే విషయం చాలామందికి తెలీదు.

కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి జీవితపు సాహితీ కోణాన్ని ఉద్యమ ప్రజానీకం వద్దకు చేరవేసే ప్రయత్నంలో భాగంగా సిపిఐ(ఎం.ఎల్) గుంటూరు జిల్లాకమిటీ ఆధ్వర్యంలో **'కామ్రేడ్ కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి : ఒక రచయిత-ఒక ఆలోచనీయత - ఒక కమ్యూనిస్టు'** అనే శీర్షికన పిగుగురాళ్ళ-లెనిన్‌నగర్‌లో కా॥ విశ్వమోహనరెడ్డి మరియమ్మల స్మారక స్థూపంవద్ద రాజకీయ వేదికపై ఒక అరుదైన సాహిత్య సభ జరిగింది.

కా॥ విశ్వవెూహనరెడ్డి 11వ వర్ధంతి (11-4-2011)ని పురస్కరించుకొని 10-5-2011న నిర్వహించిన ఈ రాజకీయ సాహితీ సమాగమానికి ముందుగా సిపిఐ(ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు కా॥ విశ్వమోహనరెడ్డికి ఆ కామ్రేడ్‌తోపాటు పోలీసుల ఎదురుకాల్పుల హత్యాకాండలో నేలకొరిగిన కామ్రేడ్ మరియమ్మ స్థూపానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సభలో ప్రసంగించటానికి వచ్చిన సాహిత్యకారులు, సాహిత్య సంఘాల నేతలు, ప్రజాతంత్రవాదులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు కామ్రేడ్ విశ్వమోహనరెడ్డికి ఘన నివాళు లర్పించారు.

**ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డి.వి.ఎన్.స్వామి** ఈ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రైతాంగ ప్రజాఉద్యమ నేతగా కా॥ విశ్వమోహనరెడ్డిని ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యేకంగా పరిచయం జేయవలసిన అవసరంలేదనీ, ఈ సభ నిర్వహిస్తున్న ప్రాంతమైన లెనిన్‌నగర్‌తో సహా, పలు పేదప్రజల కాలనీల ఏర్పాటులోనూ; పల్నాడు-వినుకొండ; ప్రకాశంజిల్లాల పరిధిలో భూమిలేని నిరుపేదలను కదిలించి పెత్తందారుల చేతుల్లోని దేవాలయ, పోరంబోకు, సత్రం, ఫారెస్టు భూముల స్వాధీనానికి నాయకత్వం వహించిన రైతాంగ, ప్రజా ఉద్యమనేతగా ఆయన సుపరిచితులేననీ, ఆయనలోని మరో విశిష్టమైన సామాజిక సాహిత్య కోణాన్ని ఆవిష్కరించుకోవటమే ఈ సభ ఉద్దేశ్యంగా వివరించారు.

సభలో మొదటగా **పాలకొల్లు కళాశాల తెలుగు అధ్యాపకులు సాహిత్య విమర్శకులు, కథకులు అయిన ఎన్.వి.యస్.నాగభూషణాచార్యులు** మాట్లాడుతూ కా॥విశ్వమోహనరెడ్డి రచించిన జైలు నవల ఆసాంతం ఏకబిగిన చదివి తీవ్రంగా చలించిపోయానని చెపుతూ, ఆ నవలలోని వివిధ సామాజిక కోణాలను రచయిత ఆవిష్కరించిన తీరును, ఆ నవలలోని వివిధ పాత్రలలో రచయిత ఐడెంటిఫై అయిన తీరును విపులంగా పరిచయం చేశారు. అంతిమంగా వ్యక్తి స్వేచ్ఛ సమాజస్వేచ్ఛతోనే ముడిపడివుందని శాస్త్రీయంగా ప్రబోధించిన నవలగా కొనియాడారు.

### జాక్ లండన్ గాంభీర్యం, చెహోవ్ రచనావేగం

సుప్రసిద్ధ అమెరికన్ సాహితీవేత్త, ఉక్కుపాదం నవలా రచయితగా సుప్రసిద్ధులైన జాక్ లండన్ రచనలన్నీ ఏవిధంగా చిక్కగా, గంభీరంగా సాగుతాయో విశ్వమోహనరెడ్డి రచనాతీరూ ఆ పోలికలో వుంటుందని నాగభూషణాచార్యులు అన్నారు. అలాగే ప్రముఖ రష్యన్ నవలా రచయిత చెహోవ్ వేగంగా రచనలు చేయ గలుగుతాడని ప్రతీతనీ, విశ్వమోహనరెడ్డి కూడా అదేవిధంగా రచనావ్యాసంగం వేగంగా చేయటమే కాకుండా ఏకబిగిన ఉత్కంఠతో చదివించగలిగే చేయి తిరిగిన రచయితగా విశ్లేషించారు.

విశ్వమోహనరెడ్డి రాసిన నవలలన్నింటిలోనూ సామాజిక సమస్యల, ఇతివృత్తాలనే కథావస్తువుగా స్వీకరించారని, ఆయనే పేర్కొన్న విధంగా 'ఎట్టి వాస్తవ రహిత, ఆధార రహిత అభూతకల్పనలను' సృష్టించ లేదన్నారు. 'మానవహోమం', 'పల్లె', 'మాయాలోకం', 'దాడి', 'ప్రేమ', 'బొంగరం', 'క్షణికం', 'దొంగలు', 'బలి', 'అశ్రుతర్పణం', 'జైలు', 'నరబలి', 'మహావీరరావణబ్రహ్మ', 'అలజడి' 'జీవితం', 'సమ్మె', 'తప్పటడుగు', 'ప్రాయశ్చిత్తం', 'విధివంచిత', 'ఎవరిస్వార్థం వారిదే', 'రిగ్గింగ్'వంటి అనేక రచనలు చేసినప్పటికీ-గోరంత కృషికి కొండంత కీర్తిని ఆశించే అనేకమందికి భిన్నంగా-కీర్తిప్రతిష్టలకోసం విశ్వమోహనరెడ్డి తాపత్రయపడలేదన్నారు. ఆయనయొక్క సాహిత్య సృజన వెలుగులోకి రావలసినంతగా రాలేదనీ, తెలుగు సాహిత్యంలో కొడవటిగంటి, రావిశాస్త్రిలాగా ఒక విశిష్ట గుర్తింపు నివ్వాల్సిన విశ్వమోహనరెడ్డి రచనల విశ్లేషణను మరింతగా కొనసాగించాలని అభిప్రాయ పడుతూ అరుదైన ఈ వేదికపై ప్రసంగించే అవకాశం కలిగినందుకు సంతోషం వ్యక్తంచేశారు.

**సాహితీవేత్త, ప్రకాశం జిల్లా ఇంకొల్లు కళాశాల తెలుగు అధ్యాపకులు డా॥ బీరం సుందరరావు** మాట్లాడుతూ విశ్వమోహనరెడ్డి మన మధ్యలేకున్నా ఆయన ఆదర్శాలు, ఆచరణ సజీవంగా వుందన్నారు. ఇంకొల్లు వాసిగా విశ్వమోహనరెడ్డి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ముఖ్యమైన నవలలుగా చెప్పుకోబడే వాటిని విశ్వవెూహనరెడ్డి ఇంకొల్లులో వున్న కాలంలోనే రాశారన్నారు. ఆయనే సంపాదకునిగా, 'గెరిల్లా' పత్రిక నడిపారనీ, 'ప్రగతి ప్రెస్' నడిపారనీ గుర్తుచేశారు. ఈ దోపిడీ వ్యవస్థను కూలదోసేందుకు నిస్వార్థంగా కృషిచేశారనీ, రాజ్యహింసకు నేలకొరిగారనీ నివాళు లర్పించారు. విశ్వమోహనరెడ్డి నవలలలోని కొన్ని ముఖ్యమైన భాగాలను చదివి వినిపించి ఆయన రచనాశైలిని విశ్లేషించారు.

విశ్వమోహనరెడ్డి జీవితపు చివరి సంవత్సరాలలో అనేక కేసులలో న్యాయపర సహకారాన్నందించిన, ఆయనతో సన్నిహిత సంబంధాలు నెరిపిన **ప్రముఖ న్యాయవాది, ప్రజాతంత్రవాది సి. హెచ్.ఎల్. కాంతారావు** మాట్లాడుతూ ఎవరైనా గుర్తుచేసి అడిగితే తప్ప తానొక రచయితనని చెప్పుకోవటంకూడా అలవాటు లేని విశ్వమోహనరెడ్డి విశిష్టతను పేర్కొన్నారు. పోలియో కారణంగా అంగవైకల్యం పొందిన గుర్రం ఇందిరాదేవిని వివాహ మాడటం ఆయన తన జీవితంలో కొనసాగించిన ఆచరణాత్మక ఆదర్శానికి ఉదాహరణ అన్నారు. సామాజిక సమస్యలపై రచనలు చేయటమేకాక, ఈ దోపిడీ వ్యవస్థ మార్పుకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించేందుకు మార్క్సిజం తాత్విక చింతనతో విశ్వమోహనరెడ్డి పూనిక వహించి అలుపెరగని పోరాటం సలిపాడని చెపుతూ, ఆయనతో తనకున్న ప్రత్యక్ష పరిచయ సందర్భాల్ని ప్రస్తావించారు, విశ్వమోహనరెడ్డి తన నవలలో చిత్రీకరించిన విధంగా అసలుదొంగలు పోలీసులేనన్నారు.

**జనసాహితి ప్రధానకార్యదర్శి దివికుమార్** మాట్లాడుతూ విశ్వమోహన్ ఒక అద్భుతమైన వ్యక్తనీ, సమాజంలోని పీడితులపట్ల ఎంతో ప్రేమను, దోపిడీ సాగిస్తున్న వారి పట్ల తీవ్రమైన కసినీ ఆయన తనలో నింపుకున్నారు కనుకనే ఆయన రచనలలో ఒడలు జలదరించే జీవన బీభత్సాన్ని చిత్రీకరించగలిగారన్నారు. విశ్వమోహనరెడ్డితో తన పరిచయం చివరి పది సంవత్సరాలేనని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితాన్ని ఈ అణచివేత వ్యవస్థ ఎన్‌కౌంటర్ చేస్తుందని 'అశ్రుతర్పణం' నవలలో ముందే అంచనా వేసుకొని రాశారన్నారు. మూడురోజుల్లో నవల రాయగలవేగం, ఒకసారి రాసిన తర్వాత దానిని తిరగరాయాల్సిన అవసరం లేని కేంద్రీకరణ అయిన సొత్తు అన్నారు. విశ్వమోహనరెడ్డి ద్వేషించే అంశాలు చాలానేవున్నా సంపద కేంద్రీకరణనూ, కులమత మౌఢ్యాలనూ, పెత్తనాన్ని ఆయన తీవ్రంగా ద్వేషించే వాడన్నారు. వ్యక్తిగత ఆస్తి సమాజాన్ని వ్యతిరేకించి, మితవాద-అతివాద రాజకీయాలను దాటివచ్చి ప్రజా ఉద్యమాలు, పోరాటాల ద్వారా నూతన ప్రజాతంత్ర వ్యవస్థను, ఆపై సామ్యవాద వ్యవస్థను సాధించగలమనే స్పష్టమైన దార్శనికతను పెంపొందించుకున్న ఆచరణశీలిగా పేర్కొన్నారు. ఆశలకీ, ప్రలోభాలకీ లొంగిపోని, జారిపోని పోరాట యోధుడనీ, ఆయన వదిలిన కృషిని మునుముందుకు కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

**ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు** మాట్లాడుతూ విశ్వమోహన్ ఒక స్వచ్ఛమైన మానవుడిగా తన సుఖాలను, స్వార్థాన్ని త్యజించి పీడిత, శ్రామిక జనావళి శ్రేయస్సు కోసం పోరాడడంలోనే జీవితపరమార్థం ఇమడివుందన్న సత్యాన్ని ఎత్తిపట్టిన కార్యసాధకుడిగా విశ్లేషించారు. 1998లో అక్రమ కేసులలో నిర్బంధితుడిగా విశ్వమోహనరెడ్డి జైలులో వున్న కాలంలోనే జనసాహితి సంస్థగా ఆయన రచనలపై ప్రత్యేక సంచికను వెలువరించి, జైలులోనే ఆయనను కలసి, ఆ ప్రత్యేక సంచికను అందజేసిన విషయాలను జ్ఞాపకం చేసుకున్నారు. విశ్వమోహనరెడ్డి రచించిన నాలుగు నవలలు-'జైలు', 'దొంగలు', 'మానవహోమం', 'దాడి' సంకలనంగా వెలువడటానికి తోడ్పడ్డామన్నారు. 'రిగ్గింగ్' నవలను ప్రచురించామన్నారు. రచయితగా విశ్వమోహనరెడ్డిజీవితంనుండి నేటితరం రచయితలందరూ నేర్చుకొని, ఆచరించ వలసిన విషయాలనేకంవున్నాయని పేర్కొన్నారు. విశ్వమోహనరెడ్డిపై 'ప్రజాసాహితి' ప్రచురించిన ఒక కవితను చదివి వినిపించారు.

**'ప్రజాసాహితి' సంపాదకులు పి.ఎస్. నాగరాజు** మాట్లాడుతూ డిటెక్టివ్ నవలలతో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన విశ్వమోహనరెడ్డి సామాజిక సమస్యలు ఇతివృత్తాలుగా నవల, కథ, నాటిక, నాటకం, కవిత, పాట వంటి అన్ని సాహితీరూపాలనూ సృజించారనీ; ఫ్యాక్షనిస్టు హింసాకాండకు బలైన కుటుంబ సభ్యునిగా, హోటల్ కార్మికునిగా, హోటల్ యజమానిగా, రిక్షాకార్మికునిగా, పాలేరుగా, పత్రికాముద్రాపకునిగా, సంపాదకునిగా, పండ్లపొడి ఉత్పత్తిదారునిగా, పేపరు ఏజెంట్‌గా, విప్లవకారునిగా వివిధ పాత్ర పోషణలను కలిగిన అరుదైన, విశిష్టమైన సాహిత్యం, వ్యక్తితత్వం, జీవితం విశ్వమోహనరెడ్డి స్వంతమని సమీక్షించారు.

ఇంకా, ఈ సభలో **సిపిఐ (ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు; రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, కాంద్రగుంట ముసలయ్య, పాటిబండ్ల కోటేశ్వరరావు. నీలాద్రి రాంబాబు** మాట్లాడారు. ఈ వక్తలు తమ ప్రసంగాలలో కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి ప్రజలకోసం జీవించాడు, రచించాడు, ఉద్యమించాడు, ప్రాణాలర్పించాడనీ, పాలకులు ఆయనను బలితీసుకున్నా ఆయన ఆశయాలు, ఆచరణ, ఆయన నిర్మించిన ప్రజా ఉద్యమం సజీవంగా వున్నదనీ, ఆయన సర్వస్వంగా ప్రేమించిన పీడిత ప్రజల హృదయాలలో 'పెద్దన్న'గా ఆయన చిరస్మరణీయుడన్నారు. కా॥ విశ్వమోహనరెడ్డి ప్రజలకు చైతన్యం కల్గించేందుకు కృషిచేశారనీ, పీడిత వర్గాలను సంఘటితపరచి ఉద్యమాలు నిర్మించే క్రమం లోనే ప్రాణాలు అర్పించారనీ, ఆయన సాగించిన సాహితీ కృషిని సమాజ హితులు, ప్రగతికాముకులంతా ముందుకు కొనసాగించాలనీ, ఆయన సాగించిన ఉద్యమ ఆచరణలను పీడిత ప్రజా ఉద్యమం మరింత ముందుకు కొనిపోతున్నదని వివరించారు.

ఉపన్యాసాల అనంతరం బాలసంఘం కళాకారులు-జనంపాటలకు నృత్యాలు; ప్రజా కళాకారులు-డప్పుల నృత్యం ప్రదర్శించారు. మహిళా కళాకారుల బృందం 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథను ప్రదర్శించారు. సభా ప్రారంభానికి ముందుగా ప్రజాకళాకారులు ప్రదర్శించిన 'ఎర్రజెండా' రూపకం విశ్వమోహనరెడ్డి అమరత్వంపై ప్రజాకళాకారులు పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. పిడుగురాళ్ళ, లెనిన్‌నగర్, టి.యన్.నగర్, విశ్వమోహన్‌నగర్; కారంపూడి, రెంటచింతల ప్రాంతాల నుండి 500 మందికి పైగా శ్రామిక ప్రజలు, రైతుకూలీలు ఈ సభకు హాజరయ్యారు. ◈

# ఆందోళనా మార్గంలో తాగు నీటి సమస్యను పరిష్కరించుకున్న శ్రామిక నగర్ మహిళలు

అధికారులను నిలదీస్తున్న మహిళలు


**మంగళగిరి, 13-5-11 :**

**మంగళగిరి** పట్టణంలోని శ్రామికనగర్, సుందరయ్యనగర్, భగత్‌సింగ్ నగర్, సూర్యనారాయణ నగర్ వాసులు ఏప్రిల్ 20వ తేదీ నుండి తీవ్ర మంచినీటి ఎద్దడితో సతమతమవుతున్నారు. అరకొర నీటి సరఫరాతో ప్రతిదినం మహిళలు పనులు మానుకొని ట్యాంకర్లకోసం పడిగాపులు కాయవలసి వస్తున్నది. ఎండలో బారులుతీరి నిలబడి, వస్తాయోరావో తెలీని బిందెడు నీళ్ళకోసం తగవులు, ఘర్షణలు..కాలనీ అంతా అలజడి వాతావరణం నెలకొన్నది.

ఈ పరిస్థితులలో డబ్బులు పెట్టి నీళ్ళు కొనుక్కోవలసిన దుస్థితి ఏర్పడింది. నేతకార్మికులు, ఇతర వృత్తులు చేసుకొనే శ్రమజీవులు నివసిస్తున్న ఈ కాలనీ పట్ల మున్సిపల్ అధికారులు ఘోర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సమస్యలను భరించలేని మహిళలు 12-5-2011న కాలనీ పర్యటనకు వచ్చిన గుంటూరు ఆర్.డి.ఓ.కు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. మహిళలకు తగిన సమాధానం చెప్పకుండా ఆర్.డి.ఓ. వెళ్ళిపోతుండటంతో మహిళలంతా కలసి వాహనానికి అడ్డు నిలిచి తమకు సమాధానం చెప్పాలంటూ నిలవేశారు. దీనితో ఆగ్రహించిన ఆర్.డి.ఓ. తన స్థాయి మరచి మహిళలపై విరుచుకుపడ్డాడు. మహిళలు దీనిని ప్రతిఘటించటంతో జవాన్లతో వారిని ప్రక్కకు నెట్టివేయించి నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు.

ఆర్.డి.ఓ. బాధ్యతారహిత దురుసు ప్రవర్తనను ఖండిస్తూ-శ్రామికనగర్ తాగు నీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్త్రీ విముక్తిసంఘటన నాయకత్వంలో మహిళలంతా కలసి మర్నాడు మున్సిపల్ కమీషనర్ ఎదుట బైఠాయించారు.

కమీషనర్ మరియు ఇతర మున్సిపల్ అధికారులతో చర్చించి తమ సమస్యలపట్ల ఇంతటి నిర్లక్ష్యం తగదని గట్టిగా హెచ్చరించారు. కమీషనర్ మాట్లాడుతూ తాగు నీటి సమస్య వున్నమాట వాస్తవమేనని, సమస్యపరిష్కారానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, తప్పనిసరిగా నీటి సరఫరా సక్రమంగా సాగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీయిచ్చారు. మహిళలంతా ఐక్యంగా నిలబడి చేసిన ఆందోళన ఫలితంగా ప్రస్తుతానికి తాగునీటి సమస్య పరిష్కారం సాధ్యమైంది. ఈ కార్యక్రమంలో స్త్రీవిముక్తిసంఘటన నాయకులు కె. అజిత; టి. జెన్ని, మహిళా ప్రతినిధులు శ్రీలక్ష్మి, కోమలి, విజయ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ◈

# బడా సామ్రాజ్యవాద పరిశ్రమల పరిరక్షణ కొరకే ఎండోసల్ఫాన్ నిషేధానికి భారత దళారీ పాలకుల నిరాకరణ

**దేశ** వ్యాపితంగా మరోమారు 'ఎండోసల్ఫాన్' పై చర్చ సాగుతున్నది. క్రిమిసంహారకమైన 'ఎండోసల్ఫాన్'ను పంటపొలాలు, పండ్లతోటలపై వాడిన ఫలితంగా పరిసరాల్లోని గాలీ, నీరూ, పర్యావరణాలపైనా, మానవుల ఆరోగ్యంపైనా అది కలిగించే దుష్ఫలితాలు క్రమక్రమంగా దేశమంతటా వెల్లడౌతున్నాయి. ఈ ప్రమాదకరమైన పురుగుమందు ఎండోసల్ఫాన్‌ను ప్రప్రథమంగా 1954లో జర్మనీలో ఉత్పత్తి చేసి వాడకంలోకి తెచ్చారు. మన దేశంలో 1980 నుండీ దీనిని చీడపీడల నివారిణిగా ఉపయోగిస్తూ వస్తున్నారు.

## ఎండోసల్ఫాన్ దుష్ఫలితాలు-కేరళ, కర్ణాటకలలో నిషేధం

కేరళ రాష్ట్రం-కాసరగోడ్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ 'ప్లాంటేషన్ కార్పొరేషన్ ఆఫ్ కేరళ' ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సాగుచేస్తున్న జీడితోటలపై హెలీకాప్టర్ల సాయంతో ఆకాశ మార్గం ద్వారా ఎండోసల్ఫాన్‌ను పెద్దస్థాయిలో వినియోగిస్తూ వచ్చారు తత్ఫలితంగా పరిసర ప్రాంతాలతో పాటు వాగులు, వంకలు, తాగునీరు కూడా కాలుష్య పూరితమయ్యాయి. తదనంతర కాలంలో ఆ ప్రాంత వాసులపై ఈ క్రిమి సంహారకం కల్గించిన ప్రమాదకర పరిణామాలూ స్పష్టంగా ముందుకొచ్చాయి. ఎండోసల్ఫాన్ బాధితులు వేలాది మంది మృత్యువాత పడగా, అనేకులు జీవచ్ఛవాలుగా మిగిలిపోయారు. నాడీ మండల వ్యవస్థపై అది తీవ్రమైన ప్రభావాన్ని కలుగజేసింది. అనేకమంది నపుంసకులుగా, మూర్ఛ రోగులుగా మిగిలిపోయారు. గర్భవతులపై ఈ విషప్రభావం కారణంగా పుట్టిన బిడ్డలు అనేకరకాల అవలక్షణాలతో, అంగవికలురుగా జన్మించారు. తాము కళ్ళారా కాంచిన ఈ విధమైన భయానక దృశ్యాలతో మొదటగా ఆ ప్రాంత ప్రజానీకం మేల్కొని ప్రమాదకర ఎండోసల్ఫాన్‌ను నిషేధించాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చి, దీర్ఘకాలం పాటు దానిపై ఆందోళన కొనసాగించారు.

ఈ ఉద్యమ ఫలితంగా కేరళ రాష్ట్ర పరిధిలో ఎండోసల్ఫాన్‌ను నిషేధిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో పాటు, ఎండో సల్ఫాన్ బాధితులకు నష్టపరిహారాన్ని చెల్లించింది. అయితే, దేశవ్యాపితంగా పెద్దఎత్తున వినియోగిస్తున్న ఎండోసల్ఫాన్‌పై ఒక రాష్ట్ర పరిధిలోనే నిషేధం విధించి, మిగిలిన రాష్ట్రాలలో వినియోగిస్తూ వుండటం పట్ల కేంద్రప్రభుత్వం మౌనం వహించటంపై ఆనాటి నుండే చర్చ సాగుతూవుంది.

కర్ణాటక రాష్ట్రంలోని 96 గ్రామాల పరిధిలో పంటపొలాలపై ఎండోసల్ఫాన్ వినియోగంతో కేరళ తరహాలోనే దుష్పరిణామాలు చోటుచేసుకోవటంతో ఇటీవల కాలంలో ఆ ప్రాంతంలోనూ ఎండోసల్ఫాన్ వ్యతిరేక ఉద్యమం ఊపందుకుంది. దీనితో ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా కర్ణాటక పరిధిలో ఎండోసల్ఫాన్ వినియోగంపై నిషేధం విధించింది.

ఈ నేపథ్యంలో ప్రమాదకరమైన ఎండోసల్ఫాన్ ఉత్పత్తి, వినియోగాన్ని దేశవ్యాపితంగా నిషేధించాలనే డిమాండ్ బలంగా ముందుకొచ్చింది. గత నెల రోజులుగా వివిధ వామపక్షాల ఆధ్వర్యంలోనూ, స్వచ్ఛంద, ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ ఎండోసల్ఫాన్ రద్దుకై విస్తృత ప్రజా ఆందోళనలు; న్యాయ పోరాటం సాగుతున్నాయి.

## దేశవ్యాపిత నిషేధానికి కేంద్రం నిరాకరణ-వితండవాదనలు

కేరళలోని లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం, కర్ణాటకలోని బిజెపి ప్రభుత్వం మినహా ఎండోసల్ఫాన్‌ను వినియోగిస్తున్న దేశంలోని ఇతర రాష్ట్రప్రభుత్వాలేవీ ఎండోసల్ఫాన్ వినియోగాన్ని నిషేధించమని కోరటం లేదనీ, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని తాము కనుగొనవలసివుందనే పేరిట కేంద్ర ప్రభుత్వం కాలం వెళ్ళబుచ్చుతూ వస్తున్నది.

కేరళ రాష్ట్రంలోని కాసరగోడ్ జీడితోటలపై ఆకాశమార్గంలో ఎండోసల్ఫాన్‌ను వెదజల్లటం ద్వారా అది పరిసరాలపై, ప్రజలపై తీవ్ర దుష్ప్రభావం కలుగజేసింది మినహా ఇతర పద్ధతుల్లో వినియోగించిన చోట ఈ విధమైన దుష్పరిణామాలు సంభవించినట్లుగా దాఖలాలేవీ లేవని కేంద్రప్రభుత్వం మొండిగా వాదిస్తున్నది. కాగా, పురుగుమందుల పరిశ్రమ యాజమాన్యం మరో అడుగు ముందుకు వేసి, కాసరగోడ్ ప్రాంత ప్రజలలో వ్యక్తమైన శారీరక అవలక్షణాలన్నీ వారసత్వంగా సంక్రమించే జన్యుపర లోపాలకారణంగా సంభవించినవేనంటూ దారుణమైన వాదనలు సాగిస్తున్నది. కేంద్ర వ్యవసాయశాఖ, పర్యావరణ శాఖల మంత్రుల, ఉన్నతాధికారుల, శాస్త్రవేత్తల బృందాలు వివిధ విడతలుగా సాగించిన అధ్యయనాలలోనూ ఎండోసల్ఫాన్‌ను నిషేధించాల్సిన అవసరమేమీ తమకు గోచరించలేదని కేంద్ర ప్రభుత్వం పనుపున నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు.

ఢిల్లీ కేంద్రంగా వున్న 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్', అహమ్మదాబాద్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్' సంస్థలు మాత్రం ఎండోసల్ఫాన్‌ను నిషేధించాలని సూచించాయి. కాగా, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నియమించిన దుబేకమిటి (2004), మాయికమిటి (2005) కాసరగోడ్ పరిణామాలను లోతుగా అధ్యయనం చేశామంటూనే ఆ ప్రాంత ప్రజల అనారోగ్యాలకీ- ఎండోసల్ఫాన్ వినియోగానికీ ఏవిధమైన సంబంధంలేదని తేల్చి పారేశాయి!

## ప్రభుత్వ, పాలకవర్గ మేధావుల అపసవ్యవాదనలు-వాస్తవాలు

ఎండోసల్ఫాన్‌కు ప్రత్యామ్నాయం ఏమిటని, దానిని నిషేధించమన్న వారిని, ప్రజలను-ప్రభుత్వం ఎదురు ప్రశ్నిస్తున్నది. ఎండోసల్ఫాన్ నిషేధంతో మరింత విషతుల్యమైన క్రిమిసంహారకాలు రంగప్రవేశం చేస్తాయి కనుక ఎండోసల్ఫాన్ నిషేదం జోలికి వెళ్లొద్దని అన్నారు కొందరు మేధావులు! మరికొందరు మేధావులు ఇంకొకడుగు ముందుకువేసి ఎండోసల్ఫాన్‌ను మించిన లాభసాటైన నూతన తరహా క్రిమిసంహారకాలను ప్రవేశపెట్టేందుకే బహుళజాతి కార్పొరేట్ అగ్రి బిజినెస్ సంస్థలు ఎండోసల్ఫాన్ వ్యతిరేక ఉద్యమాలను లేవదీస్తున్నాయని కూడా వ్యాఖ్యానిస్తున్నారు! ఎండోసల్ఫాన్ రద్దుకై ఆందోళన సాగిస్తున్న వామపక్షాలు కూడా ఈ నూతన బహుళజాతి పరిశ్రమల ప్రయోజనాలు కాపాడేందుకేనని తెలివిమీరి ప్రకటించు తున్నారుకూడా!

ఎండోసల్ఫాన్ నిషేధం వలన బహుళజాతి పరిశ్రమల యొక్క నూతన తరహా పురుగుమందులను ఇప్పటికంటే అధికధరలకు కొనుగోలు చేయవలసి వస్తుందనీ, దీనివలన వ్యవసాయ పెట్టుబడులు మరింత అధికమై, ఆహార ధాన్యాల ధరలు పెరిగి పేదలు బాధపడ్తారని 'పెస్టిసైడ్ మాన్యుఫ్యాక్చరర్స్ అండ్ ఫార్ములేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ప్రస్తుతం దీని పేరు క్రాప్‌కేర్ అసోసియేషన్) ఆవేదనను వ్యక్తంచేస్తున్నది.

వాస్తవానికి భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలకు పురుగుమందుల తయారీకి తగిన సాంకేతిక పరిజ్ఞానం, మానవశక్తి వుంది. పేటెంట్ గడువు తీరిపోయిన పురుగుమందులను ఇవి తయారు చేసి అమ్ముకో గలుగుతాయి. అయితే వీటిని పోటీలోకి రాకుండా చేయటానికి బహుళజాతి సంస్థలే ఈ దేశాలలో తామే పరిశ్రమలను పెట్టటం మొదలు పెట్టాయి. అపఖ్యాతి పాలైన పురుగుమందు మోనోక్రోటోఫాస్ ఉత్పత్తిని యూరపులో ఆపివేస్తున్నామని 1990లలోనే స్విట్జర్లాండుకు చెందిన నోవార్టిస్ కంపెనీ ప్రకటించింది. 1996 నాటికి చడీ చప్పుడు లేకుండా ఏడాదికి ఐదువేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంగల మోనోక్రోటోఫాస్ తయారీ పరిశ్రమను అది చైనాలో తెరిచింది. మరో ఏడాది గడిచేసరికి చైనాలో 6వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకల పరిశ్రమను 'జెనికా' సంస్థ ప్రారంభించింది. మూడో ఏడాదికి ఇవి రెండూ కలిసిపోయి 'సింజెంటా' సంస్థ అవతారమెత్తాయి. 2000 సంవత్సరానికి పేటేంట్ గడువు ముగిసిన పురుగుమందుల ఉత్పత్తి, బహుళజాతి పరిశ్రమల ఉత్పత్తిలో 53 శాతముంది. 2005 నాటికి ఇది 69 శాతానికి పెరిగింది. దీని అమ్మకాలవిలువ 2700 కోట్ల డాలర్లు.

పేటెంట్ గడువు తీరిన పురుగుమందులను వెనుకబడిన దేశాలు తామే స్వంతంగా తయారు చేయటం మొదలెట్టాయి. పైరిత్రాయిడ్ పురుగు మందుల తయారీని మిట్సు ఇండస్ట్రీస్ ఇండియా 1992లో మొదలు పెట్టింది. నాలుగేళ్ళలో అది మొదటిస్థానంలోకి వచ్చింది. కాగా, పైరిత్రాయిడ్ ఉత్పత్తిని ప్రారంభించి మొదటిస్థానంలో

---

**పంజాబ్**

## క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్ని పెంపొందిస్తున్న విషరసాయన పురుగుమందుల వాడకం

**సంకరజాతి** విత్తనాల వినియోగం ద్వారా, కృత్రిమ ఎరువుల-రసాయన పురుగుమందుల వాడకం ద్వారా, ఆధునిక యంత్రాల సాగు పద్ధతుల ద్వారా ఆహార ఉత్పత్తులను పెంచి; దేశ ప్రజల ఆకలిని రూపుమాపటం లక్ష్యంగా ప్రకటిస్తూ 1967లో మన దేశ పాలకులు 'గ్రీన్‌రివల్యూషన్' (హరితవిప్లవం) అమలును ప్రారంభించి కొనసాగించారు.

భూసారాన్ని రక్షించుకునేందుకు సాంప్రదాయకంగా మన దేశ రైతాంగం అనుసరిస్తూ వచ్చిన పంటల మార్పిడి పద్ధతి, మిశ్రమ పంటల విధానం, మేలైన విత్తనాల సేకరణ దీనితో కనుమరుగయ్యాయి. సంకరజాతి విత్తనాలు ప్రవేశించాయి. పచ్చిరొట్ట, పశువులపేడ వంటి సేంద్రియ ఎరువుల వాడకం; వేపనూనె, పొగాకురసం వంటి వాటిని పంటలను ఆశించే చీడపీడలపై ప్రయోగించటంవంటి సాంప్రదాయక పద్ధతులన్నీ గతించిపోయాయి. హరిత విప్లవం పెద్దఎత్తున పురుగుమందుల వాడకాన్ని పెంచింది.

సామ్రాజ్యవాదుల వ్యూహం ప్రకారం రూపొందించబడి, మన దేశ పాలకులచే అమలు చేయబడిన ఈ హరితవిప్లవం పేరున విచక్షణారహితంగా ఉపయోగించిన రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు పర్యావరణంపై, మానవ జీవితంపై తీవ్రమైన దుష్ఫలితాల్ని కలుగజేశాయి, కలుగజేస్తున్నాయి. నీరు, గాలి, వాతావరణం, ఆహారంతో సహా జీవులన్నీ కాలుష్యానికి గురయ్యాయి, అవుతున్నాయి. పశువులు పెద్దఎత్తున ఈ కాలుష్యానికి బలికాగా, మనుష్యులు ఈ కాలుష్యం ఫలితంగా తక్షణ, దీర్ఘకాల వ్యాధులకు గురౌతూ మరణిస్తున్నారు.

పైరుపచ్చ విప్లవానికి ప్రయోగశాలగావుండి, పాలక మేధావులచే పెద్దఎత్తున ప్రస్తుతించబడిన పంజాబ్ రాష్ట్రంలో విషరసాయనాల వాడకం ఫలితంగా రైతాంగం ప్రజలు పెద్దఎత్తున ప్రమాదకర జబ్బులపాలౌతున్న వాస్తవాలు క్రమంగా వెలుగు జూస్తున్నాయి.

పంజాబ్‌లోని అబోహర్ నుండి రాజస్థాన్‌లోని జోథ్‌పూర్ వెళ్ళే ప్యాసింజర్ రైలు ప్రతిరోజూ అనేకమంది క్యాన్సర్ వ్యాధి గ్రస్తులను మోసుకొస్తూవుండడటంతో దానిపేరు 'క్యాన్సర్‌రైలు'గా మారిపోయింది. పరిసర ప్రాంతాలనుండి అత్యధిక క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు 'ప్రిన్స్ బిజయ్ మెమోరియల్ హాస్పిటల్'కు 'కీమోథెరఫీ' (క్యాన్సర్ వైద్యం) కోసం ఈ రైలులో వెళ్ళివస్తుంటారు.

పంజాబ్ గ్రామీణ ప్రాంతాలలో మూడు లేక నాలుగు వేల జనాభావుండే ప్రతీ గ్రామం నుండీ నలుగురు లేదా ఐదుగురు క్యాన్సర్ వ్యాధి సోకినవారున్నారు, 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి', గ్రామీణ జనాభా మొత్తంలో క్యాన్సర్ వ్యాధి సోకిన వారిని గుర్తించే ప్రక్రియను ప్రారంభించింది. ఈ అధ్యయనం పూర్తయితే మరింత ఆందోళనకు గురిచేసే అంశాలు వెలుగులోకి వస్తాయి.

విషయం స్పష్టమే. పైరుపచ్చ విప్లవం పేరున ఖ్యాతి గాంచిన పంజాబ్ రాష్ట్రమే అత్యధిక విషరసాయనాల వినియోగంతో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల నిలయంగా మారుతున్నది. దేశంలోని ఇతర రాష్ట్రాలన్నింటి కంటే పంజాబ్ అత్యధికంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలను వినియోగిస్తున్నది.

2005లో తొలిసారిగా 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' సంస్థ పంజాబ్ గ్రామీణ ప్రాంత ప్రజల రక్తనమూనాలను సేకరించి పరీక్షలు జరిపి పురుగుమందుల విషరసాయనాల అవశేషాలున్నట్లుగా కనుగొన్నది. వెనువెంటనే దీనిని ఖండించేందుకు పంజాబ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నాలుగు రోజులలో 450 మంది రక్త నమూనాలను సేకరించి రసాయనాల ఆనవాళ్ళేలేవని తెగేసి చెప్పింది!

2007లో 'భాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్' తమ పరిశీలనలో ఫరీద్‌కోట్‌లోని నీటి నమూనాలలో యురేనియం అవశేషాలున్నాయని కనుగొంది.

ఛండీఘడ్‌కు చెందిన 'పోస్టుగ్ర్యాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్స్' సంస్థ తమ పరిశోధనలో పంజాబ్ గ్రామీణ ప్రాంతంలోని ప్రతిలక్షమందికి గానూ 125 మందికి క్యాన్సర్ లక్షణాలున్నట్లుగా బయటపెట్టింది. అలాగే అధిక పురుగుమందుల వాడకంతో నీటిలో నైట్రేట్ అవశేషాలు అధికంగా వున్నాయని పేర్కొంది.

ప్రకాష్‌సింగ్ బాదల్ నాయకత్వంలోని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ పరిశోధనలు, పరిశీలనలన్నింటినీ కొట్టిపారేసింది. వాస్తవాలకు సంబంధించి తనకు అందే సమాచారాన్నంతా ప్రభుత్వం తొక్కిపెట్టదలుచుకున్నది. వీటన్నింటినీ మించి పైరుపచ్చ విప్లవానికీ-ఈ కాలుష్యానికీ-ప్రజల క్యాన్సర్‌వ్యాధి తీవ్రతకూ మధ్యనున్న సంబంధాన్ని నిరాకరించదలుచుకున్నది. పైగా, 'అమెరికాలో రైతులు ఈ పురుగుమందులను వాడకున్నప్పటికీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అక్కడా వున్నారుకదా!' అంటూ తలాతోకా లేని వాదనలతో స్వయానా పంజాబ్ ముఖ్యమంత్రే విషరసాయనాల వాడకాన్ని సమర్థించబూనుకున్నాడు. రసాయన పురుగుమందుల నిషేధాన్నీ, సేంద్రియ ఎరువుల వాడకాన్నీ ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాడు. పంజాబ్‌లో రైతుల కమతాలు చిన్నవి కనుక పురుగుమందులను వాడకుండా వుండటమంటే రైతుల ఆదాయాలను చీడపీడలకు బలిచేయటమేనని వ్యాఖ్యానిస్తున్నాడు. ఇంకా 'మేము ఆసుపత్రులను నిర్మిస్తున్నాం. క్యాన్సర్ రోగులకోసం 20 కోట్ల రూ॥ కేటాయించి ఆదుకుంటున్నామని' ఆయన గొప్పగా ప్రకటిస్తున్నాడు.

ముఖ్యమంత్రి స్వగ్రామమైన 'బాదల్'తో సహా చుట్టుప్రక్కల అన్ని జిల్లాల నుండి భటిండా దగ్గరలోని ఫరీద్‌కోట్ గురుగోవిందసింగ్ మెడికల్ కాలేజీలోని పురాతనమైన క్యాన్సర్ విభాగానికి క్యాన్సర్ రోగగ్రస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. రోజుకు 60 మందికి పైగా హాజరయ్యే క్యాన్సర్ రోగులలో 20 మంది కొత్తవారుంటున్నారు.

క్యాన్సర్ జబ్బు సోకినవారు తీవ్రమైన శారీరక ఇబ్బందులతోపాటుగా ఆర్థిక సమస్యలనూ ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో క్యాన్సర్ రోగులకు వారానికొకసారి చొప్పున 30 వారాలు 'కీమోథెరఫీ' ఉచితంగా చేస్తారు. అయినప్పటికీ, ప్రతి వారమూ వారి స్వగ్రామం నుండి మరొకరిని తోడు చేసుకొని వైద్యం కోసం వచ్చి పోయేందుకు అయ్యే ఖర్చులేకాక ఒక్కొక్కటి 7,200 రూ॥ ఖరీదు చేసే ఇంజక్షన్లను వాడటమంటే వారి తలకు మించిన భారమౌతున్నది.

ఎవరికి వారు విడివిడిగా పురుగుమందుల వాడకాన్ని ఆపివేయటం వీలుగాని విధంగా పంజాబ్ రైతాంగం విషవలయంలో చిక్కుకుని వున్నారు. విషరసాయనాల కారణంగా క్యాన్సర్ సోకి కుటుంబసభ్యులు మరణించినాకూడా, తిరిగి అవే విషరసాయనాలనుపయోగించి సేద్యం చేయక తప్పని పరిస్థితుల్లోకి పంజాబ్ రైతాంగం నెట్టబడ్డారు.

వీటికి తోడు పంట ఉత్పత్తికి పెట్టవలసిన పెట్టుబడి అధిక భారమై, సంస్థాగతరుణ పరపతి శూన్యమై, తీరా పండించిన పంటకు గిట్టుబాటు ధరరాక, రుణభారం పెరిగిపోయి స్వీయహత్యలకు పాల్పడుతున్న వారి సంఖ్య కూడా పంజాబ్‌లో అధికంగావుంది.

దేశ విస్తీర్ణంలో 1.5 శాతం భూభాగాన్ని; దేశ సాగుభూముల విస్తీర్ణంలో 2.5 శాతంగా భూభాగాన్ని మాత్రమే కలిగివున్న పంజాబ్ రాష్ట్రం-దేశం మొత్తం మీద వినియోగమయ్యే పురుగుమందులలో 18 శాతాన్ని వినియోగిస్తున్నదంటే వీటిద్వారా సంక్రమించే కాలుష్య తీవ్రత అర్థమౌతుంది. రసాయన ఎరువుల వాడకంలోనూ దేశీయ సగటు హెక్టారుకు 150 కిలోలు కాగా, పంజాబ్‌లో సాగయ్యే ప్రతి హెక్టారుకూ 400 కిలోల రసాయన ఎరువులు వాడుతున్నట్లుగా 'ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' నివేదిక పేర్కొంది. గతకొద్ది సంవత్సరాలుగా పురుగుమందుల గాఢతను పెంచివేస్తూ, దాని పేరిట పురుగుమందుల ధరలనూ, తీవ్రంగా పెంచివేస్తూ రైతాంగాన్ని ఆర్థికంగా దోపిడీకి గురిచేయటంతోపాటుగా, ఎంతోమందిని ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధికి గురిచేస్తున్నారు. దీర్ఘకాలంగా విషరసాయన క్రిమిసంహారాల వాడకంతో పచ్చపచ్చని పంజాబ్ పంటపొలాలు క్యాన్సర్ వ్యాధి గ్రస్తులతో మరుభూములుగా మారుతున్నాయి. ◆

వున్న అవంతిస్ కంపెనీ, మిట్సు ఇండస్ట్రీస్‌లో 51 శాతం వాటాలను 1999లో కొనివేసి స్వంతం చేసుకుంది. తనకు పోటీలేకుండా చేసుకుంది. ఈ విధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పురుగుమందుల పరిశ్రమలలో అధికభాగం పరోక్షంగానో, ప్రత్యక్షంగానో బహుళజాతి సంస్థల ఆధ్వర్యంలోనే వున్నాయి.

ఎండోసల్ఫాన్‌ను భారతదేశంలో తయారుచేస్తున్న కంపెనీలలో ఎక్సెల్ క్రాప్ కార్పొరేషన్, కోరమాండల్ ఫర్టిలైజర్స్ ముఖ్యమైనవి. ఇవి రెండూ ప్రైవేటు రంగంలోవుండి విదేశీ పెట్టుబడి 20 శాతం వరకూ వున్నవే! విదేశీ కంపెనీలతో సాంకేతిక మిలాఖత్ లున్నాయి. మూడవది హిందూస్తాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ ప్రభుత్వరంగ సంస్థ. కనుక ఎండోసల్ఫాన్‌పై నిషేధం విదేశీ కంపెనీలకూ, దీనితో మిలాఖత్ అయిన భారత బడా బూర్జువాలకే నష్టమన్నది స్పష్టమే.

1990ల వరకూ పురుగుమందుల కంపెనీలు చిన్నవాటిని కొనివేస్తూ గుత్తాధిపత్యాన్ని నెలకొల్పు కున్నాయి. 1996లో సీబా-గెయిగీ సాండజ్ కలిసిపోగా, దాని ఉత్పత్తి, సమీప పోటీదారుకంటే నాలుగురెట్లు ఎక్కువగా వుండేది. ఇది నోవార్టిస్‌ను కొన్నది. 1998లో దీనిని అవెంతిస్ కలిపివేసుకుంది. ఆ తర్వాత సింజెంటాగా తయారైంది. దీని పురుగుమందుల అమ్మకాలు 800 కోట్ల డాలర్లు. ఆ రకంగా సింజెంటా, అవంతిస్, మాన్‌సాంటో, బిఎఎస్‌ఎఫ్, డ్యూపాంట్-ఈ ఐదు కంపెనీలు 2300 కోట్ల డాలర్ల అమ్మకాలతో 70 శాతం మార్కెట్ కైవశం చేసుకున్నాయి.

2000 ఏడాది వచ్చేసరికి బయోటెక్నాలజీ పెద్ద గంతు వేసింది. ఒక పురుగుమందును మార్కెట్టులోకి తేవటానికి అవసరమైన అన్ని అనుమతులు పొందేందుకు 4 నుండి 10 కోట్ల డాలర్లు ఖర్చవుతుంది. అదే ఒక కొత్త విత్తనాన్ని మార్కెట్లో ప్రవేశపెట్టడానికి 10 లక్షల డాలర్లు ఖర్చవుతుంది. దీనితో పురుగుమందుల కంపెనీలు పరిశోధనకు నిధులు మానివేశాయి. విత్తన కంపెనీలను, ఎరువుల కంపెనీలను కొనటం మొదలు పెట్టి తమను తాము జీవశాస్త్ర కంపెనీలుగా చెప్పుకుంటున్నాయి. కొత్త పురుగుమందుల తయారీ కృషి మానివేసి పాతమందుల ఉత్పత్తినే సాగిస్తున్నాయి. దీనితోపాటే డబ్ల్యూటిఓ ఒప్పందం వచ్చి, ప్రాసెస్‌పేటెంటు స్థానంలో ప్రొడక్టు పేటెంటు రావటంతో వాటికి పోటీ భయం పోయింది. ఈ పరిణామాలతో మొత్తం వ్యవసాయరంగమంతా, పంటల సాగు అంతా కొన్ని బహుళజాతి పరిశ్రమలు నిర్దేశించే స్థాయికి చేరింది. కనుక ఎండోసల్ఫాన్ అమ్మకాలు సాగినంత కాలమూ పరోక్షంగా, ప్రత్యక్షంగా లాభాలు మూటగట్టుకునేది బహుళజాతి సంస్థలేననేది తేటతెల్లమౌతున్నది.

## ప్రపంచవ్యాపితంగా ఎండోసల్ఫాన్ నిషేధానికి మనదేశమే ఆటంకం

మరోవైపున అంతర్జాతీయ వేదికలపైనుండి కూడా మనదేశం ఎండోసల్ఫాన్ నిషేధానికి పదపదే అడ్డుపడుతూ వస్తున్నది. ఎండోసల్ఫాన్‌పై నిషేధం విధించే తీర్మానాన్ని రూపొందించే స్టాక్‌హోమ్ సదస్సు సమీక్షా కమిటీలో భారత్, అర్జెంటీనా, బల్గేరియా, కంబోడియా, కెనడా, ఛాద్, చైనా, కోస్టారికా, ఛెక్ రిపబ్లిక్, ఈజిప్టు, ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, ఘనా, హోండూరస్, జపాన్, జోర్డాన్, కొరియా, మారిషస్, న్యూజిలాండ్, నైజీరియా, పోర్చుగల్, స్విట్జర్‌లాండ్, సిరియా, టాంజానియా, థాయ్‌లాండ్, టోగో, ఉక్రెయిన్, జాంబియాలతో కలిపి మొత్తం 31 దేశాల ప్రభుత్వ ప్రతినిధులూ, నిపుణులూ సభ్యులుగా వున్నారు. కాగా, వీరిలో నిషేధం వద్దని వాదించినది భారతదేశం ఒక్కటి మాత్రమే! అంతేకాదు, 2008, 2009, 2010 సం॥లలో వరుసగా మూడుసార్లు ఎండోసల్ఫాన్‌పై నిషేధపు తీర్మానం జరుగకుండా అడ్డుపడింది కూడా మనదేశమే!

ఇక ఈ సంవత్సరం ఏప్రిల్ 25 నుండి ఆరురోజులపాటు 'జీవ కాలుష్య రసాయనాలు' (పెర్సిస్టెంట్ ఆర్గానిక్ పొల్యూటెంట్-పిఓపి) సదస్సు జెనీవాలో జరిగింది. ఎండోసల్ఫాన్‌ను ప్రపంచ వ్యాపితంగా నిషేధించాలని 'జీవకాలుష్య రసాయనాల సమీక్షా కమిటి' ఈ సదస్సుకు మరోమారు సిఫారసు చేసింది. 2009 నాటికి ప్రపంచంలోని 60 దేశాలు ఎండోసల్ఫాన్‌ను నిషేధించాయని, ప్రస్తుతం ఆ సంఖ్య 81 దాటిందని 'కన్వెన్షన్స్ ఎక్స్‌పర్ట్ కమిటి' తెలియ జేసింది.

భారత రసాయన పరిశ్రమే ప్రపంచంలోకెల్లా ఎండోసల్ఫాన్ ఉత్పత్తిలో పెద్ద పరిశ్రమగా వుంది. శాస్త్రీయంగా ఎండోసల్ఫాన్‌లోని విషకారక ప్రభావాల్ని విశ్లేషించే పరిశోధనలను భారత రసాయన పరిశ్రమ దాటవేయదల్చుకున్నది. ఎండోసల్ఫాన్‌ను తాను నిషేధించకపోగా ప్రపంచవ్యాపితంగా దీనిపై నిషేధం విధించకుండా వుండేందుకు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలను అన్వేషిస్తున్నది. 'ఎండోసల్ఫాన్ మాన్యు ఫాక్చరర్స్ అండ్ ఫార్ములేటర్స్ అసోసియేషన్' వారు 'కన్వెన్షన్స్ వాచ్ డెస్క్' రూపంలో ఎండోసల్ఫాన్‌ను నిషేధించాలనే ప్రతిపాదనలను ప్రపంచవేదికలపై నుండికూడా ఎదుర్కొంటూవస్తున్నారు. వీరితోకూడి మన ప్రభుత్వ ప్రతినిధులు నిషేధం అంశంపై న్యాయపరంగా సవాళ్ళు చేయటం, శాస్త్రీయంగా చేసిన పరిశోధనలను సమీక్షించాలని కోరటం వంటి చర్యలకు పాల్పడ్డారు.

## రసాయన పరిశ్రమ యాజమాన్యం కక్షసాధింపు చర్యలు

ఎండోసల్ఫాన్ ప్రమాద తీవ్రతను తెలియపరిచిన శాస్త్రీయ పరిశోధనలను, ఆయా శాస్త్రవేత్తలను భారత రసాయన పరిశ్రమ యాజమాన్యం న్యాయపరంగా వేధింపులకు గురిచేయటం, బెదిరింపులకు గురిచేయటం, వ్యక్తిగతంగా దాడులు చేయించటం వంటి నీచమైన చర్యలకు పూనుకుంటున్నది. 'క్రాప్‌కేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' 2000 సం॥లో 'వరంగల్‌లో హంతక పంటపొలాలు' శీర్షికన పత్రికలలో వెలువడిన ఒక నిజనిర్ధారణ కమిటీ నివేదికపై తీవ్రంగా స్పందించింది. నిజనిర్ధారణలో పాల్గొన్న సభ్యులపై న్యాయపరమైన చర్యలకు పూనుకుంది. పంటలపై వెదజల్లిన రసాయన పురుగుమందుల విషప్రభావంతో కొందరు రైతులు మరణించిన వాస్తవాన్ని వెలుగులోకి తీసుకురావటమే వారు చేసిన నేరం! మృతుల పోస్టుమార్టమ్ నివేదికకూడా వారి వాదనలను బలపర్చటం రసాయన పరిశ్రమల యాజమాన్యాన్ని చీకాకు పరిచింది. నిజనిర్ధారణ కమిటీ సభ్యులపై పదికోట్ల మేరకు పరువునష్టంతో పాటు క్రిమినల్ చర్యలకు పూనుకున్నారు. 2010 వరకూ, సుప్రీంకోర్టు వరకూ కేసును సాగలాగి, నిజనిర్ధారణలో పాల్గొన్న మేధావులను, ప్రజాతంత్ర వాదులను వేధింపులకు గురిచేశారు. 2010లో సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టివేసింది. రసాయన పరిశ్రమల యాజమాన్య కక్ష సాధింపుచర్యలకు ఇదొక ఉదాహరణ మాత్రమే!

ఏమైనా అన్ని వైపులనుండీ పెరుగుతున్న వత్తిడి ఫలితంగా మనదేశం రానున్న 11 సం॥ల కాల వ్యవధిలో అంచెలంచెలుగా ఎండోసల్ఫాన్‌ను నిషేధించేందుకు అంతర్జాతీయ వేదికపై అంగీకారాన్ని వ్యక్తం చేసింది. అంటే, భారత ప్రజానీకం, రైతాంగం మరో 11 సం॥ల కాలం ఎండోసల్ఫాన్ రసాయన విషకాలుష్యానికి బలవ్వాల్సిందేనన్నమాట!

## సామ్రాజ్యవాదులకనుగుణంగా మన దేశ వ్యవసాయ విషవలయం

ఎండోసల్ఫాన్ నిషేధంపై చర్చల సందర్భంగా-మన దేశరైతాంగం ఇంతటి ప్రమాదకరమైన, విషపూరితమైన రసాయన క్రిమిసంహారాల వాడకమనే విషవలయంలోకి ఎందుకు నెట్టబడ్డారనే మూల కారణాలలోకి వెళ్ళటం అత్యావశ్యకం. బ్రిటీష్‌పాలన కాలం నాటికే వలస పాలకుల ప్రయోజనాలకనుగుణంగా మనదేశ వ్యవసాయం మలచబడింది. అధికార మార్పిడి తదనంతర కాలంలోనూ పాలకులు విదేశీ సామ్రాజ్యవాదుల అవసరాల మేరకు వ్యవసాయ రంగంలోనూ మార్పులు చేస్తూవచ్చారు.

1960ల నాటికి భారత పాలకులు పైరుపచ్చ విప్లవం పేరున సంకరజాతి విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకానికి గేట్లు బార్లా తెరిచారు-ముఖ్యంగా-అమెరికన్ సామ్రాజ్యవాద వ్యవసాయ, వాణిజ్య గుత్త సంస్థలు తమ దేశాలలో కాలం చెల్లిన వ్యవసాయ పరికరాల అమ్మకానికి, ఎరువుల-పురుగుమందుల అమ్మకానికి మన దేశాన్ని ప్రధాన మార్కెట్ వనరుగా మలుచుకున్నాయి. ఎరువుల, పురుగుమందుల వినియోగం అధికంగా అవసరమయ్యే నూతన వంగడాలు, సంకరజాతి (హైబ్రీడ్) విత్తనాలు, అధిక దిగుబడి విత్తనాల పేరుతో రైతుల్లో ఆశలు రేకెత్తించి, వాటి వాడకాన్ని ఇతోధికంగా పెంచివేశారు. ఫలితంగా సామ్రాజ్యవాద, బహుళ జాతి సంస్థల ఎరువుల, పురుగుమందుల కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా లాభాలను మూటగట్టుకున్నాయి. 1950వ దశకంలో నెమ్మదిగా ప్రారంభమైన పురుగుమందుల దిగుమతి పైరుపచ్చ విప్లవంతో వేగం పుంజుకుంది. విషపూరితమైన గమాక్సిన్, డి.డి.టి., ఎండ్రిన్, మలాథియాన్, పెరాథియాన్, మోనోక్రోటోఫాస్,క్వినాల్‌ఫాస్ ఆ తర్వాత పైరిత్రాయిడ్స్ రకాలకు చెందిన శక్తివంతమైన పురుగుమందులను టన్నుల కొలదీ వుత్పత్తి చేసి వేలకోట్లరూపాయల వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు.

అందుకే ఈ పైరుపచ్చ విప్లవం గురించి ఆనాడే కా॥ తరిమెల నాగిరెడ్డి తన ప్రసిద్ధ గ్రంథం 'తాకట్టులో భారతదేశం'లో ఇలా పేర్కొన్నారు: 'ఈ వ్యూహం సామ్రాజ్యవాదుల సరుకులు అమ్ముకోవడానికి బ్రహ్మాండమైన మార్కెట్‌ను సమకూర్చిపెడుతుంది. పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలలో నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగం, ఉత్పత్తి మాంద్యాన్ని తట్టుకోవడానికి, ఆ విధంగా తమ ఆర్థిక సంక్షోభ భారాన్ని భారతదేశం నెత్తికెత్తడానికి ఇది ముఖ్యమైన అంశం'

మరోవైపున రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే అంశాన్నికూడా సామ్రాజ్యవాద మార్కెట్ శక్తులు తమ గుప్పెట్లో పెట్టుకోవటం ద్వారా రైతాంగాన్ని దివాళా తీయించాయి. ఎరువులు, పురుగు మందుల అధిక వాడకం అవసరమయ్యే వంగడాలను వినియోగించటంతో వ్యవసాయ పెట్టుబడులు అధికమవటం, సంస్థాగతరుణాలు లభ్యమవక పోవటం, ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడటం, మరోవైపున గిట్టుబాటు ధరలు కూడా లభించక పోవటంతో రైతాంగపు ఆత్మహత్యల పర్వం ప్రారంభమై ఇదొక విషవలయంగా సాగుతున్నది.

## అంకెల గారడీతో అభివృద్ధి మాయాజాలం

ఈ విషవలయంలోకి రైతులను నెట్టివేసిన పాలకులు భూస్వామ్య, సామ్రాజ్యవాదవర్గ ప్రయోజనాలే పరమావధిగా వినోదం చూస్తున్నారు. మొత్తంగా ఇవన్నీ దేశ వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల పరంచేసిన ఫలితంగా సంభవిస్తున్న దుష్పరిణామాలేననే విషయం వెలుగులోకి రాకుండా జాగ్రత్త వహిస్తూ ఎక్కడికక్కడ సమస్యను విడదీసి చూపుతూ అప్పటికప్పుడే పరిష్కారాలను చూపాలనే వైపుగా మేధావులను, ప్రజాతంత్ర వాదులను అదరగండంగా ఎదురు ప్రశ్నిస్తున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాల కనుగుణంగా ఆహార, వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలనే సాకుతో పాలకులు చేపట్టిన విధానాల అసలు స్వరూపం అనతి కాలంలోనే వెల్లడైంది. కాగా ఈ వాస్తవాలను మరుగుపరిచి, అంకెల గారడీ చేస్తూ, తామనుసరించిన వ్యవసాయ విధానాల ఫలితంగానే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల సాధ్యమైందని తమకు తామే జబ్బలు చరుచుకుంటున్నారు. పాలకవర్గవందిమాగధులైన మరికొందరు మేధావులుకూడా ఈ విధానాలను ఆకాశనికెత్తడంలో తమ శక్తియుక్తులన్నింటినీ ప్రదర్శిస్తున్నారు. అయితే, అంకెలలో ఉత్పత్తులు పెరిగినట్లు ప్రకటిస్తున్నారే కానీ, వ్యవసాయ పెట్టుబడులు ఎన్నిరెట్లు పెరిగినాయో చెప్పకుండా దాటవేస్తున్నారు. పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర ప్రకారం రైతుకు కనీసం గిట్టుబాటు కావటం లేదనీ, మధ్యదళారుల, భూస్వాముల, మార్కెట్ శక్తుల దోపిడీకి రైతులను ఎరగా వేస్తున్న విషయాన్ని పాలకులు, పాలకవర్గ మేధావులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు తక్కువగా ఉన్నపుడే రైతులు తమ జీవితం సాపేక్షంగా మెరుగుగా వుందని భావిస్తున్నారు. దిగుబడుల ద్వారా లభించే ఆదాయానికి మించిన పెట్టుబడులతో రైతులు తీవ్ర వత్తిడికి గురౌతూ, నిరంతర అశాంతితో జీవనాన్ని వెళ్ళదీస్తున్నారు. మరికొందరు తనువులు చాలిస్తున్నారు. అయినా, పాలకులు దీనినే 'అభివృద్ధి' అంటూ బూకరిస్తున్నారు.

## ఎండోసల్ఫాన్‌ను నిషేధించవలసిందే

ప్రజలపై, పర్యావరణంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్న 'ఎండోసల్ఫాన్'ను దేశవ్యాపితంగా నిషేధించవలసిందే! దీనిస్థానంలో మరింత ప్రమాదకర విషరసాయనాలు రంగప్రవేశం చేసేట్లయితే వాటి నరికట్టేందుకూ ఉద్యమించవలసిందే. ప్రస్తుతం ఎండోసల్ఫాన్ విషప్రభావానికి వ్యతిరేకంగా సాగించే ప్రచారం, అది ప్రజలలో కల్గించే చైతన్యం, భవిష్యత్‌లో మరింత ప్రమాదకరమైన క్రిమి సంహారాలు ప్రవేశిస్తే వాటికి వ్యతిరేకంగా కూడా మరింత పెద్దస్థాయిలో ఉద్యమానికి తోడ్పడి తీరుతుంది. అంతేతప్ప, ఎండోసల్ఫాన్‌ను నిషేదిస్తే మరింత ప్రమాదకర క్రిమిసంహారకాలు మార్కెట్‌ను ఆక్రమిస్తాయనే నెపంతో ఎండోసల్ఫాన్ వ్యతిరేక పోరాటాన్ని వ్యతిరేకించటం కుట్రపూరితమైనది. వాస్తవానికి సాంప్రదాయకంగా రైతులు అభివృద్ధి చేసుకుంటూ వచ్చిన వ్యవసాయ విధానాల మీద ఆధారపడి శాస్త్రీయ పరిశోధనలు సాగించి, మనదేశ వనరులు-ప్రజల అవసరాల కనుగుణమైన విధానాలను రూపొందించి అమలు చేసుకుంటే అది రైతులకు, మొత్తంగా ప్రజల ప్రయోజనాలకు తోడ్పడేదిగా వుంటుంది. ఎండోసల్ఫాన్‌పై నిషేదం పెడితే మరో పురుగుమందే వాడనవసరంలేదు, ప్రత్యామ్నాయ పద్ధతులున్నాయి.

కానీ, దాని స్థానంలో తమ లాభాపేక్షా ప్రయోజనాలే లక్ష్యంగా మనదేశ రైతులపై సామ్రాజ్యవాదులు రుద్దిన విధానాలను, వాటన్నింటికీ 'జీ హుజూర్' అంటూ గంగిరెద్దుల్లా తలాడించి, వాటి అమలుకు పూనుకున్న మన దేశ దళారీ పాలకుల దగాకోరు విధానాలను చర్చ చేయకుండా, ఈనాటి ఎండోసల్ఫాన్ సమస్యకు దగ్గరి పరిష్కారాలు వెదకటం అసాధ్యం!

మన నేలకు, మన నీటి వనరులకు, మన వాతావరణానికి తగిన విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను దేశీయంగా అభివృద్ధి చేసుకొనేందుకు రైతాంగం, కష్టజీవులు, దేశభక్తియుత, ప్రజాస్వామిక విప్లవ శక్తులందరూ ఏకతాటిపై కొచ్చి పోరాడటం ద్వారానే సాధ్యం కాగలుగుతుంది. ◈

(గత సంచికలో కొన్ని సాంకేతిక కారణాలవలన ఈ రిపోర్టు అస్పష్టంగా ముద్రితమైంది. అందువలన తిరిగి ముద్రిస్తున్నాం. -సంపాదకుడు)

# కామ్రేడ్ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతి సభ

**సిలిగురి 23-3-11 :**

కానూదా ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివాసీ రైతులు, వ్యవసాయ కూలీలు, టీ తోట కార్మికులు, యువకులు, విద్యార్థులు సిలిగురి పట్టణంలో సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతిసభకు ముందుగా పట్టణంలోని హిల్‌కార్ట్‌రోడ్ పొడవునా ఎర్రజెండాలతో, నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని 'డిమాండ్స్‌డే'గా పాటించమని పిలుపునిస్తూ రాష్ట్ర కమిటి కార్యదర్శి కా॥ సుబ్రతోబసు ప్రజలకు సంబంధించిన పది డిమాండ్స్‌ను, వాటిని సాధించుకొనేందుకు చేపట్టవలసిన ఆందోళన, ప్రచార కార్యక్రమాలను ప్రజల ముందుంచారు. వాటిలో ఆహార ధాన్యాల వ్యాపారంలో భవిష్య వాణిజ్యాన్ని నిషేదించాలని, ఆహార పదార్థాల మరియు ఇతర నిత్యావసరాల అధిక ధరలను తగ్గించాలని, సాధారణ ప్రజానీకంపై కొనసాగుతున్న రాజ్యహింసను ఆపివేయాలని, 'ఉపా' వంటి క్రూర చట్టాలను రద్దు చేయాలని, ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఆపివేయాలని, డా॥ బినాయక్ సేన్‌తో సహా రాజకీయ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలనేవి ఆ డిమాండ్స్‌లో ఉన్నాయి.

సమాజంలోని ప్రజలందరికీ అణచివేతల నుండి విముక్తి కలిగించే సామాజిక వ్యవస్థ సాధన కోసం అవిశ్రాంత పోరాటం సల్పిన స్ఫూర్తి ప్రదాతగా కా॥ కానూసన్యాల్ మన ముందున్నారని కా॥ సుబ్రతో ఈ సందర్భంగా పేర్కొన్నారు. సిపిఐ (ఎం-ఎల్) నిజాయితీగా మనదేశంలో సోషలిస్టు సామాజిక వ్యవస్థ నిర్మాణాన్ని నిజం చేయటం కోసం పోరాడుతున్నదనీ, భారత విప్లవోద్యమ గొంతుక అయిన కామ్రేడ్ కానూసన్యాల్‌కు ఇదే తగిన నివాళి అవుతుందన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకులు, కేంద్రకమిటి సభ్యులు కా॥ అసిత్‌సిన్హా మాట్లాడుతూ 'నగ్జల్బరీపై మరికొంత వివరణ' డాక్యుమెంట్‌ను వెలువరించిన అనంతరం కా॥ కానూసన్యాల్ తన రాజకీయ జీవితంలో 30 సంవత్సరాల కాలాన్ని కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతను సాధించటానికి వెచ్చించారనీ, దీనిని మరింత ముందుకు కొనసాగించాల్సిన అత్యావశ్యకతను నొక్కిచెప్పారు.

ఇంకా ఈ సభలో మాట్లాడిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కామ్రేడ్ స్వదేష్ బెనర్జీ, అసిమ్‌ఘోష్; కార్మిక నాయకులు ప్రదీప్ దేవనాధ్, రామ్‌గణేష్‌బారక్; రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ దీపు హాల్దర్, ఖుదా మల్లిక్‌లు కా॥ కానూదాకు నివాళులర్పిస్తూ మాట్లాడారు. ఈ వర్ధంతి సభకు డార్జిలింగ్ జిల్లా పార్టీ కార్యదర్శి కా॥ జోగేన్ విశ్వకర్మాకర్ అధ్యక్షత వహించారు. ◈



### వేతన బానిస... (చివరిపేజి నుండి)

ఎగుర వేయగా మేడే ప్రాముఖ్యత గురించి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు కె. పైడిరాజు వివరించారు. జి. శ్రీనివాసరావు ఆటో డ్రైవర్‌ల కష్టాలు గురించి పాటపాడి వినిపించగా ఆటోడ్రైవర్లు మిగతా కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేసారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌వద్దగల ఉస్మానియా టవర్స్ ఆటోస్టాండ్ వద్ద మేడే జెండాను ఆటోయూనియన్ ప్రధాన కార్యదర్శి, ఎపిఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥రెడ్డి నారాయణరావు ఆవిష్కరించి మేడే ప్రాధాన్యత వివరిస్తూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా ఆటో డ్రైవర్ల సంక్షేమంకోసం బోర్డు ఏర్పాటుకై ఉద్యమించ డానికి సిద్ధపడాలని కోరారు. మెసానిక్ టెంపుల్ (ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా) ఆటోస్టాండ్ వద్ద ఎపిఎఫ్‌టియు జెండాను యూనియన్ గౌరవ అధ్యక్షులు కె. పైడిరాజు ఆవిష్కరించగా బి. శంకర్రావు, ఆర్. నారాయణరావు, ఎన్. అప్పలరాజురెడ్డి, బి. పాపారావు, తదితరులు మేడే ప్రాధాన్యతతో పాటు కార్మికులకు పీడిత ప్రజలకు పాలకుల విధానాల ఫలితంగా ఎదురౌతున్న సమస్యల గురించి వివరిస్తూ పోరాడకుండా సమస్యలు పరిష్కారం కావని ఉద్భోధించారు.

మయూరి జంక్షన్‌లోగల పెదిమజ్జిపాలెం ఆటోస్టాండ్‌వద్ద మేడే జెండాను యూనియన్ కోశాధికారి బి. సన్యాసిరావు ఎగురవేయగా మేడే గురించి పాలకుల విధానాలు గురించి ఆటోయూనియన్ వర్కింగ్ ప్రెసిడెంటు బి. పాపారావు, ఎపిఎఫ్‌టియు నాయకులు జి. శ్రీనివాసరావు వివరించారు.

నెల్లిమర్లమండలం కొండగుంపాం గ్రామంలో ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సాహ పూరితంగా జరిగింది. ఎపిఎఫ్‌టియు జెండాను యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు బి. పాపారావు ఆవిష్కరించగా మేడే ప్రాధాన్యతను గురించి, ఆటోడ్రైవర్లపై సాగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత గూర్చి ఆటోయూనియన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి నారాయణరావు వివరించారు.

గంటస్థంభం ఆటోస్టాండ్ వద్ద మేడే జెండాను ఆటోయూనియన్ అధ్యక్షులు ఎన్. తిప్పలరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎన్‌వైఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ టి. సంజీవ్ పనిగంటల తగ్గింపుకై చికాగో కార్మికులు నడిపిన పోరాటాన్ని వివరిస్తూ దేశంలో పాలకులు సామ్రాజ్యవాదానికి అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక హక్కులపై ఏ విధంగా దాడులకు దిగుతున్నారో వివరించారు.

ఐడిఎస్‌ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ఆటోస్టాండ్ వద్ద మేడే జెండాను యూనియన్ ఉపాధ్యక్షులు ఎం. సన్యాసిరావు ఆవిష్కరించగా కా॥ బి. శంకర్రావు మేడే ప్రాధాన్యత, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు.

దోమల మందిరం వద్ద గూడ్స్ ఆటోస్టాండ్ మేడే జెండాను ఆటో యూనియన్ గౌరవఅధ్యక్షులు కె. పైడిరాజు ఆవిష్కరించి మేడే గురించి వివరించి పోరాటాలలో ఐక్యంగా మెలగాలని కోరారు. ఈ కార్యక్రమాలలో రెడ్డి నారాయణరావు, అప్పలరాజురెడ్డి, బి. పాపారావు, టి. సంజీవ్, బి. శంకర్రావు, ఎం. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్వతీపురం ఏరియా

పార్వతీపురం పట్టణంలో అభ్యుదయ వరహాలగెడ్డ బడ్డీ వ్యాపారస్తుల సంఘం తరపున జరిగిన కార్యక్రమంలో మేడే జెండాను రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి డి. వర్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 100 మంది పాల్గొన్నారు. బడ్డీవ్యాపారస్తుల సంఘం నాయకుడు వెల్లంపల్లి శ్రీను, పెనుగుర్తి సంఘం, మీసాల మహేష్, కందుకూరి రామక్రిష్ణ, జామి సత్యన్నారాయణ, కొండూరి కృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

బైపాస్ కాలనీలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యాలయంవద్ద రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా ఉపాధ్యక్షులు బొత్స నరసింగరావు జెండాను ఆవిష్కరించారు.

కొమరాడ మండలం కోటిపాం గ్రామంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కమిటి సభ్యులు, మాజీ సర్పంచి ఎజ్జు గుంపుస్వామి జెండాను ఆవిష్కరించారు. 70 మంది రైతు కూలీలు హాజరైనారు.

కొమరాడ మండలం పెదశాఖ గ్రామంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) గ్రామ ప్రెసిడెంట్, బోడి సాంబన్న, కార్యదర్శి మండంగి సోములు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 100 మంది గిరిజనులు పాల్గొన్నారు.

మక్కువ మండలం దుగ్గేరు, పనసభద్ర, ఎర్రమట్టివల్స, మూలవల్స గ్రామాలలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు ఊయకముత్యాలు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి.

## బహిరంగ సభ

కొమరాడ మండలం విక్రంపురం గ్రామంలో మండల భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎపిఎఫ్‌టియు అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో “మేడే” జెండాను సంఘం గౌరవ అధ్యక్షులు మరిశర్ల పోలినాయుడు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ముఖ్యవక్తలుగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి డి. వర్మ, జిల్లా నాయకులు పి. శ్రీనునాయుడు, మోణంగి భాస్కరరావు, బొత్స నర్సింగరావు, సిరిపురపు విశ్వేశ్వరరావులు మాట్లాడారు. గ్రామపెద్దలు దేవకోట వెంకట నాయుడు, కళింగ మల్లిబాబు, సిరిపురపు రఘు, రాజుమాష్టారు తదితరులు సందేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి 150 మంది కార్మికులు హాజరైనారు.

పై కార్యక్రమంలో మేడే స్ఫూర్తిని అందిస్తూ పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను వివరించి, కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటంలో భాగస్వాములు కావాలని, అప్పుడు మాత్రమే ప్రజల జీవితాలకు గ్యారంటీ ఉంటుందని, కొన్ని సంఘాలు మేడేను పండగలా జరుపుకుంటూ కార్మికవర్గ కర్తవ్యాలను ప్రక్కదారి పట్టిస్తున్నాయని, మేడే అంటే పండగ కాదని, కార్మిక వర్గం తమ హక్కుల కోసం ఉద్యమించవల్సిన కర్తవ్యాన్ని చేపట్టాలని వక్తలు పిలుపునిచ్చారు. మేడే ఆవశ్యకతను గుర్తుచేస్తూ ప్రజా కళాకారులు పాడిన పాటలు ప్రజలను ఆకట్టుకొన్నాయి.

## పూసపాటిరేగ

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొత్తకాపర్లలో ఉన్న విజయనగరం బయోటెక్ వద్ద మేడే జెండాను ఏపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి, విజయనగరం బయోటెక్ కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు కా॥గణేష్ పండా ఆవిష్కరించారు. మేడే అమరవీరులను స్మరిస్తూ 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కా॥ పండా మాట్లాడుతూ 1886లో మే 1వ తేదీన 8 గంటల పనిదినంకోసం చికాగో కార్మికవర్గం పెట్టుబడిదారుల దోపిడీ పీడనల నుండి విముక్తికోసం పోరాడిన చరిత్రను గుర్తుచేశారు.

ఆనాడు మేడే అమరవీరులు ఆశించిన ఫలితం నేటికీ నెరవేరలేదనీ. పోరాడి సాధించిన అనేక హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదనీ మరోవైపున పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు సైతం సతమత మౌతున్నారనీ, అందుచేత ఏపిఎఫ్‌టియు రాష్ట్రకమిటీ ఈ సంవత్సరం పెరిగిన ధరలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు ఇచ్చిందనీ పేర్కొన్నారు. ఈ పోరాటాలన్నీ సమసమాజ స్థాపన దిశగా సాగాలని పిలుపునిచ్చారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ జి. నాగభూషణం, విజయనగరం బయోటెక్ కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ నాయకులు ఎ.తవుడు, ఎస్.రాంబాబు, టి.అక్కుంనాయుడు, ఎస్.వెంకటరాము, శ్రీను మరియు పూసపాటిరేగ మండల కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ నాయకులు జి.వి. రమణ, జి. అసిరి నాయుడు, ఎమ్.రామచంద్రరావు మరియు 250 మంది కార్మికులు ఈ మేడే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రదర్శన-బహిరంగసభ

మేడేరోజు ఉదయం 11 గంటలకు మేట్రిక్స్ కంపెని నుండి 350 మోటార్ సైకిల్స్‌తో సుమారు 700మంది మోటార్ సైకిల్ ప్రదర్శన నిర్వహించారు. ఏపిఎఫ్‌టియు జెండాలు చేబూనిన ప్రదర్శనకారులు - హద్దు అదుపులేకుండా పెరిగిన ధరను తగ్గించాలి అని, ప్రపంచ కార్మికులారా ఐక్యంకండి అని, రసాయనక మరియు మందుల పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 12,000 ఉండాలనే నినాదంతో హెచ్‌బిఎల్, అరబిందో, రెడ్డిఫార్మసి, పైడి భీమవరం ఇండస్ట్రియల్ ఏరియానుండి సిపి కంపెనీవరకు సుమారు 30 కిలోమీటర్లు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు శ్రీ మేట్రిక్స్ లేబోరేటరీస్ స్టాఫ్ యూనియన్ కోశాధికారి కె.లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరి పి.రాజారావు, రమేష్, బి.సాయికృష్ణ, జి.ఈశ్వరరావు, జి.సందీప్, కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ జాయింట్ కార్యదర్శి పి.సంతోష్, ఎల్.రమేష్, కె.సత్యనారాయణ, ఎన్.ప్రకాష్, ఎం.వి.ఎం.రాజు మరియు అసిరినాయుడు నాయకత్వం వహించారు.

స్థానికంగా నున్న యూనియన్ జెండా గద్దెపై ఏపిఎఫ్‌టియు జెండాను కాంట్రాక్టు వర్కర్సు ఉపాధ్యక్షుడు కా॥జి.వి.రమణ ఆవిష్కరించారు. సభ్యులందరూ మేడే అమరవీరుల స్మృతిలో రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బహిరంగసభ ప్రారంభమైంది. ఈ బహిరంగ సభకు అధ్యక్షత వహించిన శ్రీ మేట్రిక్స్ లేబోరేటరీస్ స్టాఫ్ యూనియన్ ఉపాధ్యక్షుడు కా॥పి.బాలాజి, ఈ సభ ఏర్పాటు ఉద్దేశ్యాన్ని వివరించారు. ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥జి.నాగభూషణం మేడే అమరవీరుల త్యాగాన్ని వివరించారు.

సభకు ప్రధాన వక్తగా హాజరు అయిన రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ కార్మిక కర్షక ఐక్యత ప్రాధాన్యతను వివరించారు. నిత్యావసరాల ధరలు ఈనాడు ఆకాశం అంటుకుంటున్నాయనీ, సామాన్యులు కడుపునిండా తిండి లేక ఆకలితో అల్లాడుతున్నారనీ, మార్కెట్లలో ధరలు మండిపోతుంటే మరో ప్రక్కన రైతాంగం పండించిన పంటకు మాత్రం గిట్టుబాటు ధర లేక నిల్వచేసుకొనే దారిలేక ఆందోళనకు నెట్టబడుతున్నారనీ, ఈ వ్యవస్థలో నిత్యావసర ధరలు తగ్గించాలంటే, రైతుకు గిట్టుబాటు ధరలు కావాలంటే రైతులు, కార్మికులు ఐక్యమై ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి అని పిలుపు ఇచ్చారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి మరియు కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ అధ్యక్షులు కా॥గణేష్ పండా మాట్లాడుతూ మేట్రిక్స్ యాజమాన్యం మొండి వైఖరిని ఖండించారు. అలాగే యాజమాన్యం స్టాఫ్ యూనియన్ సభ్యులమీద కక్షకట్టి తక్కువ ఇంక్రిమెంట్ ఇవ్వటం, ప్రమోషన్ నిరాకరించటం, యూనియన్‌లో లేని మెంబరుకు ప్రమోషన్, ఎక్కువ ఇంక్రిమెంటు ఇప్పించి యూనియన్ విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తున్నదన్నారు. యాజమాన్యం ఈ ప్రయత్నం మానకపోతే కార్మికులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మాజీ ఎం.ఎల్.ఏ. శ్రీ మేట్రిక్స్ లేబోరేటరీస్ స్టాఫ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు శ్రీ పత్తివాడ నారాయణస్వామి మాట్లాడుతూ కార్మికులకు అన్యాయంచేస్తే సహించబోమని అన్నారు. కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ జాయింట్ కార్యదర్శి ఎం.రామచంద్రరావు వేదికపైకి నాయకులను ఆహ్వానించగా. జి.అసిరినాయుడు సభను ముగించారు. ఈ సభకు విజయనగరం బయెటెక్, అరబిందో, మరియు ఇతర కంపెనీలనుండి సుమారు 1500 మంది కార్మికులు హాజరయ్యారు. మేడే అమరవీరులను స్మరిస్తూ రైతు కూలీలతో కలిసి పోరాడేందుకు సభ స్ఫూర్తినిచ్చింది.

## జి. చోడవరం

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం జి.చోడవరం వద్ద శ్రీమేట్రిక్స్ లేబోరేటరీస్ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే జెండాను ఏపిఎఫ్‌టియు రాష్ట్రకార్యదర్శి మరియు శ్రీ మేట్రిక్స్ లేబోరేటరీస్ స్టాఫ్ యూనియన్ అధ్యక్షుడు అయిన కా॥గణేష్‌పండా ఆవిష్కరించి మాట్లాడుతూ కార్మికులారా ఐక్యంకండి, సంఘటితంగా పోరాడండి అనే నినాదంతో మేట్రిక్స్ స్టాఫ్-కార్మికులు-కాంట్రాక్టు కార్మికులు ఒకే నాయకత్వం క్రింద సంఘటితం అయ్యారనీ; మేట్రిక్స్ పరిశ్రమ యాజమాన్యం కార్మికులు ఐక్యంగా ఉంటే తమ దోపిడీని ప్రశ్నిస్తారనే భయంతో స్టాఫ్ యూనియన్‌ను విచ్ఛిన్నం చేయాలనే దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నదన్నారు. ఈరోజు స్టాఫ్ కార్మికులు విధులను బహిష్కరించి తమ ఐక్యతను ప్రదర్శిస్తూ మేడే జరపడం అభినందనీయమనీ, యాజమాన్య చర్యను ప్రశ్నిస్తే ఉద్యోగులకు యూనియన్ పెట్టే హక్కు లేదు అనడం విడ్డూరంగా ఉందనీ, అందుచేత ఉద్యోగస్తులు అందరూ యూనియన్ రక్షణకై ఐక్యంగా పోరాడాలని శపథం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు పి.బాలాజి, రాజారావు, లక్ష్మణరావు, సందీపు మరియు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# విశాఖజిల్లా

## చోడవరంలో మేడే సభ

విశాఖజిల్లా చోడవరం టౌన్ కొత్తూరు జంక్షన్‌లోగల మెయిన్ యు.పి. పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య చోడవరం డివిజన్ ఆధ్వర్యంలో మేడే సభ నిర్వహించబడింది. సభకు అధ్యక్షత వహించిన కా॥ ఐతిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు, తరిగిపోతున్న నిజవేతనాలకు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో ప్రతి కార్మికుడూ పోరాడాలన్నారు. ప్రధానవక్త, కార్మిక నగారా ఎడిటర్ కా॥ అడారి అప్పారావు మాట్లాడుతూ తక్షణ, దీర్ఘకాలిక కర్తవ్యాలను నెరవేర్చేందుకు సంసిద్ధులు కావడానికి ప్రతి కార్మికుడూ మేడే నుండి స్ఫూర్తిని పొందాలన్నారు. బి.హెచ్.పి.వి. కార్మిక నాయుకులు కా॥ రామారావు ప్రజలను సంక్షోభపు సుడిగుండాలలోకి నెట్టివేసే పాలక వర్గపు కపట నాటకాలను ప్రజలు గ్రహిస్తూనే ఉన్నారన్నారు. స్త్రీవిముక్తి సంఘటన ప్రతినిధి కా॥ ఓ. లక్ష్మీకుమారి మాట్లాడుతూ నానాటికీ తరిగిపోతున్న నిజవేతనాలు, పెరుగుతున్న వస్తువ్యామోహ సంస్కృతి, త్రాగుడు వంటి వ్యసనాలు కుటుంబాలను అప్పులపాలు చేస్తూ ఆత్మహత్యలకు దారితీయిస్తున్నా యన్నారు. ఎపిఎఫ్‌టియు నాయకులు కా॥ కోటిరెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య దళారీ పెట్టుబడీదారీవర్గ దోపిడీని, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని అంతం చేసేందుకు మేడే స్ఫూర్తితో విప్లవోన్ముఖంగా కార్మిక వర్గం ఉద్య మించాలన్నారు. స్థానిక ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు నూకాచారి మాట్లాడుతూ శ్రమజీవుల అభ్యున్నతి కోసం జరిగే ఎటువంటి కార్యచరణ కోసమైనా ఎపిటిఎఫ్ భుజం కలిపి పోరాడుతుందన్నారు. కవి, రచయిత ఎం.వి. స్వామి మాట్లాడుతూ సామాజిక అంతరాలు దారుణంగా పెరిగిపోతున్న నేటి తరుణంలో స్పందించే హృదయం ఉన్న ఏ రచయితైనా శ్రమజీవుల పక్షాన నిలిచి తీరుతాడని అన్నారు. లక్కవరం ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యదర్శి కా॥ ఎన్. రామకృష్ణ ఆహ్వానం పలికారు.

అదే రోజు ఉదయం ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన చోడవరం ప్రాంత పలు కార్మిక సంఘాల సమావేశంలో సమస్యలపైన, భవన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ చట్టం సక్రమంగా అమలుకాని విషయాలను తెలియజేస్తూ ఎపిఎఫ్‌టియు, లక్కవరం ఏరియా భవననిర్మాణ కార్మిక సంఘం, క్వారీ క్రషర్ కార్మిక సంఘాలు సంయుక్తంగా ప్రచురించిన కరపత్రాలు పంచడం జరిగింది. ప్రచురించిన విషయాలను గురించి కార్మికులు ఆసక్తితో చర్చించుకోవడం కనిపిచింది.

## అనకాపల్లిలో మేడే సభ

మేడే సందర్భంగా అనకాపల్లిలో వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ హాలులో మేడే సభ జరిగింది. విశాఖ



పూసపాటిరేగలో మేడే బహిరంగసభ


బహిరంగసభకు హాజరైన కార్మికులు

మేట్రిక్స్ యూనియన్‌వద్ద జెండా ఆవిష్కరణ


జిల్లా క్వారీ (క్రషర్స్) కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కా॥ అదారి అప్పారావు అధ్యక్షత వహించిన ఈ సభలో ప్రముఖ న్యాయవాది పి. శివయ్యగారు, ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు స్ఫూర్తి వేదిక కన్వీనర్ ఐఆర్‌టి శివాజీరావుగారు, బిహెచ్‌పివి కార్మిక నాయకులు కె. రామారావు, క్వారీ కార్మిక సంఘం కార్యదర్శి బి. పైడిరాజు, ఎపిఎఫ్‌టియు నాయకులు పి. కోటిరెడ్డి ప్రసంగించారు. మామిడిపాలెం, బావులువాడ, గుంకలలోవ, కొంగలివానిపాలెం గ్రామాల క్వారీ కార్మికులు ఈసభలో పాల్గొన్నారు.

గుంకలలోవ క్వారీ కార్మికుల మధ్య కా॥ అదారి అప్పారావు మేడే జండాను ఎగురవేసి మేడే ప్రాధాన్యతను, కార్మికుల ఐకమత్య ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో క్వారీ కార్మిక సంఘ నాయకులు పాపారావు, అప్పల్నాయుడు, బాలరాజు, సూర్యారావు, క్వారీ కార్మికులు పాల్గొన్నారు.

డ్రిల్లర్స్ కాలనీలో ఎపిఎఫ్‌టియు ఆఫీసుకోసం కేటాయించిన స్థలంలో మేడే జండాను కా॥ అదారి అప్పారావు ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ఆర్.వి. నగర్, దర్గీనగర్, రిక్షాకాలనీ, డ్రిల్లర్స్ కాలనీ, బవులవాడ, త్రిమూర్తులగుడికి చెందిన క్వారీ కార్మికులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి చవితిని రమణ, చొప్ప రాజారావు, రామచంద్రరావు తదితరులు హాజరయ్యారు.

మామిడిపాలెంలో క్వారీ కార్మిక సంఘం నాయకులు బోగాది రాము, పూడి రమణ, వందాన లక్ష్మణరావు, నర్సింగరావు ఆధ్వర్యాన క్వారీ కార్మికులు మేడే జండాను ఎగురవేశారు.

కొంగలివానిపాలెంలో ఉదయం 9 గంటలకు మేడే జండాను ఎపిఎఫ్‌టియు నాయకులు కా॥ రామారావు ఆవిష్కరించారు. క్వారీ కార్మిక సంఘం కార్యదర్శి పైడిరాజు, కొంగలి నాగేశ్వరరావు, బొంతు రామారావు, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి భూమిహీన దళిత కూలీ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో జండా ఎగురవేశారు. దళిత కూలీ సంఘ నాయకుడు జి. దశరధ్, కమిటీ సభ్యులు పినపల్ల అప్పారావు, దేముడు, బొబ్బాది అప్పారావు పాల్గొన్నారు. అదారి అప్పారావు, కె. రామారావు, పి. కోటిరెడ్డి మేడే ప్రాధాన్యతను, భూమి సమస్యను, దళితుల ఐక్యమత్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్న శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ ప్రసంగించారు.

## తూర్పుగోదావరి జిల్లా

కాట్రేనికోన మండలం-కందికుప్పలో ఆటోవర్కర్స్, కొబ్బరి ఒలుపు-కొబ్బరిదింపు కార్మికుల ఆధ్వర్యంలో మేడే జరిపారు. రైతుకూలీసంఘం రాష్ట్రకమిటీ సభ్యులు కామ్రేడ్ వనచర్ల సుబ్బారావు జెండా ఎగురవేశారు.

దొంతికుర్రులో కొబ్బరి ఒలుపు కార్మిక నాయకులు దొంతి మూర్తి జెండా ఎగురవేశారు.

కాట్రేనికోనలో ఆటో కార్మికులు, రిక్షాకార్మికులు, జట్టు కార్మికులు, కొబ్బరి ఒలుపు కార్మికులు, కొబ్బరి దింపు కార్మికుల ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. కామ్రేడ్ వనచర్ల సుబ్బారావు జెండా ఎగురవేశారు.

కామ్రేడ్ సుబ్బారావు మేడే ప్రాధాన్యాన్ని వివరించారు. అసంఘటితరంగ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. 150 నుంచి 300 మంది పైగా కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలం నేలటూరులో అమరుల స్థూపం వద్ద కామ్రేడ్ గుబ్బల వీర్రాజు జెండాను ఎగురవేశారు. కామ్రేడ్స్ అమ్మాజీ, లక్ష్మణమూర్తి, వీరలక్ష్మి జిల్లాలో సంఘం ఆధ్వర్యంలో సాగుతున్న భూపోరాటాలు వివరించారు.

మండపేట మండలం శ్రామిక మహిళానగర్‌లో రైతుకూలీసంఘం జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కె. రామయ్య మేడే జెండా ఎగురవేశారు. ఏ సమస్య పరిష్కారం కావాలన్నా పోరాటమే పరిష్కారమార్గమన్నారు.

ఉప్పాడకొత్తపల్లి మండలం-వాకతిప్పలో మేడే జెండాను రైతుకూలీసంఘం జిల్లా కమిటీ సభ్యుడు కాశీ అప్పారావు ఎగురవేశారు.

రంగంపేట మండలం వెంకటాపురంలో అంజూరి అప్పారావు, దొడ్డగుంటలో రైతుకూలీసంఘం జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ ఎల్లపు బలరాం జెండా ఎగురవేసారు.

ఈ కార్యక్రమాలలో100 నుండి 200 మంది వరకు రైతుకూలీలు పాల్గొన్నారు. కామ్రేడ్ బలరాం ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న భూపోరాటాలను, దానికొరకు ప్రజల్ని సన్నద్ధం చేస్తున్న తీరును వివరించారు.

## పశ్చిమగోదావరి జిల్లా

### గౌరీపట్నం

గౌరీపట్నం ఏరియా క్వారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వూరు మండలం దేశిర్లలో యూనియన్ సహాయ కార్యదర్శి కంచుమర్తి సూర్యచంద్రరావు మేడే జండాను ఎగురవేశారు.

దేవరపల్లి మండలం ఆర్లమ్మబాటలో యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ పోలుమాటి పెంటయ్య, ఆర్లమ్మ క్వారీ ప్రాంతంలో యూనియన్ ఉపాధ్యక్షులు దాసు అబ్బులు మేడే పతాకాలను ఆవిష్కరించారు.

ఎపిఎఫ్‌టియు అనుబంధ గౌరీపట్నం ఏరియా డ్రిల్లర్స్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేవరపల్లి మండలం దుద్దుకూరులో యూనియన్ అధ్యక్షుడు జి.భీమరాజు మేడే జెండాను ఆవిష్కరించారు.

దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో గౌరీపట్నం ఏరియా క్వారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 40ఎం.ఎం. రాయికొట్టె వర్కర్స్ యూనియన్ నాయకులు, మాదాసు వెంకయ్య జెండా ఎగురవేశారు.

ఈ జెండా ఆవిష్కరణల సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కామ్రేడ్ ఎం.ఎస్. నాగరాజు మాట్లాడుతూ మేడే ప్రాధాన్యాన్ని వివరించి, యూనియన్ ఏర్పడిన నాటి నుంచి వస్తున్న మార్పులు, చేర్పులు-ఎగ్రిమెంట్లు చేసుకోవడం మధ్యకాలంలో యూనియన్లతో సంబంధం లేకుండా యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరు, ఎగ్రిమెంటలకు తూట్లు పొడుస్తున్న తీరు వివరించారు. కార్మికులు ఎగ్రిమెంట్ల సమయంలో ఎంతటి సంఘటిత శక్తి ప్రదర్శిస్తున్నారో అంతే చొరవతో ఐక్యతతో, సంఘటిత పోరాటాలకు సిద్ధపడి తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ అన్నిచోట్ల 50 నుంచి 100 మందికి పైగా కార్మికులు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో గిరిజన సంఘం కార్యదర్శి కామ్రేడ్ కుంజం రామారావు, వెంకటరెడ్డిగూడెంలో కామ్రేడ్ పద్దం కృష్ణమూర్తి మేడేపతాకాలను ఎగురవేసి అమరులకు జోహార్లు చెప్పారు.

ఏజన్సీ గిరిజన సంఘం (రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)-అనుబంధం) ఆధ్వర్యంలో పోలవరం మండలం తెల్లవరంలో గిరిజన సంఘం కార్యదర్శి కామ్రేడ్ కుంజం రామారావు; రెడ్డినాగంపాలెంలో, మనుగోపాలలో గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ సవలం రాంబాబు, పేంద్రాలలో గిరిజన సంఘం నాయకురాలు కామ్రేడ్ కలుం గంగాదేవి, జిల్లెల్ల గూడెంలో గిరిజన సంఘం కార్యదర్శి కామ్రేడ్ కుంజం రామారావు అరుణపతాకాలను ఆవిష్కరించారు.

ఈ అన్ని చోట్ల 1990 నుంచి ఇప్పటిదాకా ఏజన్సీ గిరిజన సంఘం సాగిస్తున్న కృషిని వివరించి కొత్తగా భూస్వాములు, మాజీ జమీందార్లతో కుమ్మక్కయిన పెత్తందార్లు చేస్తున్న కుట్రలను వివరించి త్రిప్పికొట్టాలని; ప్రాజెక్టు పేరుతో అధికార యంత్రాంగం, పెత్తందార్లు చేస్తున్న మోసాలు, కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఒక్కోకేంద్రంలో 50 నుంచి 150 మంది పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లా

### బందరు ఏరియా

సిపిఐ (ఎం-ఎల్), ఎపిఎఫ్‌టియు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో మచిలీపట్నం ఏరియాలో మేడే ఉత్తేజ పూర్వకంగా జరిగింది. గ్రామాల్లో, కార్మికవాడల్లో కష్టజీవుల కాలనీలలో "మేడే వర్ధిల్లాలి", "ప్రపంచ కార్మికులారా ! ఏకంకండి!", "అమర వీరుల ఆశయాలను కొనసాగిస్తాం!" భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం జరిగే రైతాంగ, గిరిజన పోరాటాలు వర్ధిల్లాలనే నినాదాల హోరు నడుమ ఎర్రజెండాలను ఆయా సెంటర్లలో ఎగురవేశారు.

సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో మచిలీపట్నం జడ్‌పి సెంటర్‌లో అమరుడు కా॥ భోగాదుల రామారావు అమరస్థూపం వద్ద సిపిఐ (ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ యద్దనపూడి సోని, పెదకరగ్రహారం కా॥ తరిమెల నాగిరెడ్డి స్థూపం వద్ద సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ జె. జగన్, మచిలీపట్నం అరుణోదయ కాలనీలో కా॥ మండ్ల సుబ్బారెడ్డి స్థూపం వద్ద రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకురాలు కా॥ పామర్తి అంజమ్మ, దిమ్మల సెంటర్ వద్ద పుట్టె సాయిబాబు, కాలేఖాన్ పేటలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కోశాధికారి తలసిల లీలామనోహర్, ఇంగ్లీషుపాలెంలో కా॥ భోగాదుల రామారావు స్మారక గ్రంథాలయం వద్ద గ్రంథాలయ నిర్వహణ కమిటీ సభ్యుడు కా॥ జగన్ ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో గిలకలదిండి, కోటవారితుళ్ళ సెంటర్, నాగపోతరావు సెంటర్, బేబి సెంటర్, బస్టాండు సెంటర్, కోనేరు సెంటర్, బావి సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి సెంటర్, పెదకరగ్రహారం, ఏరాసుపేట ఆటోస్టాండుల వద్ద కా॥ చింతావీరస్వామి, కా॥ చిటికెన శ్రీనివాసు, గూడపాటి సురేంద్ర, కా॥ కొంజేటి మురళీ, కుంభా నాంచారాయ్య, గొలిపర్తి ఆదినారాయణ, కా॥ పామర్తి వెంకట్రావు, కా॥ గునుపూడి శ్రీనివాసరావు, పుట్టె ఫ్రాన్సిస్, అడ్వకేటు సీతన్నాద్రి చిన్నారావు; పెదకరగ్రహారం ప్రైవేట్‌గోడౌన్ ముఠా వర్కర్స్ యూనియన్ జెండాదిమ్మవద్ద కా॥ కంచర్లపాడు రంగారావు, చిలకలపూడి సిడబ్ల్యుసి ముఠా వర్కర్స్ యూనియన్ జెండాదిమ్మవద్ద యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎపిఎఫ్‌టియు రాష్ట్రకార్యదర్శి కా॥ యద్దనపూడి సోని, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అభ్యుదయ రైస్ మిల్స్ వర్కర్స్ యూనియన్ జెండా దిమ్మె వద్ద కా॥ బండి సుబ్రహ్మణ్యం, రైతుబజారు రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెండా దిమ్మవద్ద కా॥ పరసా హరికృష్ణ. జడ్‌పిసెంటర్-టుటౌన్ ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయంవద్ద కా॥ కాగిత నాగేశ్వరరావు, రాయవరం ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘంలో కె. వెంకటేశ్వరరావు ఎర్రజెండాలను ఎగురవేశారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో పెదపట్నం గొల్లగూడెంలో కా॥ కొల్లాటి నాగేశ్వరరావు, మచిలీపట్నం ఆదర్శనగర్‌లో కా॥ పెద్దిబోయిన సుబ్రహ్మణ్యం, గరాలదిబ్బలో కా॥ వడుగు శివన్నారాయణ, కొత్తపల్లి తుమ్మలపాలెంలో కా॥ విశ్వనాధపల్లి నారాయణస్వామి, వల్లెతుమ్మలపాలెంలో కా॥ విశ్వనాధపల్లి వెంకటేశ్వరరావు, గుండుపాలెం దళితవాడ వద్ద కా॥ గుంటూరు కోటేశ్వరరావు, గుండుపాలెంలో కా॥ కొప్పినేని ఉమా మహేశ్వరరావు, కృష్ణాపురంలో స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు కా॥ ధనికొండ కోటేశ్వరమ్మ, చిన్నాపురం అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద కా॥ గుమ్మడి కృష్ణ, చిన్నాపురం గుడిసెంటర్‌లోకా॥ కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు, పెదయాదవ కొత్తపల్లి కాలనీలో అర్జా సుబ్బారావు, పెదయాదవ దళితవాడలో కా॥ లింగం ప్రభాకరరావు ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఆ సందర్భంగా జరిగిన సభలు, సమావేశాలలో, గ్రూపు మీటింగులలో పలువురు ప్రసంగించారు. ప్రధానంగా ఎపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ అవినీతిని అంతంచేయాలని ఢిల్లీలో అన్నాహజారే చేపట్టిన ఉద్యమానికి కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్ఆర్ పార్టీలతోసహా అన్ని పార్టీలూ మద్దతు తెల్పాయని, జన్‌లోక్‌పాల్ బిల్లు కేంద్రప్రభుత్వం తేవాల్సిందేనని అందరూ పట్టుబట్టారని, విచిత్రమేమంటే, కడప ఎన్నికల్లో కాంగ్రెస్ , వైఎస్ఆర్ పార్టీ, తె.దే. పార్టీలు 200 కోట్లు ఖర్చుపెట్టి అధికారంలోకి వచ్చేందుకు అడ్డదారులు త్రొక్కు తున్నాయన్నారు. గోడౌన్లను ప్రైవేటు కంపెనీలకు అద్దెకిచ్చి, గోడౌన్లు ఖాళీగా లేవనే సాకుతో ఎఫ్‌సిఐ ధాన్యసేకరణకు పూనుకోవడం లేదనీ. గోడౌన్లు ఖాళీలేవు కనుక ఎగుమతులకు అనుమతివ్వాలని మిల్లర్లు డిమాండు చేస్తున్నారనీ. లేకపోతే ధాన్యం కొనబోమని పైపెచ్చు బెదిరిస్తున్నారనీ. అధికధరలతో వేగిపోతున్న వినియోగదారులు, పేదలు-ఎగుమతులకు అవకాశం ఇస్తే-బియ్యం ధరలకు రెక్కలొస్తాయని భయపడు తున్నారన్నారు. పోరాడి సాధించుకొన్న 8 గంటల పనిదినం కాలరాయబడి కార్మికులు మరింత శ్రమ దోపిడికి గురవుతున్నారనీ ఈ పరిస్థితుల్లో మేడే స్ఫూర్తిని పొంది చైతన్యవంతులై ఉద్యమించాలని ఉద్బోధించారు. సిపిఐ (ఎం-ఎల్) నాయకులు జె. జగన్, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కొప్పినేని ఉమామహేశ్వరరావు, పామర్తి అంజమ్మ, ఎపిఎఫ్‌టియు పట్టణ అధ్యక్షులు కా॥ బెల్లంకొండ రవి, ఎపిఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి కా॥ ముచ్చు సుధాకరరావు. ఎన్‌వైఎస్ బందరు ఏరియా నాయకులు కా॥ జి. మల్లేష్ మేడే గురించి వివరించి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ఎండ గట్టారు.



మేడే సన్నాహిక కృషిలో భాగంగా 19-4-2011 తేదీన కా॥ భోగాదుల రామారావు స్మారక గ్రంథాలయం మీటింగుహాలు నందు సిపిఐ (ఎం-ఎల్), ఎపిఎఫ్‌టియు, రైతు కూలీ సంఘం ముఖ్య కార్యకర్తలతో విస్తృత సమావేశం జరిగింది. ఎపిఎఫ్‌టియు పట్టణ అధ్యక్షుడు కా॥ బెల్లంకొండ రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో "తీరప్రాంత విధ్వంసం, కర్తవ్యాలు" అన్న అంశంపై చర్చించుకొని మేడే గురించి పథకం రూపొందించుకున్నారు.

### చల్లపల్లి

మేడేని పురస్కరించుకొని చల్లపల్లి కోమలానగర్‌లో రైతుకూలీసంఘం చల్లపల్లి ఏరియా కార్యదర్శి తనిపూరి రాంబాబు, శివరామదుర్గాపురంలో ఎన్‌వైఎస్ ఏరియా అధ్యక్షుడు కా॥ మునిపల్లె శ్రీనివాసరావు, ఘంటసాల మండలం వి. రుద్రవరం దళితవాడలో స్థానిక రైతుకూలీసంఘం నాయకులు కా॥ చంద్ర రాఘవులు ఎర్రజెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రావి సుబ్బారావు, ఎన్‌వైఎస్ ఏరియా అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాసరావు, ఓపిడిఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రామాంజనేయులు పాల్గొన్నారు. రైతుకూలీలు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నాగాయలంక

నాగాయలంక కృష్ణానది రేవు ఒడ్డున రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) నాగిడి శివ, నాగాయలంక ఒడ్డున రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కోశాధికారి తలసిల లీలామనోహర్, దళితవాడలో కా॥ తిరపతయ్య మేడే ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ మేడే కార్యక్రమానికి రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) స్థానిక నాయకులు నాగిడి బసవదేవుడు నాయకత్వం వహించారు.

### విజయవాడ

స్థానిక గిరిపురంలోని తరిమెల నాగిరెడ్డి స్థూపం వద్ద సిపిఐ (ఎం-ఎల్) నగర కార్యదర్శి కామ్రేడ్ టి. పూర్ణచంద్రరావు, గాస్పెల్‌హాల్ చర్చి సెంటర్‌లో కా॥ కె. ఏసు, గుణదల అరుణ్‌నగర్‌లో సీనియర్ కామ్రేడ్, కా॥ పిల్లలమర్రి వెంకటేశ్వరరావు; స్థానిక కృష్ణలంక సత్యంగారి హోటల్ సెంటర్, నిడమానూరు గోడౌన్ సెంటర్‌లలో సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కొప్పుల కోటయ్య మేడే అరుణపతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కా॥ కోటయ్య పలుచోట్ల ప్రసంగిస్తూ మేడే ప్రాముఖ్యతను, నేడు దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను, పాలకులు నిండా మునిగిన అవినీతి, నల్లధనం కుంభకోణాలను, వీటికి వ్యతిరేకంగా భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాలను చేబూని ప్రజలు పోరాడాల్సిన ఆవశ్యకతను వివరించారు.



కరీంనగర్‌లో మేడే బహిరంగసభ

ఎన్.వి. కృష్ణయ్య విగ్రహంవద్ద నివాళి


పార్వతీపురంలో మేడే జెండా ఆవిష్కరణ




## ప్రదర్శన

మేడే సందర్భంగా ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో వందమంది మునిసిపల్ కార్మికులు, మహిళలు, ఆటో కార్మికులు విజయవాడ వన్‌టౌన్‌లోని కొత్త అమ్మ గుడి వద్దనుండి వాగుసెంటర్, జోడుబొమ్మల సెంటర్ మీదుగా నినాదాలతో, డప్పులవాయిద్యాలతో, ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కొత్తపేట, టైలరుపేట, రామాలయం కేంద్రాలలో కామ్రేడ్ యు. లక్ష్మణరావు మేడే జండాలను ఆవిష్కరించారు. సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కోటయ్య కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ విజయవాడలోని కార్మికుల పోరాట చరిత్రను గుర్తు చేశారు. విజయవాడ నగరంలో జండా ఆవిష్కరణల సందర్భంగా ప్రజాకళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి.

## నందిగామ

కృష్ణాజిల్లా నందిగామ, చందర్లపాడు మండలాల పరిధిలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాలు నిర్వహించారు.

నందిగామ మండలం కమ్మవారిపాలెంలో కా॥ చంద్ర శివయ్య స్థూపంవద్ద ఎర్రజెండాను కా॥ రావెళ్ళ కళింగరావు; చందర్లపాడు మండలం కాండ్రుపాడు గ్రామంలో రైతుకూలీసంఘంనేత కా॥ ఇందూరి అప్పిరెడ్డి; పొక్కునూరు గ్రామంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకులు అబ్రహం; కొడవటిగల్లు గ్రామంలో అమరుడు వాసిరెడ్డి నాగేశ్వరరావు స్థూపంవద్ద కా॥ వి. నాగేశ్వరరావు అరుణ పతాకాలను ఆవిష్కరించి మేడే మృత వీరులకు జోహార్లుచెప్పారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ మందా జార్జి మాట్లాడుతూ ఏవో కొన్ని సౌకర్యాలు సాధించి, కొన్ని ఆర్థిక డిమాండ్లు నెరవేర్చి ఈ వ్యవస్థ పరిధిలోనే కార్మిక వర్గానికి అనుగుణమైన మార్పును సాధించవచ్చని కొన్ని కార్మిక సంఘాలు నమ్మించ జూస్తున్నాయని, కార్మికవర్గం ఈ విధమైన ధోరణులపట్ల అప్రమత్తంగా వుండి వాటిని ఓడించటంతో పాటుగా సరైన కార్మిక వర్గ సిద్ధాంత ఆయుధాన్ని చేబూనాలన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ కాసరెల్లి మస్తాన్, రాంబాబు, కాంతయ్య, యాదుల నాగేశ్వరరావు, ఆనందరావు, స్త్రీ విముక్తిసంఘటన నాయకులు కా॥ కామేశ్వరి, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

# గుంటూరు జిల్లా

## గుంటూరు

**సిపిఐ(ఎం-ఎల్),** ఏపిఎఫ్‌టియుల ఆధ్వర్యంలో గుంటూరులో మేడే జెండాల ఆవిష్కరణ జరిగింది.

మొదటగా స్థానిక చుట్టుగుంట సెంటర్‌లోని పున్నయ్య, శంకర్‌ల భవన్‌వద్ద, అనంతరం వరుసగా మురికిపేట, యతిరాజనగర్, కె.వి.పి. కాలనీ, గోయల్ కాలనీ, కృష్ణబాబుకాలనీ, మిర్చియార్డు, నల్లకుంట, వైజాగ్‌స్టీల్స్, భారతిస్టీల్స్, సంగడిగుంట, జూట్‌మిల్లు, ఏటి అగ్రహారం కేంద్రాలలో అరుణపతాకావిష్కరణలు స్ఫూర్తిదాయకంగా జరిగాయి.

సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు పున్నయ్య-శంకర్‌ల భవన్‌వద్ద మేడే జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా పీడిత ప్రజానీకం దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్నారని, మన దేశంలోనూ రైతాంగం, కార్మికులు నిరంతరాయ పోరాటాలలో ఉన్నారని, ఈ పోరాటాలన్నీ దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా సమసమాజం దిశగా సాగాలని, మేడే మృత వీరుల త్యాగాలను వృధా కానీయరాదని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ మేడే పతాకావిష్కరణ కార్యక్రమాలలో ఇంకా సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ దేవరశెట్టి వెంకటస్వామి, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, కాట్రగడ్డ హనుమంతరావు, ఏపిఎఫ్‌టియు నాయకులు కామ్రేడ్స్ యు. కృష్ణ, రంగస్వామి, గిడుతూరి చంద్రం, ఏపిఎఫ్‌టియు అనుబంధ బండ్లరిక్షా యూనియన్ అధ్యక్షులు కా॥ బి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కా॥ జి. శివ, ఏపిఎఫ్‌టియు అనుబంధ దిగుమతి ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు కామ్రేడ్స్ సత్తయ్య, పచ్చల శ్రీను, చెన్నయ్య తదితర కామ్రేడ్స్ పాల్గొని నాయకత్వంవహించారు.

గుంటూరు రూరల్ మండలం పొత్తూరు గ్రామంలో మేడే జండాను రైతుకూలీ సంఘం స్థానిక నాయకులు కా॥ దూపాటి వెంకటేశ్వర్లు ఎగురవేశారు.

ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలో అరుణపతాకను రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ దూపాటి శ్రీను ఆవిష్కరించారు. పొత్తూరు, యనమదలలో జరిగిన ఈ కార్యక్రమాలలో ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ చెన్నుపాటి వెంకటేశ్వర్లు, ఊటుకూరి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పోర్టులు, పార్కులు, ప్రాజెక్టుల పేరిట పాలకులు పెద్దఎత్తున భూములను సేకరిస్తూ, రైతాంగాన్ని ప్రజలను నిర్వాసితులుగా మారుస్తున్నారని, లక్షలాది ఎకరాలను పడావుగా పెట్టి పాలకులే దళారీలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తున్నారని, అభివృద్ధి పేరుతో సాగిస్తున్న ఈ విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఏకమై పోరాడేందుకు దీక్షబూనాలని పిలుపునిచ్చారు.

## రేపల్లె

సిపిఐ (ఎం-ఎల్) ఆధ్వర్యంలో స్థానిక అంకమ్మ చెట్టు సెంటర్‌లో అరుణపతాకను కా॥ చందోలు నాగేశ్వరరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ ఎం. శోభారాణి మాట్లాడుతూ మేడే మృతవీరులకు జోహార్లర్పించటమంటే భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాలకు పూనిక వహించటమేనన్నారు. ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ కౌతవరపు సీతారామయ్య మాట్లాడుతూ కార్మిక హక్కులను నానాటికీ కాలరాస్తున్న దోపిడీ పాలకవర్గ విధానాలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ వెంకట్రావు, డి. ప్రభాకర్, కె. సాంబశివరావు, ఇంకా ముఠా కార్మికులు, రిక్షా కార్మికులు, రైతు కూలీలు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పేటేరు ఆంజనేయస్వామి కాలనీలో మేడే పతాకాన్ని ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో కా॥ కౌతవరపు సీతారామయ్య ఎగురవేయగా కామ్రేడ్స్ శోభారాణి, బసవయ్య స్థానిక చేనేత కార్మికులు పాల్గొని మేడే అమరుల స్ఫూర్తితో ముందుకు సాగుతామని ప్రతినబూనారు.

## పిడుగురాళ్ళ

పిడుగురాళ్ళ పట్టణంలో ఏపిఎఫ్‌టియు మరియు దాని అనుబంధ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఉత్సాహ పూరితంగా నినాదాలతో, పాటలతో ప్రదర్శనగా కార్మికుల 'మేడే' ఎర్రజెండా ఆవిష్కరణలను జరుపుకున్నారు.

స్థానిక లెనిన్ నగర్‌లో సిపిఐ(ఎం-ఎల్) జెండాని పార్టీ నాయకులు కా॥ కె. ముసలయ్య ఆవిష్కరించగా కాలనీ ప్రజలు 100 మంది వరకు పాల్గొన్నారు.

చైతన్య బట్టీల వర్కర్స్ యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షులు కా॥ రాజు, వెంకట్రావు ఆవిష్కరించగా బట్టీ కార్మికులు 50 మంది పాల్గొన్నారు.

రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షులు కా॥ వెంకయ్య ఎగురవేశారు. కార్మిక యూనియన్ నాయకులు 30 మంది పాల్గొన్నారు.

చైతన్య ఆటో వర్కర్స్ యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షులు కె. రవి, అమీను, అంజి, జానీలు ఆవిష్కరించగా ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జానపాడు రైల్వేగేటు సెంటర్‌లో ఏపిఎఫ్‌టియు కార్యాలయం వద్ద జెండాను కా॥ కోటేశ్వరరావు ఆవిష్కరించగా కార్మికులు, యూనియన్ నాయకులు 120 మంది పాల్గొన్నారు.

చైతన్య ఎరువులకొట్ల ముఠావర్కర్స్ యూనియన్ జెండాను కా॥ వెంకట్రావు; చైతన్య బజారు ముఠా వర్కర్స్ యూనియన్ జెండాను కా॥ జివిని పున్నారావులు ఆవిష్కరించగా పెద్ద సంఖ్యలో కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చైతన్య ఐరన్ మరియు సిమెంట్‌కొట్ల ముఠావర్కర్స్ యూనియన్ జెండాను కా॥ ఎస్.కె. పెద్దసైదా, వెంకటేశ్వర్లు ఆవిష్కరించగా 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

చైతన్య సా మిల్ వర్కర్స్ యూనియన్ జెండాను కా॥ వెంకట్రామయ్య; చైతన్య లాగుడుబండ్ల వర్కర్స్ యూనియన్ జెండాను కా॥ బాలయ్యలు ఆవిష్కరించారు.

కా॥ విశ్వమోహనరెడ్డినగర్‌లో మేడే జెండాను కాలనీ అధ్యక్షులు కా॥ పౌలేసు ఆవిష్కరించగా కాలనీ ప్రజలందరూ కాలనీని ఎర్రతోరణాలతో అలంకరించుకొని పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొన్నారు.

చైతన్య సున్నం మిల్లుల వర్కర్స్ యూనియన్ జెండాను యూనియన్ నాయకులు కా॥ పౌలేసు, మౌలాలి, సాంబయ్య, శ్రీను కలసి ఎగురవేశారు. కార్మికులు 60 మంది పాల్గొన్నారు.

కొండమోడు జంక్షన్‌లో సిపిఐ(ఎం-ఎల్) జెండాను కా॥ డి.వి.ఎన్. స్వామి ఆవిష్కరించారు.

కా॥ తరిమెల నాగిరెడ్డి నగర్‌లో మేడే జెండాను కాలనీ అభివృద్ధి కమిటి నాయకులు బాబు, వెంకటరెడ్డి, సత్యనారాయణ ఆవిష్కరించగా కాలనీ ప్రజలు 30 మంది పాల్గొన్నారు.

టి.ఎన్. నగర్‌లో కొండమీద మేడే జెండాను కా॥ సత్యనారాయణ, బాబు ఆవిష్కరించగా కార్మికులు, బాలసంఘం పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌వద్ద సిపిఐ (ఎం-ఎల్) జెండాలను పార్టీ నాయకులు కా॥ నీలాద్రి రాంబాబు ఆవిష్కరించగా కార్మికులు, ప్రజలు 60 మంది పాల్గొన్నారు.

మేడే వర్ధిల్లాలి, ఎర్రజెండా వర్ధిల్లాలి, పోరాడుదాం దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా అని నినదిస్తూ పట్టణంలో అన్ని యూనియన్ల నాయకులు, కార్మికులు ప్రదర్శనగా సినిమాహాలు సెంటర్‌కు వచ్చి జెండా ఆవిష్కరణలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు, కా॥ ఎం. నిర్మల, ఎన్.వై.ఎస్. నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ మేడే యొక్క ప్రాధాన్యతను, ఆనాడు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, రాయితీలను పాలకులు క్రమంగా తీసివేస్తూ ప్రజల, కార్మికుల జీవితాలను మరింతగా దిగజారుస్తున్నారని, కార్మికుల, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమ్మెచేసే హక్కును ఎత్తివేయాలని చూస్తున్న ప్రభుత్వ, దళారుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## కారంపూడి

కారంపూడిలోని పోతురాజు గుట్టవద్ద మేడే జెండాను కా॥ మరియదాసు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీలు 70 మంది పాల్గొన్నారు.

పున్నయ్య, శంకర్‌ల కాలనీలో 'మేడే' ఎర్రజెండాను కుంభా శ్రీను, మౌలాలీలు ఆవిష్కరించారు. కారంపూడి బస్టాండ్ సెంటర్‌లో రైతుకూలీసంఘం నాయకులు కా॥ జె. పద్మ ఎర్రజెండాను ఆవిష్కరించగా కార్మికులు, రైతుకూలీలు 70 మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడే యొక్క ప్రాముఖ్యతను, రోజురోజుకి దూరం అవుతున్న కార్మికుల హక్కులను, శ్రమదోపిడి, పీడనలను కొనసాగిస్తున్న దళారీ పాలకుల విధానాలను ఎదుర్కోవాలని, శ్రమదోపిడీ నుండి విముక్తి కోసం కార్మికులు, రైతుకూలీలు మరింత సంఘటిత పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపు నిచ్చారు.

## రెంటచింతల

స్థానిక రైతుకూలీసంఘం కార్యాలయంవద్ద అరుణపతాకాన్ని సీనియర్ కమ్యూనిస్టు, కామ్రేడ్ అమరలింగం ఆవిష్కరించగా కార్మికులు, రైతుకూలీలు 30 మంది పాల్గొని మేడే మృతవీరులకు నివాళు లర్పించారు.

పాలువాయి జంక్షన్‌లో మేడే పతాకాన్ని రైతుకూలీ సంఘం నాయకులు కా॥ మరియదాసు ఎగురవేశారు.

పాలువాయి గ్రామంలోని వివిధ కూడళ్ళలో పెద్దిరెడ్డి, జోగ్యానాయక్, శివ, కొండలు ఎర్రజెండా ఆవిష్కరణలు చేసి మేడే అమరుల ఆశయాలను కొనసాగిస్తామని దీక్షబూనారు. ఈ కార్యక్రమాల్లో వందమంది రైతుకూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

మల్లారం గ్రామంలో కా॥ ఆనందరావు; తుమృకోటలోని వివిధ సెంటర్లలో కామ్రేడ్స్ నారాయణ, జంగా సైదులు, యోహాను అరుణపతాకావిష్కరణలు గావించారు. ఈ సందర్భంగా హాజరైన 100 మంది నుద్దేశించి కార్మికవర్గం ముందున్న కర్తవ్యాలను వివరించారు.

జెట్టిపాలెం కేంద్రంలో కా॥ అంజయ్య, మంచికల్లు కేంద్రంలో రాముడు, సుందర్రావు మేడే జెండాలను ఆవిష్కరించారు.

ఏపిఎఫ్‌టియు అనుబంధ నాపరాయి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కా॥ సామియేలు ఎర్రజెండాను ఆవిష్కరించి మేడే దీక్షాదినం ప్రాధాన్యతను వివరించారు.

దుర్గి-వనం కేంద్రంలో ఇటుకబట్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో సంగం అధ్యక్షులు కా॥ సుబ్బయ్య, సంఘం కార్యదర్శి కా॥ లింగయ్య పాల్గొని అమరుల ఆశయాన్ని కొనసాగిస్తామని దీక్షపూనారు.

## మంగళగిరి

స్థానిక లక్ష్మీనరశింహస్వామికాలనీలో ఏపిఎఫ్‌టియు అనుబంధ చైతన్య భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసుకున్న జెండా దిమ్మెవద్ద సంఘ గౌరవ అధ్యక్షులు, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ జగ్గారపు సుబ్బారావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు భవన నిర్మాణ కార్మికసంఘం అధ్యక్షులు కా॥ కాశిన కొండలరావు అధ్యక్షత వహించారు. కా॥ సుబ్బారావు మాట్లాడుతూ కార్మికవర్గం ఎన్నో త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న హక్కులు ఒక్కొక్కటి పాలక వర్గాల విధానాల కారణంగా హరించిపోతున్నాయనీ, కనీస వేతనం అమలుకాక, పనిగ్యారంటీ లేక లక్షలాదిమంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారనీ, మరోవైపు అభివృద్ధి పేరుతో సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు నిర్మిస్తున్న పార్కులు, టౌన్‌షిప్‌లు, పోర్టులలో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారనీ, ఈ పరిస్థితులలో కార్మికవర్గం సంఘటితంకావడం, సంఘాల్లోకి సమీకృతులు కావడం, రాజ్యాధికారం కోసం పోరాడటం తక్షణ కర్తవ్యం అన్నారు. సంఘాలను విచ్ఛిన్నంచేసే పాలకవర్గ కుట్రలకు బలికాకుండా ఐక్యతను పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కా॥ ఎస్.కె. ఇబ్రహీం, సభ్యులు ఎట్ట వెంకట్రావు, మహంకాళి రామకృష్ణ, కాశిన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రామికనగర్‌లోని సిపిఐ(ఎం.ఎల్) జెండా దిమ్మెవద్ద పార్టీ నాయకులు కా॥జగ్గారపు సుబ్బారావు; భగత్‌సింగ్‌నగర్‌లో ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం కన్వీనర్ కా॥కూరపాటి కోటేశ్వరరావు; పాతబస్టాండ్ సెంటర్‌లోగల చైతన్య రిక్షా డ్రైవర్స్ యూనియన్ సెంటర్‌లో కా॥కొర్రపాటి ఆదినారాయణ; ప్రజాతంత్ర ఆటోడ్రైవర్స్ యూనియన్ (నంబూరు)వద్ద కా॥రాచకొండ సాంబశివరావులు అరుణ పతాకాలను ఆవిష్కరించి ఉపన్యసించారు.

## ప్రదర్శన

జెండా ఆవిష్కరణల అనంతరం కార్మికులు పెద్దసంఖ్యలో పాతబస్టాండ్-బస్టాండ్ సెంటర్-అంబేద్కర్ బొమ్మసెంటర్ మీదుగా-ఆటోయూనియన్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.



శ్రీకాకుళంలో జెండా ఆవిష్కరణ



అనంతపురంలో మేడే సభ



అనంతపురంలో మేడే ప్రదర్శన

కార్యక్రమంలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ నాయకులు కామ్రేడ్స్ సానా లక్ష్మయ్య, కాసుల వెంకటపతి, మోరం చంద్రశేఖరరావు, చైతన్య రిక్షా డ్రైవర్స్ యూనియన్ నాయకులు రంగ, సుభాని, ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు నంబూరు రాంబాబు, నంబూరు ప్రభుదాసు, జోజి, కార్యదర్శి నాగేశ్వరరావు, ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షులు దండా ప్రసాద్; దుర్గాప్రసాద్, కె.రవిబాబు, పిడిఎస్‌ఓ నాయకులు ఎస్.కె.బాజీసైదా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పెదకాకాని

మేడే సందర్భంగా పెదకాకానిలో నేషనల్ హైవే వెంబడివున్న సిపిఐ(ఎం.ఎల్) జెండాను పార్టీ నాయకులు కా॥దానబోయిన భాస్కరరావు ఆవిష్కరించారు. అనంతరం ప్రదర్శనగా రజకపాలెం సెంటర్‌కు చేరుకుని, ఆ సెంటర్‌లో ఏపిఎఫ్‌టియు జెండాను కా॥ కె. వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.

## తాడేపల్లి

సిమెంట్ ఫ్యాక్టరీ ఏరియాలోగల బ్రహ్మానందపురంలో సిపిఐ(ఎం.ఎల్) జెండాను కార్మిక నాయకులు కా॥ అబ్రహాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥కొర్రపాటి ఆదినారాయణ మాట్లాడుతూ ఎంతోమంది కార్మికుల చెమట, రక్తంతో తడిసి యాజమాన్యానికి లాభాలను తెచ్చిపెట్టిన కెసిడబ్ల్యును యాజమాన్యం అక్రమ లాకవుట్ చేసి కార్మికులను వీధులపాలు చేసిందనీ, 18 సం॥ల సుదీర్ఘ పోరాటం తర్వాత నేటికీ పాక్షిక పరిష్కారాలే కానీ కార్మికులను న్యాయమైన పరిష్కార మార్గాన్ని పాలకులు, వారి కనుసన్నలలో నడిచే న్యాయవ్యవస్థ చూపలేకపోయాయనీ. కార్మికులను నడిపించేది, హక్కుల సాధనకోసం నిలబెట్టేది కార్మికవర్గ నాయకత్వమే కనుక కార్మిక సోదరులంతా సంఘటితంగా నిలబడాలని, వేతన బానిసత్వం రద్దుకోసం, కార్మికవర్గ రాజ్యాధికార సాధనకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

అనంతరం డోలాస్‌నగర్ సెంటర్‌లోగల-కార్మిక నాయకుడు, కమ్యూనిస్టు విప్లవకారుడు, అమరుడు కా॥పాతర్ల నాగయ్య స్థూపానికి పూలువేసి జోహార్లర్పించారు.

కార్యక్రమంలో కార్మిక నాయకులు కొండయ్య, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లా

## ఒంగోలు

ఒంగోలు ఈమనిపాలెంలో సిపిఐ(ఎం-ఎల్) కార్యాలయం వద్ద పార్టీజిల్లా నాయకులు కా॥ యస్. లలిత కుమారి మేడే అరుణపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం-రైతాంగం మైత్రితో కార్మికవర్గ నాయకత్వాన వ్యవసాయ విప్లవం ఇరుసుగా జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని ఆపై సమసమాజాన్ని విజయవంతం చేయటానికి మేడే సందర్భంగా దీక్ష వహించాలన్నారు.

అనంతరం ప్రదర్శనగా చర్చిసెంటర్ మీదుగా బి.ఎస్.ఎన్.ఎల్. సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సెంటర్‌లో కా॥ చావలి సుధాకర్‌రావు ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఏపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎమ్.ఎస్. శాయి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేస్తున్న స్థితిలో కార్మికులకు ఐక్యపోరాటాలు మినహా మరో పరిష్కార మార్గంలేదన్నారు. బి.ఎన్.ఎన్.ఎల్ నుండి ఎఫ్.ఎన్.టి.యు. నాయకులు జి. విజయకుమార్; ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కా॥ ఐ. విజయసారధి మాట్లాడారు.

ఆర్‌టిసి డిపో ఆవరణలో ఏపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎమ్.ఎస్. శాయి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. తరువాత టుబాకోబోర్డు-2వద్ద టుబాకో ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కా॥ రమణయ్య సంఘం జెండాను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ కోడె వెంకట్రావు, స్త్రీవిముక్తిసంఘటన జిల్లా అధ్యక్షులు కా॥ రేణుక, రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ పి. కోటేశ్వరరావు, కె. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపట్నం

కొత్తపట్నం మండలం వలసపాలెంలో రైతుకూలీసంఘం కార్యాలయం వద్ద కా॥ వి. శ్రీరాములు, కొత్తపట్నం బస్టాండు సెంటర్‌లో కా॥ ఎం.ఎస్. శాయి మేడే సందర్భంగా కార్మికవర్గ ఐక్యపోరాట సంకేతమైన సుత్తీ కొడవలి జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ లలితకుమారి మాట్లాడుతూ పాలకుల ప్రజా జీవన విధ్వంస విధానాలకు వ్యతిరేకంగా మన జీవితాల మెరుగుకోసం మేడే పోరాట స్ఫూర్తితో పోరాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం నాయకులు కా॥ కె. కోటేశ్వరరావు, కా॥ గోపాల వెంకటేశ్వర్లు, శ్రీను, రాఘవరెడ్డి; జనసాహితి నాయకులు కా॥ డి.వి. రెడ్డి, ఎన్.వై.యస్. నాయకులు కా॥ బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వేటపాలెం

వేటపాలెం చిన్నబజారు సెంటరులో ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో మేడే అరుణ పతాకావిష్కరణ జరిగింది. అనంతరం నినాదాలు చేస్తూ ప్రదర్శనగా వేటపాలెం ప్రధాన కూడలివద్దగల అమర వీరుల స్థూపంవద్దకు చేరుకున్నారు. ఆ కూడలిలో సిపిఐ (ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ పింజల వెంకట సుబ్బారావు అరుణపతాక ఆవిష్కరణ చేసి ప్రసంగిస్తూ కార్మికవర్గ చైతన్యాన్ని నిర్వీర్య పరిచేందుకు భారత దళారీ పాలకులు, సామ్రాజ్యవాదులు, రాజకీయ, సాంస్కృతిక దాడిని ఎక్కుపెట్టారని, కార్మికులు వీటిని అధిగమించి సంఘటితపడి కోల్పోయిన హక్కుల సాధన కోసం ఉద్యమించేందుకు, సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ఎపిఎఫ్‌టియు నాయకులు కా॥ నాయని కుటుంబరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కా॥ యారాసు భాస్కర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమానికి ఎపిఎఫ్‌టియు నాయకులు కా॥ నాయని సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరరావు కా॥ పేరిశెట్ల రవికుమార్, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కా॥ బాబు, కా॥ చంద్రమౌళి, కా॥ దేవేందర్ తదితరులు నాయకత్వం వహించారు.

# నెల్లూరు జిల్లా

## నెల్లూరు

మేడే సందర్భంగా నెల్లూరు నగరంలోని జనశక్తి కూడలిలో స్త్రీవిముక్తిసంఘటన జిల్లా కార్యదర్శి కా॥ పి. కొండమ్మ ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాన్ని ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ పి. యానాదయ్య నిర్వహించారు. జనశక్తి నగర్‌లోని పట్టణ పేదలు, వివిధ చేతివృత్తులవారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్థానిక వేదాయపాలెం సెంటర్‌లో 'మేడే' కార్యక్రమాన్ని సింహపురి ఆటోడ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కా॥ ఎ. కృష్ణారెడ్డి నిర్వహించగా ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ పి. యానాదయ్య జెండాను ఆవిష్కరించారు.

స్థానిక సింహపురి సెంటర్‌లో "సింహపురి ఆటో డ్రైవర్స్ యూనియన్" ఆధ్వర్యంలో వారి కార్యాలయం వద్ద ఆటో కార్మికులు మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని సింహపురి ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కా॥ ఇ. లక్ష్మినారాయణ నిర్వహించగా కార్యదర్శి సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు.

ఏపిఎఫ్‌టియు మరియు నగర పట్టణ రోడ్ మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సండేమార్కెట్ కూడలిలోని జెండాను సండేమార్కెట్ కమిటీ అధ్యక్షులు కా॥ టి. రమేష్ ఆవిష్కరించగా ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ పి. యానాదయ్య మాట్లాడారు.

## వెంకటగిరి

మేడే సందర్భంగా స్థానిక పల్లెవీధిలో కామ్రేడ్ కాళహస్తి శేషయ్యగారి భవనం దగ్గర జెండా ఆవిష్కరణ జరిగింది. ఎర్రజెండాను చేనేత కార్మికుడు కా॥ చిన్నయ్య ఆవిష్కరించారు. కళాకారుడు ఆర్. సుబ్బారాయుడు మేడే పాటను పాడి వినిపించారు. ఈ సందర్భంగా ధనుంజయ, ప్రసాద్, రవి మరికొందరు రైతులు, యువకులు పాల్గొన్నారు.

## యాతలూరు

యాతలూరులోని యన్.వి. కృష్ణయ్య స్థూపంవద్ద జెండా ఆవిష్కరణ జరిగింది. జెండా ఆవిష్కరణకు కాళప్ప, ఆనంద్, ఈశ్వరయ్య, గ్రామస్తులు 20 మంది పాల్గొన్నారు. కళాకారుడు సుబ్బరాయుడు జనం పాటలు పాడారు.

ఈ సందర్భంగా ఆర్. సుబ్బారాయుడు మాట్లాడుతూ గతంలో కార్మికులు సాధించుకున్న హక్కులను నేటి దోపిడీవర్గాలు హరించి వేస్తున్నారని దానిలో భాగంగా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ కొనసాగుతున్నదని, ఈ వాస్తవాలను గ్రహించిన కార్మికవర్గం, రైతాంగం దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా పోరాడేందుకు దీక్షపూనాలన్నారు.

# అనంతపురం జిల్లా

## రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.), ఎపిఎఫ్‌టియుల ఆధ్వర్యంలో కుంబరగుండు సెంటర్‌లో మరియు గొందిబావివీధి (మారెమ్మగుడి) వద్ద మేడే జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం కార్యదర్శి సిఎల్‌ఎన్ మూర్తి, పట్టణ పేదల సంఘం కార్యదర్శి డి.రామకృష్ణలు మేడే జెండాలను ఆవిష్కరించారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ బి.తిమ్మారెడ్డి, నవయువ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి కా॥ ఎల్. లక్ష్మీరెడ్డిలు ఈ సందర్భంగా ప్రసంగించారు. అనంతరం బస్టాండువద్ద ఆర్‌టిసి కార్మిక యూనియన్‌లు నిర్వహించిన మేడే కార్యక్రమములో రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ బి.తిమ్మారెడ్డి కార్మికుల నుద్దేశించి ప్రసంగించారు.

మేడే కార్యక్రమాలలో వక్తలు మాట్లాడుతూ కార్మికుల హక్కుల దీక్షాదినంగా మేడే జరుపుకుంటున్నామని, నష్టాల పేరుతో రాయదుర్గం ఆర్‌టిసి డిపోని ఎత్తివేయాలనే మేనేజ్‌మెంట్ ఆలోచనలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. ప్రక్కనే ఉన్న బొమ్మనహాళ్ మండలంలోని శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు సంఘం పెట్టుకొనే హక్కును కాలరాస్తున్నారని, ఫ్యాక్టరీ నుండి వెలువడే భారీ కాలుష్యంతో గత 18 సంవత్సరాలుగా రైతులపంటలు ధ్వంసమౌతున్నాయని, దీనికి వ్యతిరేకంగా నష్టపరిహారం కోసం రైతులు పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు అన్ని సెక్షన్ల ప్రజానీకం పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలన్నారు. ఈ మేడే కార్యక్రమాలలో ఎన్‌వైఎస్ నాయకులు రఘు, రుద్రముని, పిడిఎస్‌ఒ నాయకులు విజయ్‌కుమార్, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు బండ రాముడు తదితరులు పాల్గొన్నారు.

## కణేకల్

3-5-11న మేడే సందర్భంగా కణేకల్ మండల కేంద్రంలో ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో కణేకల్ హమాలీ వర్కర్స్ అసోసియేషన్ ఆఫీసువద్ద కణేకల్ ఆర్‌టిసి బస్టాండ్ వద్ద, ఆటో వర్కర్స్ యూనియన్ సెంటర్‌లో ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న మేడే జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలను హమాలీ వర్కర్స్ అసోసియేషన్ కార్యదర్శి కా॥బి.బిక్కణ్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కా॥నాగరాజులు నిర్వహించారు. హమాలీ ఆఫీసు నుండి ఆర్‌టిసి బస్టాండు వరకు మేడే ప్రదర్శన జరిగింది. మేడే జెండా ఆవిష్కరణల అనంతరం కార్మికుల నుద్దేశించి ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న మాట్లాడుతూ కార్మికవర్గం తమ



హక్కులకోసం పోరాడుతూనే ఈ దోపిడీ వ్యవస్థ మార్పుకోసం జరిగే పోరాటాలకు నాయకత్వం వహించాలన్నారు.

మేడే సందర్భంగా హమాలీ వర్కర్స్ అసోసియేషన్ ఆఫీసుకు కార్మికులు రంగులు వేసుకొని, ఆఫీసు ప్రాంతమంతా ఏపిఎఫ్‌టియు తోరణాలతో అలంకరించుకోగా, ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతమంతా ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికుల తోరణాలతో ఎరుపు మయమైంది. ఈ మేడే కార్యక్రమములో రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు వి.గుత్తన్న బృందం మేడే గీతాలు ఆలపించారు. రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి బి.తిమ్మారెడ్డి, నవయువసమాఖ్య రాష్ట్ర కోశాధికారి ఎల్.లక్ష్మీరెడ్డిలు మేడే కార్యక్రమంలో పాల్గొన్నారు. కణేకల్లు ప్రాంతంలోని గ్రామాలలో హమాలీ యూనియన్‌లు, హమాలీలు ఈ మేడే కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## మేడే సభ

రాయదుర్గం మండలం గ్రామదట్ల గొల్లలదొడ్డి గ్రామ ప్రజల జీవితాలకు, ప్రాణాలకు ముప్పుగా పరిణమించిన సాయి సుధీర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారి కంకర మిషన్ యొక్క అక్రమ భారీ బోరుబ్లాస్టింగ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించి ఆరునెలలుగా కంకర మిషన్ పనులను నిలిపివేసిన గ్రామదట్ల గొల్లలదొడ్డిలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో మేడే సభ జరిగింది. ఈ సభకు సంఘం గ్రామ నాయకులు పెద్ద తిమ్మప్ప అధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా విచ్చేసిన ఎపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న మాట్లాడుతూ కంకర మిషన్ అక్రమ బాంబుబ్లాస్టింగ్‌కు వ్యతిరేకంగా సమైక్యంగా పట్టుదలతో పోరాటం చేసిన ప్రజలను మేడే సందర్భంగా అభినందించారు. బడా పెట్టుబడిదారులు వారి అక్రమ లాభాలకోసం ప్రజల జీవితాలను బలి తీసుకొంటున్నారని, దాంట్లో భాగంగానే కంకర మిషన్ వాళ్ళు భారీబాంబుబ్లాస్టింగ్‌లు జరిపారని, వీరికి స్థానిక పెత్తందార్లు వత్తాసుగా నిలిచారన్నారు. అయితే కంకర మిషన్ యజమానులు ఈ ప్రాంతంలో పెద్దఎత్తున భూములు కొనుగోలు చేసి భారీ ఫ్యాక్టరీని నూతనంగా ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నదని, కావున చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలను కలుపుకొని యాజమాన్యం యొక్క ప్రజావ్యతిరేక విధానాలను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. నవయువ సమాఖ్య రాష్ట్రకోశాధికారి కా॥ ఎల్. లక్ష్మీరెడ్డి, రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ బి. తిమ్మారెడ్డి ఈ బహిరంగసభలో ప్రసంగించారు.

## అనంతపురం

ప్రపంచ కార్మికవర్గ దీక్షాదినం మేడే సందర్భంగా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వివిధ కార్మిక వాడలలోనూ, కూడళ్ళలోనూ ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఎర్రజెండాల ఆవిష్కరణలు, ప్రదర్శనలు, నినాదాలు, బాలకళాకారుల పాటలు, నృత్యాలతో ఎర్రజెండాలు, బ్యానర్లు, తోరణాలతో కోలాహలంగా స్ఫూర్తిదాయకంగా జరిగింది.

స్థానిక మండ్ల సుబ్బారెడ్డినగర్‌లో అరుణపతాకను ఏపిఎఫ్‌టియు రాష్ట్రకమిటి సభ్యులు కా॥సి.ఆర్.ఖాన్; బళ్ళారి బైపాస్ ఆటోస్టాండ్ సెంటర్‌లో ఏపిఎఫ్‌టియు అనుబంధ ఆటో డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి కా॥ఎ.నాగభూషణం; ఆయిల్‌ఫెడ్ హమాలి యూనియన్ సెంటర్‌లో హమాలి యూనియన్ కార్యదర్శి కా॥లక్ష్మీనారాయణ; స్థానిక స్టాలిన్‌నగర్‌లో రజకజన సేవాసంఘం జిల్లా అధ్యక్షులు కా॥పి.చంద్రశేఖర్; రజక్‌నగర్‌లో రజక జన సేవాసంఘం జిల్లాకార్యదర్శి కా॥యస్.లింగప్ప, నాల్గవరోడ్ ఆటో స్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కా॥యస్.నాగభూషణం; ఎపిఎఫ్‌టియు కార్యాలయంవద్ద కా॥సి.ఆర్.ఖాన్; రజనీ బార్ ఆటోస్టాండ్ సెంటర్‌లో ఆటోడ్రైవర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కా॥యస్.బాష; సంఘమేష్ ఆటోస్టాండ్ సెంటర్‌లో ఆటోడ్రైవర్స్



ఒంగోలులో జెండా ఆవిష్కరణ



రేపల్లెలో జెండా ఆవిష్కరణ



నిజామాబాద్‌లో జెండా ఆవిష్క



వేటపాలెంలో జెండా ఆవిష్కరణ



గుంటూరులో జెండా ఆవిష్కరణ


పిడుగురాళ్ళలో జెండా ఆవిష్కరణ



మంగళగిరిలో జెండా ఆవిష్కరణ


నెల్లూరులో జెండా ఆవిష్కరణ

యూనియన్ ఉపాధ్యక్షులు కా॥ఆదినారాయణ; జిల్లా పరిషత్ ఆవరణలోని పంపుమెకానిక్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయితీరాజ్ పంపు మెకానిక్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కా॥ పోతన్న; హెచ్.ఎల్.సి.కాలనీ ఆటోస్టాండ్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికసంఘం కార్యదర్శి కా॥సుధాకర్ అరుణ పతాకాలను ఆవిష్కరించి మేడే మృతవీరులకు ఘన నివాళులర్పించారు.

జెండా ఆవిష్కరణల సందర్భంగా ఆయా సెంటర్లలో హాజరైన కార్మికులు, కాలనీ ప్రజలనుద్దేశించి కార్మిక సంఘ నాయకులు ప్రసంగిస్తూ మన జీవన సమస్యల పరిష్కారానికి, సమాజ మార్పుకీ పీడిత ప్రజలంతా ఎర్రజెండా నీడన సమీకృతమై సంఘటిత సమరశీల పోరాటాలు చేపట్టేందుకు మేడేరోజున దీక్షబూనాలని పిలుపునిచ్చారు.

### ప్రదర్శన-బహిరంగసభ

మేడో రోజున సా॥ఆరుగంటలకు వివిధ కాలనీల ప్రజానీకం, వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు ఎర్రజెండాలు, బ్యానర్లు చేబూని అనంతపురం పట్టణంలోని టవర్‌క్లాక్, రఘువీర్ టవర్, లలితకళా పరిషత్‌ల మీదుగా ఎన్‌జివో హోమ్‌వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన ముందుభాగాన బాలసంఘం కళాకారుల కోలాటం ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

ఏపిఎఫ్‌టియు రాష్ట్రకమిటి సభ్యులు కా॥సి.ఆర్. ఖాన్ అధ్యక్షతన జరిగిన మేడే బహిరంగసభలో ఎన్.జి.వో. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కా॥దేవరాజ్, ఉపాధ్యాయ ఉద్యమనాయకులు కా॥బసవరాజ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కా॥సుధాకర్, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యవర్గ సభ్యులు కా॥సి.ఓబులేసు, ఆటోడ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి కా॥ఎ.నాగభూషణం, రజకజన సేవాసంఘం జిల్లా అధ్యక్షులు కా॥పి.చంద్రశేఖర్, ఎల్.ఐ.సి. ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు కా॥యన్. లింగప్ప ప్రసంగించారు. 1886లో చికాగోలో కార్మికులు చిందించిన రక్తంలో ముంచిలేపిన ఎర్రజెండా నీడన, ఆనాటినుండీ వివిధ దేశాలలో కార్మికవర్గం సమరశీల పోరాటాలతో, ఎన్నో బలిదానాలతో సామాజిక మార్పుకోసం పోరాటం సాగిస్తున్నదనీ, ఆ పోరాట, త్యాగపూరిత వారసత్వాన్ని కొనసాగించేందుకు మేడే గొప్ప ప్రేరణనివ్వాలని వక్తలు తమ ప్రసంగాలలో ఆకాంక్షించారు.

### ఆత్మకూరుమండలం

ఆత్మకూరుమండలం ఎ.కొత్తపల్లి తరిమెల నాగిరెడ్డికాలనీలో మే 5వ తేదీన ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న ఎర్రజెండా ఆవిష్కరణ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగిస్తూ మేడే ప్రాధాన్యతను వివరించారు. ఈ సభలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥పి.హనుమంతు, కా॥నారాయణ యాలేరు, కా॥మల్లిఖార్జున పంపనూరు; తరిమెల నాగిరెడ్డి కాలనీ నాయకులు కామ్రేడ్స్ పెద్దకొండన్న, పార్వతి, శారద; మరియు ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు కా॥రమేష్ పాల్గొని ప్రసంగించారు. యం.యస్.నగర్ బాలసంఘం కళాకారులు జనంపాటలు, కోలాటం ప్రదర్శించారు. అమరుల ఆశయాల్ని కొనసాగిస్తామని నినదిస్తూ సభను ముగించారు.

## కరీంనగర్ జిల్లా

### బావుపేట

ప్రపంచ కార్మికవర్గ దీక్షాదినం మేడే సందర్భంగా కరీంనగర్ జిల్లా బావుపేట మండల కేంద్రంలో ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో కార్మికుల ప్రదర్శన, బహిరంగ సభ జరిగాయి.

### ప్రదర్శన-బహిరంగ సభ

ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శన, బహిరంగసభలకు జిల్లాలోని వివిధ గ్రానైట్ పరిశ్రమల నుండి, స్టోన్‌క్రషర్స్, సైజింగ్ పరిశ్రమల నుండి, క్లాత్‌డైయింగ్ పరిశ్రమల నుండి పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. కరీంనగర్‌లోని ఈ పరిశ్రమలలో పనిచేసే తమిళనాడు, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఝూర్ఖండ్, బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు, మన రాష్ట్రానికి చెందిన తెలుగు కార్మికులతోపాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, రైతుకూలీలు మొత్తంగా నాలుగు వేలమందితో బావుపేట ప్రధాన వీధుల గుండా ఎర్రజెండాలు, బ్యానర్లతో, ప్రజాకళాకారుల ఆట, పాటలతో, డప్పుల నృత్యాలతో ఆసాంతం ప్రదర్శన స్ఫూర్తిదాయకంగా సాగింది. గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

ప్రదర్శన అనంతరం బావుపేట కూడలిలోని కార్మికోద్యమ నాయకుడు కా॥ ఎన్.వి. కృష్ణయ్య విగ్రహానికి ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు, మరియు గ్రానైట్ అండ్ క్వారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కా॥ వి. కిషోర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత కా॥ వి. కిషోర్ మేడే పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు జోహార్లర్పించారు.

అనంతరం జరిగిన మేడే బహిరంగసభకు ఎన్.వై.ఎస్. నాయకులు కా॥ బామండ్ల రవీందర్ అధ్యక్షత వహించగా కా॥ సి.పెద్దన్న తొలుత ప్రసంగిస్తూ ప్రపంచవ్యాపితంగా పీడిత ప్రజానీకంలోని తీవ్రమైన అలజడి, ఆందోళనలు వివిధ రకాల పోరాటాలుగా రగుల్కొంటున్నాయనీ, మన దేశంలోనూ పాలకుల దోపిడీ విధానలపై సాగిస్తున్న పోరాటాలన్నీ ఏకోన్ముఖంగా భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ అంతం దిశగా ఎక్కుపెట్టాలన్నారు.

రిటైర్డ్ అసిస్టెంట్ లేబర్ కమీషనర్ శ్రీ సి.హెచ్. చంద్రంరాజు మరియు న్యాయవాది ఆర్. సురేష్‌బాబు కార్మిక చట్టాల సవ్యాపసవ్యతలపై ప్రసంగించారు. కార్మిక అనుకూల చట్టాల అమలుకు కూడా పోరాటం చేయవలసిన అవసరముందన్నారు. కరీంనగర్‌జిల్లా గ్రానైట్‌అండ్ క్వారీ, సైజింగ్, డైయింగ్, గ్రానైట్, పాలిష్, మరియు స్టోన్ క్రషర్స్ యూనియన్ అధ్యక్షులు కా॥ వి. కిషోర్ మాట్లాడుతూ కార్మికులు తమ సంఘటిత శక్తిని ప్రదర్శించటం ద్వారానే మెరుగైన ఒప్పందాలను చేసుకోగలుగుతారనీ, శ్రమకు తగిన ఫలితం సాధనకోసం పోరాట మార్గాన సాగుదామని పిలుపునిచ్చారు.

మేడే కు దాదాపు రెండు వారాల ముందు నుండీ మేడే కార్యక్రమాన్ని వివరించే తెలుగు, హిందీ, పోస్టర్స్; మేడే కరపత్రాలతో కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాల, గంగాధర, రామడుగ, చొప్పదండి, సుల్తానాబాద్, హుజూరాబాద్, హుస్నాబాద్; కరీంనగర్ పరసరాలలోని 150 గ్రానైట్స్, 30 స్టోన్ క్రషర్స్, 20 సైజింగ్ పరిశ్రమలు మరియు 200 క్లాత్ డైయింగ్ యునిట్స్‌లో, 40 గ్రానైట్స్ పాలిషింగ్ యూనిట్స్‌లో కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించడం ద్వారా మేడే నాటికి పెద్ద ఎత్తున కార్మికులను కార్యక్రమానికి సన్నద్ధం చేశారు. బహిరంగసభలో ప్రజాకళాకారుల నృత్యాలు, మేడే గీతాలు కార్మికులను ఆకట్టుకున్నాయి.

## వరంగల్‌జిల్లా

మేడే రోజున దుగ్గొండి మండలంలోని న్యూ ముబారక్, వినాయక, లక్ష్మీసాయి, ప్లైయాష్ పరిశ్రమల ఆవరణలలో మేడే జెండాలను ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఎగురవేశారు. ముఠా మేస్త్రీలు ఇట్టబోయిన స్వామి, సార రాములు, రాజు, పెద్దిరాజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నల్లబెల్లి మండల కేంద్రంలో భార్గవి, అన్నపూర్ణ ఇండస్ట్రీస్‌లలో ముఠా మేస్త్రీలు వైనాల సదానందం, కొండ రవి మేడే జెండాలను ఎగురవేశారు.

రాజుపేట ఏరియాలోని శ్రీసాయి, హరిక్రిష్ణ, హేమంతి, లక్ష్మీ జిన్నింగ్ ఇండస్ట్రీస్‌లలో ముఠామేస్త్రీలు ముత్తినేని లక్ష్మయ్య, ఆర్.మల్లయ్య, బొల్లి శ్రీను, చింతల యాకయ్యలు మేడే జెండాలను ఆవిష్కరించారు.

చింతగడ్డ తండా ఏరియాలోని ఉమాశంకర్, రూపా, ఉషాకిరణ్ ఇండ్రస్ట్రీస్‌లలో ముఠామేస్త్రీలు మేంరిడు శ్రీను, మోతీలాల్, నర్సింహా మేడే జెండాలను ఎగురవేశారు.

మహేశ్వరం ఏరియాలోని అశోకా, బండారి, తారక ప్రభు, విఘ్నేశ్వర, ఉమాపతి ఇండస్ట్రీస్ మరియు శ్రీలక్ష్మీ, ధనలక్ష్మీ ఫైయాష్ ఇండస్ట్రీస్‌లలో ముఠా మేస్త్రీలు అయిన మర్రి సాంబన్న, రవి, దూదన్న, బుచ్చన్న, నర్సయ్య, సాంబిరెడ్డి, దండు సదయ్యలు మేడే జెండాలను ఎగురవేసి మేడేను స్ఫూర్తిదాయకంగా జరుపుకున్నారు.

నెక్కొండ మండలంలోని ధనలక్ష్మీ, చెన్‌ముఖ కాటన్ ఇండస్ట్రీస్‌లలో మార్కెట్ హమాలీ ముఠామేస్త్రీలు మేండె మల్లయ్య, మహేందర్, సుధాకర్, భైరు నర్సయ్యలు జెండాలను ఎగురవేశారు. ద్వారకపేట ఏరియా ఎంజెఆర్ ఇండస్ట్రీస్‌లో ముఠామేస్త్రీ రొట్టె శ్రీనివాస్ జెండాను ఎగురవేశారు.

పెద్ద కొర్పోలు గ్రామంలో పాలేరుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకుడు వెంకన్న మేడే జెండాను ఎగురవేశారు.

తిమ్మంపేట, రేఖంపల్లి గ్రామాలలోని ఆటో కార్మికులు మేడే సందర్భంగా అరుణ పతాకాలను ఎగురవేశారు. ఏపిఎఫ్‌టియు నాయకులు రాజ్‌కుమార్, తిప్పశంకర్, ఈసంపెల్లి బాబులు ఈ మేడే జెండాలను ఎగురవేశారు. తిమ్మంపేట గ్రామ హమాలీలు ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో మేడే జెండాను ముఠామేస్త్రీ కత్తిరాములు ఆవిష్కరించారు.

మేడపల్లి, ఆగురవెల్లి గ్రామాలలో మేడే జెండాలను కా॥దండెం శంకర్, భూక్య వీరన్న, కోదాటి వెంకన్నలు ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మికులు ప్రదర్శనలు నిర్వహించి మేడే వర్ధిల్లాలి, ప్రపంచ కార్మికులారా ఏకం కండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశాలకు కా॥ మోడెం మల్లేశం హాజరై మేడే ప్రాధాన్యతను వివరించారు.

ఖిలా వరంగల్‌లో ఆటో కార్మిక సంఘం నాయకుడు కా॥సంగినేని సతీష్ మేడే జెండాను ఎగురవేయగా ఏపిఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు భైరబోయిన ఐలన్న హాజరై మేడే ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కా॥ఆర్.క్రిష్ణ, ఇ.క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రదర్శన

మేడే రోజున ఆయా ఇండస్ట్రీస్‌వద్ద మేడే జెండాలను ఎగురవేసి 800మంది కార్మికులు నర్సంపేటలోని పాఖాల సెంటర్‌కు ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. అనంతరం కార్మికులు ఎర్రజెండాలు చేతపట్టుకుని వరంగల్ క్రాస్‌రోడ్‌వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప, అంటూ పట్టణమంతా మారుమోగే విధంగా నినదించారు. ఈ ప్రదర్శనకు ముందుభాగాన అరుణోదయ ప్రజాకళాకారులు, బాలకళాకారులు నృత్యాలు నిర్వహించారు. మేడే ప్రదర్శనలో నృత్యాలు, పాటలు నర్సంపేట ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన వరంగల్ రోడ్‌కు చేరుకున్న అనంతరం చౌరస్తాలో కార్మికులనుద్దేశించి సంఘం జిల్లా కార్యదర్శి కా॥ మోడెం మల్లేశం మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని కోసం, ఇతర సౌకర్యాలకోసం వీధులలోకి వచ్చి పోరాడితే ఆ కార్మికులపై పోలీసులు కాల్పులు జరిపి కార్మికులను కాల్చిచంపారనీ. ఈ జెండా నీడలో అనేక దేశాలలో పోరాడి తమ హక్కులను సాధించుకున్న ఘనత పేద కార్మిక వర్గానికి వుందనీ, ఆ అమరవీరుల త్యాగాలను వృధాకాకుండా వారి ఆశయ లక్ష్యమైన కార్మికవర్గ రాజ్యంకోసం నిత్యం పోరాడి మన కార్మికుల హక్కులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ మేడే కార్యక్రమ నిర్వహణలో కా॥ ఎం.ఎస్. యాకూబ్, ఈర్లపైడి, బి.అశోక్, జె.తిరుపతి, గౌరయ్య, కందిక రమేష్, వినోద్, మోడెం శ్రీలత, పారిజాతం, శంకర్, రుద్రారపు ఎల్లన్న, కళాకారులు కా॥పాపన్న, ప్రసాద్, రాములు, రామ్‌చందర్, వినోద్, శివ, రాజ్‌కుమార్, బాబన్న తదితరులు పాల్గొన్నారు.

'మేడే' నిర్వహణకు ముందుగా 16-4-11న మహేశ్వరం గ్రామం అశోకా ఇండస్ట్రీస్ వద్ద కార్మికులు ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న హాజరై కార్మికుల హక్కుల, పోరాట చరిత్రను, పాలకుల విధానాలను వివరించారు. ఈ సమావేశానికి ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥భైరబోయిన ఐలయ్య అధ్యక్షత వహించగా సంఘం జిల్లా నాయకులు మోడెం మల్లేశం, యాకన్న ప్రసంగించారు. మేడే కార్యక్రమానికి సన్నద్ధంచేసే దానిలో భాగంగా జిల్లాలోని గిర్నిబావి, నల్లబెల్లి, నెక్కొండ, మహేశ్వరం, రాజంపేట, చింతగడ్డ తండా ప్రాంతాలలోని కార్మికులతో విస్తృత సమావేశాలను నిర్వహించారు. వేలాది కరపత్రాలు, పోస్టర్లతో మేడేకు ముందుగా కార్మిక కేంద్రాలలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

## నిజామాబాద్ జిల్లా

**రైతుకూలీసంఘం** ఆధ్వర్యంలో నిజామాబాద్ మండలంలో మాధవనగర్, కేశాపూర్‌లలో మేడే కార్యక్రమాలు నిర్వహించారు.

మాధవనగర్, కేశాపూర్‌లో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కా॥ గంగుల నర్సయ్య ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి కా॥ నర్సయ్య మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని డాంబికాలు పలుకుతున్న ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించక మరింత జటిలం చేస్తున్నదని, జిల్లాలో అత్యధికంగా బీడీ కార్మికులు నిలువుదోపిడీకి గురవుతున్నారనీ, కనీస వేతనం 130 రూ॥ చేయాలని 32 రోజులు సమ్మెచేస్తే, ప్రభుత్వం బీడీ యాజమాన్యాలతో కుమ్మక్కయి కార్మికులకు అన్యాయంచేసిందన్నారు. రైతుకూలీ, కార్మికులంతా సంఘటిత పోరాటలకు దీక్ష వహించాలన్నారు.

ఈ కార్యక్రమాలలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ కె. గంగాధర్, మారుతి, రజియా, నర్సాగౌడ్, రైతుకూలీసంఘం సభ్యులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ◈


బందరులో బాలకళాకారుల పాటలు


బందరులో జెండా ఆవిష్కరణ


విజయవాడలో జెండా ఆవిష్కరణ


అనకాపల్లిలో మేడే సభ

# పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ప్రాంతీయ సదస్సులలో ఆమోదించిన తీర్మానం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు విద్యుత్ రంగాన్ని ప్రజలకు భారంగా, ప్రైవేటు సంస్థలకు లాభంగా మార్చివేస్తున్నాయి. ఛార్జీల పెంపుదల, సబ్‌స్టేషన్ల ప్రైవేటీకరణ, మర్చెంట్ పవర్‌ప్లాంట్ల అనుమతులు మొదలగు నిర్ణయాలు వినాశకర ఫలితాలను సృష్టించనున్నాయి.

ప్రస్తుతం 200 యూనిట్లలోపు ఛార్జీలు పెంచలేదు. 200-300 మధ్య పెరిగిన ఛార్జీలకు ప్రభుత్వం సబ్సిడీ భరిస్తున్నదని చెపుతున్నప్పటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఛార్జీల భారం ప్రజలందరిపై పడనున్నది. రూ.61.30 కోట్ల భారం నెలకు 300 యూనిట్లు పైగా వాడే వినియోగదారులపై పెరుగుతుంది. సేవాఛార్జీల పేరిట రూ.311.06 కోట్లు వినియోగదారులందరిపైన భారం పడుతున్నది. మొత్తంమీద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.641.5 కోట్ల మేర ఛార్జీలు పెరిగాయి. ఫ్యూయల్ సర్‌ఛార్జి సర్దుబాటు పేరిట ఇప్పటికే వినియోగదార్ల నుండి 2008-09 సంవత్సరాలకు రూ.1649 కోట్లు వసూలు చేస్తున్నారు. 2009-10 సంవత్సరంకు 1439 కోట్లు, 2010-11 సంవత్సరంలో మొదటి 9 నెలల కాలానికి 1286.13 కోట్ల మేరకు ఫ్యూయల్ సర్‌చార్జ్ సర్దుబాటు క్రింద వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ 4 డిస్కాంలు దాఖలు చేసిన క్లెయిమ్‌లపై రెగ్యులేటరీ కమిషన్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. 2006-07 నుండి 2008-09 వరకు వినియోగదార్ల నుండి ఇంకా 1511 కోట్ల రూపాయల మొత్తాన్ని వసూలు చేసుకునేందుకు ట్రూఅప్‌గా అనుమతించాలన్న పిటిషన్లు కూడా కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి భారాలు ఇంకా పడే అవకాశం ఉంది. పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులపై పెరిగిన భారం అంతిమంగా సామాన్య ప్రజలపై పడుతుంది.

వీధి దీపాల కరెంట్ బిల్లులే చెల్లించలేని పంచాయితీలపై ఛార్జీలు వడ్డించడం అవగాహనా రాహిత్యమే. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు బిల్లులు కట్టలేకపోతే మూలనపడ్డట్లే. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక బోరుబావులతో వ్యవసాయంజేసే రైతుల పంటలు ఎండిపోతున్నాయి. కోతలు లేకుండా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలి.

ఒకవైపు ప్రజలమీద చార్జీల భారం మోపుతూ, విద్యుత్ సంస్థలకు నష్టం కల్గించి ప్రైవేటు సంస్థలకు లాభం కల్గించే పద్ధతిలో విద్యుత్ రంగంలో అనేక హానికర నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుంటున్నది. విద్యుత్ కొరత కాలంలో బహిరంగ మార్కెట్టులో ఈ వేసవిలో విద్యుత్‌ను యూనిట్టుకు దాదాపు రు.5 లకు కొనుగోలు జేస్తున్నారు. 4 గ్యాస్ ఆధారిత ప్రైవేటు విద్యుత్ కంపెనీలను 20 శాతం విద్యుత్‌ను బహిరంగ మార్కెట్టులో అమ్ముకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అధిక ధరలకు బయట కంపెనీలను అమ్ముకోనిస్తూ ఎక్కువ ధరకు విద్యుత్ సంస్థలు బయటకొనుక్కోవడంలో ప్రైవేటు సంస్థల లాభానికి ప్రభుత్వ రంగాన్ని బలిచేయడమే.

ప్రైవేటు విద్యుత్ సంస్థలకు గ్యాస్ లేనప్పుడు ప్రత్యామ్నాయ ఇంధనాన్ని వినియోగించుకోవచ్చున్న అంశాన్ని కొనుగోలు, ఒప్పందాల నుండి తొలగించాలి. గ్యాస్ లేక ఉత్పత్తి ప్రారంభించని కంపెనీలకు ఫిక్సెడ్ ఛార్జెస్‌ను చెల్లించాల్సిన అవసరంలేదు. ప్రైవేటు కంపెనీలు కోరినట్లుగా ఫిక్స్‌డ్ ఛార్జెస్ చెల్లిస్తే సుమారు రు.3000 కోట్ల అదనపు భారం ప్రజలపై పడుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో ప్రైవేటు సంస్థల కనుకూలంగా కాకుండా, ప్రజల ప్రయోజనానికనుగుణంగా వ్యవహరించాలి. రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత పవర్ ప్లాంట్లకు తగినంత గ్యాస్ అందడంలేదు. రిలయన్స్, ఇతర గ్యాస్ ఉత్పత్తి సంస్థల్లో మన ప్లాంట్లకు గ్యాస్ తప్పకుండా సరఫరా జేసేట్లు చర్యలు తీసుకోవాలి.

విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమౌతున్నది. ప్రతి డిస్కం పరిధిలో ఒక్కో సబ్‌స్టేషన్‌ను ఫ్రాంఛైజీల పేరుతో అప్పగించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రయోగాత్మకంగా విజయనగరంలో ఒక సబ్‌స్టేషన్‌ను అప్పగించింది. బాగా నష్టాల్లో వున్న సబ్‌స్టేషన్‌లను ఫ్రాంఛైజీలకు అప్పగించాలని ఈఆర్‌సి విద్యుత్ విధానం 2010-11లో సూచించింది. సబ్‌స్టేషన్లను ప్రైవేటీకరించాలని ప్రపంచబ్యాంకు గతంలో చేసిన సిఫార్సు మేరకు ప్రభుత్వం ముందుకు కదులుతోంది. ఒరిస్సా, మహారాష్ట్రలలో ఈ విధానాల అమలుతో వ్యతిరేక ఫలితాలు వచ్చాయని, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చిందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ప్రభుత్వం సబ్‌స్టేషన్‌ల ప్రైవేటీకరణకోసం జేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలి.

రాష్ట్రంలో 20వేల మెగావాట్లకు పైగా సామర్థ్యంతో బొగ్గు, గ్యాస్ ఆధారిత ప్రైవేటు థర్మల్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు, మద్దతునివ్వడానికి సన్నాహాలు జేస్తున్నది. ఈ ప్రాజెక్టులలో ఎక్కువభాగం శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాలలో వున్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని ఏడు మండలాల్లో 18000 మెగావాట్ల సామర్థ్యం (కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం 2వేల మెగావాట్లతో కలిపి) కల్గిన ఏడు విద్యుత్ ప్లాంటులకు అనుమతిచ్చినట్లు తెలుస్తున్నది. జిల్లాలో సోంపేట మండలం బీల ప్రాంతంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకోసం 1100 ఎకరాలను, కాకరాపల్లిలో ఈస్ట్‌కోస్టు పవర్‌ప్లాంట్ నిర్మాణానికి 3333.45 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. నెల్లూరుజిల్లాలో 22 విద్యుత్ ప్రాజెక్టులకుగాను వివిధ కంపెనీలకు దాదాపు 15వేల ఎకరాలను ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలో సుమారు 30వేల మెగావాట్ల పైగా సామర్థ్యం కల్గిన విద్యుత్ ప్లాంట్లకు అనుమతులు, ప్రతిపాదనలు వున్నాయి. విజయనగరం జిల్లాలో ఒకటి, ప్రకాశంజిల్లా నాగులుప్పలపాడు మండలంలో మరోటి, కృష్ణాజిల్లాలో ఒకటి ప్రతిపాదనలు వున్నాయి. వీటికి కారుచౌకగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను ప్రభుత్వం ధారాదత్తం చేస్తున్నది. నిరసన తెలిపిన బాధితులపై నిర్బంధం ప్రయోగిస్తున్నది. హిందూజా సంస్థకు విశాఖ జిల్లాలో విద్యుత్ కేంద్రానికి 1123 ఎకరాలు తీసుకొని 19 సంవత్సరాలయినా, ఇప్పటికీ ప్లాంటు నిర్మాణం జరగలేదు. భూములను స్వాధీనం చేసుకోకుండా ఆ సంస్థకే అప్పగించాలని ప్రభుత్వం జూస్తున్నది.

ప్రాజెక్టులకు అప్పగిస్తున్న భూములు ప్రజలవి. కాలుష్యం ప్రజలకు. ఈ మర్చంట్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్తు ఎక్కడైనా, ఏ రేటుకైనా అమ్ముకోవచ్చు. లాభాలు తీసుకోవచ్చు. ప్రజల భూములు, ప్రభుత్వ భూములలో విద్యుత్తు ఉత్పత్తిచేస్తూ ఆ ప్రజలకు చౌకగా సరఫరా చేయకుండా, కాలుష్యం పంచి పెడుతూ నష్టంజేసే ఈ పవర్‌ప్లాంటులను ఎందుకు అనుమతించాలి? వాటికి వేల ఎకరాల భూమి ఎందుకివ్వాలి? మన రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా జెన్‌కో ఆధ్వర్యంలో అనువైన చోట్ల విద్యుత్ ప్లాంట్లను చేపట్టాలి. మర్చంట్ పవర్‌ప్లాంట్ల అనుమతులు రద్దుచేయాలి. కొవ్వాడలో అణువిద్యుత్ కర్మాగారం ఏర్పాటు చేయడాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. జపాన్‌లో అణువిద్యుత్ కర్మాగారంలో జరిగిన ప్రమాదం అందరికీ ఒక హెచ్చరిక ఈ నేపథ్యంలో అణుకర్మాగార నిర్మాణాన్ని నిలిపివేయాలి.

2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచినపుడు పెల్లుబికిన ఆగ్రహం, బషీర్‌బాగ్ ఉద్యమం పర్యవసానంగా విద్యుత్ ఛార్జీలను పెంచడానికి ప్రభుత్వాలు సాహసించలేదు. రాబోవు ఐదేళ్ళు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ప్రజలకు ఎన్నికల సందర్భంగా వాగ్దానంచేసి, ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన తర్వాత ఛార్జీలను పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించింది. ప్రపంచబ్యాంకు ఆదేశాలమేరకు విద్యుత్ రంగాన్ని క్రమంగా ప్రైవేటుకు అప్పగించడం, ప్రజలపై భారాలను వేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

ఈ క్రింది చర్యలను తక్షణం తీసుకోవాలని ప్రాంతీయ సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

**డిమాండ్లు:**

1. పెంచిన విద్యుత్ ఛార్జీలను, యూజర్, సర్వీసు ఛార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలి. 2. ప్రైవేటు విద్యుత్ సంస్థలు బయట అమ్ముకునే అవకాశాన్ని రద్దుచేయాలి. 3. కెజి బేసిన్‌లోని రిలయన్స్, ఇతర సంస్థల గ్యాస్ ఉత్పత్తిని ముందుగా మన అవసరాలకు పూర్తిగా కేటాయించాలి. 4. సబ్‌స్టేషన్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలి. 5. మర్చంట్ పవర్ ప్లాంట్ల అనుమతులను రద్దుచేయాలి. భూములను స్వాధీనం చేసుకోవాలి. కొవ్వాడ అణుకర్మాగార నిర్మాణాన్ని నిలిపివేయాలి. 6. కోతలు లేకుండా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలి. 7. పిపిఎ లలో ప్రత్యామ్నాయ ఇంధన క్లాజును తొలగించాలి. 8. క్రొత్త విద్యుత్ ప్లాంట్‌లకు ఫిక్సెడ్ చార్జీలను చెల్లించే ప్రయత్నాలను విరమించుకోవాలి.

| | | |
|---|---|---|
| సిపిఐ | సిపిఐ(ఎం) | యంసిపిఐ(యు) |
| సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ | సిపిఐ(ఎం.ఎల్)రామన్నగౌడ్ | సిపిఐ(ఎం.ఎల్) |
| ఫార్వర్డ్‌బ్లాక్ | ఎస్‌యుసిఐ(సి) | సిపిఐ(ఎం.ఎల్)లిబరేషన్ |
| ఎంఎల్ కమిటీ | | ఆర్‌ఎస్‌పి |

# పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ప్రాంతీయ సదస్సులు


వరంగల్ సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ గుర్రం విజయకుమార్; సదస్సుకు హాజరైన ప్రతినిధులు

**వరంగల్, 28-4-11:**
పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 11 రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సదస్సు అనంతరం రాష్ట్రంలోని విశాఖపట్నం, తిరుపతి, వరంగల్‌లలో ప్రాంతీయ సదస్సులు జరపాలనే నిర్ణయం మేరకు ఆయా ప్రాంతాలలో సదస్సులు జరిగాయి.

వరంగల్-హన్మకొండలోని పబ్లిక్ గార్డెన్స్ ఆవరణలోగల నేరెళ్ళ వేణు మాధవ్ హాల్‌లో ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈసదస్సుకు కా॥ తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు (సిపిఐ), కా॥జి.నాగయ్య (సిపియం), కా॥గాదగోని రవి (ఎంసిపిఐ-యు), కా॥ ఎం. శ్రీనివాస్ (సిపిఐఎంఎల్- ఎన్‌డి), కా॥వోడెం మల్లేషం (సిపిఐ-ఎం.ఎల్), కా॥ జి. రాములు (సిపిఐ-ఎంఎల్), ఈసంపెల్లి వేణు (ఫార్వర్డ్ బ్లాక్), కా॥ఆర్.గోవింద్(ఆర్‌ఎస్‌పి)లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ ప్రాంతీయ సదస్సులో ఇతర పార్టీల రాష్ట్ర నాయకులతోపాటు సిపిఐఎంఎల్-రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్ హాజరై ప్రసంగించారు.

'2000 సం॥లో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచగా ఆనాడు 9 రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రవ్యాపిత ఉద్యమం జరిగిందనీ, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా బషీర్‌బాగ్‌వద్ద పోలీసులు జరిపిన కాల్పులలో ముగ్గురు ఉద్యమకారులు ప్రాణాలను కోల్పోయారనీ, ఆ ఉద్యమ ప్రభావంతో అనంతరం జరిగిన ఎన్నికలలో ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి తగిన బుద్ధి చెప్పారనీ, ఆ తరువాత రైతులకు ఉచిత కరెంట్, కరెంట్ ఛార్జీలు పెంచననే వాగ్దానాలతో కాంగ్రెస్‌పార్టీ వైఎస్‌ఆర్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిందనీ, అతని మరణానంతరం రోశయ్య తర్వాత అధికారం పొందిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాత్రం మళ్లీ విద్యుత్ ఛార్జీలు పెంచి దీనివలన సామాన్యులపై భారం పడబోదని ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటే విధముగా పెంచి ప్రజలను పీడించి పన్నులు విధించి ఆర్థికంగా చితకకొడుతూ ఉండగా మరోదిక్కు ఈ విద్యుత్ ఛార్జీలు పెంచటం మూలంగా రాష్ట్రప్రజలపై అదనపు భారం పడుతున్నదన్నారు. కావున మన రాష్ట్రప్రజలంతా, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, విద్యుత్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాపితంగా బలమైన పోరాటాన్ని కొనసాగించి పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించుకోవాలని పిలుపుచ్చారు. ఇంకా ఈ సదస్సు నుద్దేశించి సిపిఎం రాష్ట్ర నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, సిపిఐ నాయకులు వెంకట్రాములు, ఎంసిపిఐ నాయకులు వర్ణం వెంకటరెడ్డి, సిపిఐఎంఎల్-ఎన్‌డి నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐఎంఎల్-నాయకులు భూతం వీరన్న, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు మురళీధర్ దేశ్‌పాండే, ఎస్‌యుసిఐ నాయకులు సిహెచ్.మురహరి, లిబరేషన్ నాయకులు మూర్తి పాల్గొని మాట్లాడారు. చివరగా విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సదస్సు తీర్మానాన్ని ఆమోదించింది.

**కోటిఫాం థర్మల్...** (చివరి పేజీ నుండి)

తీసుకోవాలని, పరిశ్రమల స్థాపనకైనా ప్రజల అనుమతి తప్పనిసరిగా ఉండేలా చేయాలని డిమాండ్ చేశారు.

రైతుకూలీసంఘం (అం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సి మాట్లాడుతూ ఆనాడు బ్రిటీష్ వలస వాదులు మన దేశం నుండి దోచుకున్న సంపదలను తమ దేశానికి సులభంగా తరలించేందుకు; వారి దేశంలో తయారైన సరుకులను అత్యధిక లాభాలకు మన దేశంలో అమ్మి సొమ్ము చేసుకునేందుకు, మన దేశానికి దిగుమతి చేసేందుకోసమే రోడ్లు, రైల్వేలు, నౌకాశ్రయాల నిర్మాణం చేపట్టారనీ, దీనినంతా మన దేశ అభివృద్ధికోసం తాము చేపట్టిన చర్యలుగా చెప్తూ వంచనకు పాల్పడ్డారనీ; 63 సం॥ల పాలన అనంతరం నేటి పాలకులు కూడా సామ్రాజ్యవాదుల విచ్చలవిడి దోపిడీకి రాచబాటలు వేస్తూ ఆధునిక రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు నిర్మాణంచేస్తూ అభివృద్ధి పేరిట ప్రజాజీవన విధ్వంసంగావిస్తున్నారని పేర్కొన్నారు. నేడు థర్మల్, అణువిద్యుత్ కేంద్రాల పేరుతో సాగుతున్న చర్యలన్నీ జల, వాయు కాలుష్యాన్ని పెంచి ప్రజల జీవితాలను హరించివేసేవేగాక సామ్రాజ్యవాదుల దోపిడీ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో నిరాటంకంగా సాగేందుకు, మరింత విచ్చలవిడిగా సాగేందుకు ఉపయోగపడేవేనని అన్నారు. పాలకవర్గాలన్నీ ఈ దోపిడీ విధానాల్ని సమర్థించేవే గానీ ప్రజల ప్రయోజనాల్ని కాపాడేవి కాదని అన్నారు. ప్రజలు తమ హక్కుల కోసం, జీవనం కోసం పోరాడటం మినహా మరో మార్గం లేదని అన్నారు. కనుక ఈ థర్మల్ కేంద్ర వ్యతిరేకపోరాటం కేవలం ఈ ప్రాంత రైతుల, గిరిజనుల, పేదవర్గాల సమస్యేగాక మొత్తం దేశప్రయోజనాలకే వ్యతిరేకమైనదని అన్నారు.

ఈ సదస్సులో లోక్‌సత్తా కురుపాం ఏరియా నాయకులు రవికుమార్, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ, శ్రీకాకుళం జిల్లా నాయకులు కా॥ తాండ్ర అరుణ, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ గణేష్ పండాలు పాల్గొని ప్రసంగించారు.





కాపీలకు:
మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ



Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2010-12

# ‘వేతన బానిస వ్యవస్థ రద్దుకోసం, కార్మికవర్గ రాజ్యస్థాపనకోసం సంఘటిత పోరాటాలలకు పూనికవహిద్దాం’

## ప్రపంచ కార్మికవర్గ దీక్షాదినం ‘మేడే’ సందర్భంగా కష్టజీవుల ప్రతిన

మేడే సందర్భంగా ‘పెరుగుతున్న ధరలు-తరుగుతున్న నిజవేతనాలు, అభివృద్ధిపేరుతో భూపందేరాలు, అవినీతి అక్రమార్జనలకు వ్యతిరేకంగా పోరాడేందుకు దీక్షపూనుదాం’ అని ఏపిఎఫ్‌టియు ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలలో కార్యక్రమాలు జరిగాయి. సిపిఐ(ఎం.ఎల్), ఏపిఎఫ్‌టియు, రైతుకూలీసంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, రైతుకూలీలు, కష్టజీవులు మేడే జెండా ఆవిష్కరణలు, సమావేశాలు, ప్రదర్శనలు, బహిరంగసభలు నిర్వహించారు. ఏపిఎఫ్‌టియు ప్రచురించిన మేడే కరపత్రాలతో కార్మిక కేంద్రాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. – సంపాదకుడు

### శ్రీకాకుళంజిల్లా

#### శ్రీకాకుళం

శ్రీకాకుళం పట్టణంలో చౌదరి సత్యనారాయణ కాలనీలో శ్రామిక ప్రజానీకం మేడే కార్యక్రమాన్ని ఉత్తేజపూరితంగా జరుపుకొన్నారు. సీనియర్ ఉపాధ్యాయ ఉద్యమనాయకులు కా॥బి.అప్పయ్యగారు మేడేజెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ చికాగోలో ఎర్రజెండా ఎగిరిన చరిత్రనీ, రష్యా, చైనాల్లో ఎగిరిన ఎర్రజెండానీ, 8గం॥ల పనిదినం సాధించిన ఎర్రజెండా శక్తినీ వివరిస్తూ కాలనీలో శ్రామికదినం ఇంకా ఇంకా నిబద్ధతతో, పోరాట చైతన్యంతో జరుపుకోవాలని, హక్కుల్ని కాపాడుకొంటూ, సమ సమాజ స్థాపనకేసి అడుగు ముందుకు వెయ్యాలని ఆకాంక్షించారు.

కా॥ కె.భానుమూర్తి మాట్లాడుతూ మేడే-దసరా, దీపావళి, సంక్రాంతుల వంటి పండుగ కాదనీ కష్టజీవుల హక్కుల సాధనకై పోరాడి ప్రాణాలర్పించిన దినమని చెపుతూ ప్రతి ఇంటినుండీ మేడేని సొంతం చేసుకొని ఎర్రజెండా నీడలో పోరాట చైతన్యాన్ని పొందాలని పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం నాయకురాలు కా॥టి.అరుణ మేడే కార్యక్రమాన్ని వివరిస్తూ కాలనీలోని శ్రామిక జనం శ్రీకాకుళ పట్టణానికే దీటుగా కష్టజీవుల సంఘటిత శక్తిని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి ఛాయరాజ్, ప్రజాసాహితి సంపాదకులు పి.ఎస్.నాగరాజు పాల్గొన్నారు. ప్రజాకళాకారులు, బాల సంఘం పిల్లలు జనం పాటలుపాడి, డప్పు నృత్యాలతో శ్రామికవర్గ సంస్కృతిని ప్రతిబింబించారు.


నర్సంపేటలో ప్రజాకళాకారుల ప్రదర్శన


నర్సంపేటలో కార్మికుల ప్రదర్శన


కరీంనగర్‌లో మేడే బహిరంగసభకు హాజరైన కార్మికులు

### విజయనగరం జిల్లా

#### విజయనగరం

ఎపిఎఫ్‌టియు కార్యాలయంలో మేడే జెండాను కా॥ బి. పాండురంగారావు ఆవిష్కరించగా ఎన్‌వైఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సంజీవ్ మేడే ప్రాముఖ్యత వివరిస్తూ పాలక వర్గాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల వలన కార్మికులు హక్కులను కోల్పోతున్నారని, అధిక ధరలు ప్రజలపై భారంగా మారాయని, కార్మికవర్గం హక్కులతో పాటు వ్యవస్థ మార్పుకోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఆర్. గోవిందు, షాప్స్ & ఎస్టాబ్లిష్‌మెంట్ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి కా॥ ఎం. అప్పలరాజు, వివిధ సంఘాల ముఖ్యులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడలోని నారాయణ స్టీల్స్‌వద్ద మేడే జెండాను ఎపిఎఫ్‌టియు నాయకులు కా॥ జి. శ్రీనివాసరావు ఎగురవేశారు. ఎపిఎఫ్‌టియు నాయకులు బి. శంకర్రావు పెట్టుబడిదారీ విధానపు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం నిర్వహించిన పోరాటాల గురించి వివరించారు. ఆటోయూనియన్ గౌరవ అధ్యక్షులు కె. పైడిరాజు, నారాయణ స్టీల్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. అప్పలస్వామి, లోడింగ్ అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆటోస్టాండ్ వద్ద మేడేజెండాను ఆటోడ్రైవరు ఎం. శంకర్రావు (తరువాయి 10-14 పేజీలలో)

# ‘కోటిపాం థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని వెంటనే రద్దుచేయాలి’

## రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో డా॥ బి.డి. శర్మ డిమాండ్



సదస్సులో ప్రసంగిస్తున్న డా॥ బి.డి. శర్మ, అనువదిస్తున్న డా॥ జస్వంతరావు; సదస్సుకు హాజరైన ప్రతినిధులు

**పార్వతీపురం, 13-5-11 :** ప్రజల జీవితాలను, జంఝావతి, నాగావళి నదుల్ని, పర్యావరణాన్ని పంట భూముల్ని, అడవుల్ని, భూగర్భ జలాల్ని నాశనం చేసే కోటిపాం వద్ద నిర్మించనున్న థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌యార్డు వద్ద సదస్సు జరిగింది. థర్మల్ విద్యుత్ కేంద్ర భాధిత గ్రామాల నుండి 400మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సదస్సుకు రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) విజయనగరం జిల్లా కోశాధికారి కా॥ పి. శ్రీనునాయుడు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కొమరాడమండలం కోటిపాంవద్ద 1675 ఎకరాల భూములు సేకరించి,12వేలకోట్లరూపాయల పెట్టుబడితో ఆల్ఫ్రా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించనున్న భారీథర్మల్ విద్యుత్ కేంద్రాన్ని రద్దు చేయాలని బాధిత గ్రామాల ప్రజలు, ప్రజాతంత్రవాదులు గతచాలాకాలంగా డిమాండ్ చేస్తున్నరనీ, అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెడుతూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నాయనీ, కంపెనీ యాజమాన్యం ప్రజలకు మాయమాటలు చెప్పడం, బెదిరించడం, ప్రలోభపెట్టడం వంటి మార్గాల ద్వారా అక్రమంగా రైతుల నుండి భూములు గుంజు కున్నారని, ఆనాటి నుండే కంపెనీ చర్యలను వ్యతిరేకిస్తూ వివధ రూపాలలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకత్వాన ప్రజలు ఉద్యమిస్తున్నారని అన్నారు.

సదస్సు ప్రారంభానికి ముందుగా కాకరాపల్లి, సోంపేటలలో థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడుతూ అసువులుబాసిన పోరు బిడ్డలకు జోహార్లు తెలుపుతూ ప్రతినిధులంతా 2 నిమిషాలు మౌనం పాటించారు.

తొలుత జనశక్తి సంపాదకులు కా॥ పి. జస్వంతరావు మాట్లాడుతూ ప్రజల హక్కుల్ని అన్ని రూపాలలో అణచి వేస్తూ దేశసంపదను, వనరుల్ని దోపిడీ వర్గాలకు కట్టబట్టేందుకే విచ్చలవిడిగా రాష్ట్రంలో అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఈ దేశ పాలకులు అనుమతించారని అన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు 45 విద్యుత్ కేంద్రాలకు అనుమతి ఇచ్చారని, కేంద్ర ప్రభుత్వం వద్ద 910 విద్యుత్ కేంద్రాలకు అనుమతి కోరుతూ దరఖాస్తులు ఉన్నాయని, ఈ విద్యుత్ కేంద్రాలన్నీ ప్రజల అవసరాలను, దేశప్రయోజనాలను నెరవేర్చేందుకు గాక సామ్రాజ్యవాద విద్యుత్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, దేశ వనరులు లూటీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. దీనికి ఉదాహరణగా విద్యుత్ తయారీకి అవసరమయ్యే జనరేటర్లను అమెరికా నుండి కొనుగోలు చేస్తూ అత్యంత సమర్ధవంతమైన ఈ దేశానికి చెందిన బి.హెచ్.ఇ.ఎల్. కంపెనీని ప్రక్కన పెట్టడం గమనించాలన్నారు. భారతదేశ అవసరాలకు మించి 3 రెట్లు అధికంగా జరగబోయే విద్యుత్ ఉత్పత్తి మైనింగ్ కంపెనీలకు, కోస్టల్ కారిడార్‌లకు, సెజ్‌లలో పెట్టబోయే సామ్రాజ్యవాద కంపెనీలకు మాత్రమేనని, లాభాలు దోపిడీ వర్గాలకు, నష్టాలు కష్టాలు ప్రజాలకా? అని ప్రశ్నించారు. జలయజ్ఞం పేరుతో పెడుతున్న ఖర్చు కూడా ప్రజలకు మేలు చేసేందుకు గాక ఈ కంపెనీల ప్రయోజనాల కోసమే అన్నారు. కనుక అభివృద్ధి పేరుతో సాగుతున్న పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టాలని అన్నారు.

సదస్సులో భారత్‌జన్ ఆందోళన్ ఛైర్మన్ డా॥ బి.డి. శర్మ మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అన్ని ప్రాంతాల ప్రజలకు అభినందనలు తెలిపారు. వత్తిడులను తట్టుకుంటూ ఇప్పటివరకూ భూమిని కాపాడుకుంటూ వచ్చిన రైతులకు అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజలు దున్నే వానికి భూమి అడిగారని, పాలకులకు ఈ సంగతి పట్టలేదని అన్నారు. భారత సాంప్రదాయంలో భూమి అమ్మకపు సరుకు కాదని, భూమి గ్రామీణ సమాజపు ఉమ్మడి ఆస్థి అని, బ్రిటీష్ పాలకులు భూమిని అమ్మకపు సరుకుగా, వ్యక్తిగత ఆస్థిగా మార్చిన ఫలితంగా సామాన్య ప్రజలు భూమి నుండి దూరం చేయబడుతున్నారని, భూమి తల్లి లాంటిదని, భూమికి-రైతుకు తల్లిబిడ్డల సంబంధం ఉందని, భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు వచ్చేవారిని అడ్డుకునేందుకు అన్ని మార్గాలలో పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. స్వాతంత్ర్యానంతరం పేదలకు, ధనికులకూ అంతరం తీవ్రంగా పెరిగిన ఫలితంగా ధనిక వర్గాలు డబ్బు ఎరజూపి భూమిని కొనుగోలు చేస్తున్నారని, డబ్బు విలువ రోజురోజుకు దిగజారుతూ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెడదుతున్నదని అన్నారు. ప్రజల అభీష్టం మేరకు పాలకులు నిర్ణయాలు (తరువాయి 15వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010